


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




గురువారం | 24-10-2019 | పేజీలు: 14 + 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 16 సంచిక (Issue) : 103 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 10.19 తదుపరి ద్వాదశి; నక్షత్రం: మఖ మ. 1.19 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా. 8.33-9.59; దుర్ముహూర్తం: ఉ. 10.05-10.51, మ. 2.41-3.27; అమృతఘడియలు: ఉ. 11.06-12.34 వరకు, తె. 5.13 మొదలు; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 5.45 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

# మునిసిపోల్స్ వచ్చే నెల్లో!

## వారంలో రిజర్వేషన్లు ఖరారు.. పది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్

## కేటీఆర్‌తో కలిసి సీఎం సమీక్ష.. నేడు ఎస్‌ఈసీకి సమాచారం

**హుజూర్‌నగర్ ఫలితానికి ఒకరోజు ముందే ముఖ్యమంత్రి కేసీఆర్ మునిసిపల్ ఎన్నికల నగారా మోగించారు. బుధవారం అధికారులతో సమావేశమై ఎన్నికల సన్నద్ధతను సమీక్షించారు. ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమాచారం అందించాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకున్న ఎస్‌ఈసీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ అందగానే షెడ్యూల్ ప్రకటన జారీకి సమాయత్తమవుతుంది.**


ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎన్నికలకు హైకోర్టు అభ్యంతరాలు తొలగిపోయినందున రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. సాధ్యమైనంత త్వరగా ఎన్నికలను పూర్తి చేయాలని భావిస్తోంది. పురపాలక మంత్రి కేటీఆర్, ముఖ్య కార్యదర్శులు నర్సింగరావు, అరవింద్ కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మలతో ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అధికారులు గురువారం

మిగతా 11వ పేజీలో...

## అటవీ సంస్థ చైర్మన్‌గా వంటేరు

**హుజూర్‌నగర్ ఫలితానికి ముందే పదవుల భర్తీకి శ్రీకారం**

**నేతల్లో 'నామినేటెడ్' ఆశలు.. ఉద్యోగులకూ శుభవార్త?**

11

## హోం ముఖ్య కార్యదర్శిగా రవిగుప్తా

**పౌర సరఫరాల కమిషనర్‌గా విశ్రాంత ఐఏఎస్ సత్యనారాయణరెడ్డి**

**జైళ్ల డీజీగా రాజీవ్ త్రివేది.. కేంద్ర సర్వీసుల్లోకి అకున్ సభర్వాల్**


మెదక్ నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సు పైన కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

# కార్మిక డిమాండ్ల విభజన

**తెల్లకార్డులు, ఆరోగ్యశ్రీ, ఆసరా పెన్షన్లు ప్రభుత్వం పరిష్కరించేవి**

**డబుల్ డ్యూటీలకు రెట్టింపు వేతనాల వంటివి ఆర్టీసీ పరిష్కరించేవి**

**ఈడీల కమిటీ తొలి సమావేశం.. పరిష్కారానికి మార్గాలపై చర్చ**

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల 21 డిమాండ్ల పరిశీలన కోసం ఎండీ సునీల్ శర్మ ఏర్పాటు చేసిన ఈడీల కమిటీ బుధవారం బస్‌భవన్‌లో తొలిసారిగా భేటీ అయింది. కమిటీ అధ్యక్షుడు టి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైకోర్టు చెప్పిన 21 అంశాలపై చర్చించారు. వీటిలో ఇప్పటికిప్పుడు పరిష్కరించగలిగిన సమస్యలేమిటి.. మధ్య, దీర్ఘకాలంలో పరిష్కరించగలిగేవి ఏవి అనే అంశాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో.. కార్మికుల 21 డిమాండ్లను రెండు భాగాలుగా విభజించారు. ప్రభుత్వ పరిధిలో

మిగతా 12వ పేజీలో...

## కోర్టుకు సీఎం కేసీఆర్ అబద్ధాలు



**విలీనాన్ని వెనక్కి తీసుకున్నామని నిరూపిస్తే ఉరికైనా సిద్ధం**

**26లో ఒక్క డిమాండునూ వదులుకోం: అశ్వత్థామరెడ్డి**

12

# కేసీఆర్‌పై నజర్!

**టీఆర్ఎస్ సర్కారుపై ఆరు నెలల్లో నలువైపులా ఉచ్చు**

**నేటి అసెంబ్లీ ఫలితాల తర్వాత బీజేపీ కార్యాచరణ**

**బలహీనంగా ఉన్నప్పుడే దెబ్బ పడాలని అభిప్రాయం**



న్యూఢిల్లీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణపై బీజేపీ అధిష్ఠానం నిర్దిష్ట కార్యాచరణతో రంగంలోకి దిగబోతోంది. హరియాణ, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడి, అక్కడ కొత్త సర్కార్లు కొలువుదీరిన తర్వాత రాష్ట్రంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించబోతోంది. ఆర్టీసీ సమ్మె సుదీర్ఘంగా సాగుతుండడం, కార్మిక-ఉద్యోగవర్గాలతో పాటు సకల జనుల్లో వెల్లువెత్తుతున్న నిరసనను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, నిర్వాకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసికెళ్లాలన్నది కమలనాథుల వ్యూహం. కేసీఆర్ సర్కార్‌పై

మిగతా 10వ పేజీలో...

## ఒక్క ఫలితం.. ఎందరికో జవాబు

టీఆర్ఎస్, కాంగ్రె‌స్‌లకు విషమ పరీక్ష

12

గౌరవప్రదమైన ఓట్లపై బీజేపీ, టీడీపీ నమ్మకం

హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు నేడే

మధ్యాహ్నం 2గంటల కల్లా తుదిఫలితం వెల్లడి



## బీఎస్ఎన్ఎల్‌లో ఎంటీఎన్ఎల్ విలీనం

**రూ.68,751 కోట్లతో పునరుద్ధరణ ప్యాకేజీ**

**సగం మందికి వీఆర్ఎస్**

**నెల రోజుల్లో 4జీ స్పెక్ట్రమ్ కేటాయింపు**

9

## విదేశీ కంపెనీలకు పెట్రోల్ పంపులు

**ప్రైవేట్ సంస్థలు కూడా ఏర్పాటు చేయొచ్చు**

**కేంద్ర కేబినెట్ ఆమోదం**



## ట్రక్కులో 39 శవాలు

8

బ్రిటన్‌లో సంచలనం

**మృతులు అక్రమ వలసదారులు!**

**రిఫ్రిజిరేటెడ్ ట్రక్కులో దాక్కుని దేశంలోకి ప్రవేశించే ప్రయత్నం**

**మైనస్ 25 డిగ్రీల ఉష్ణోగ్రతలో 4 రోజులు గడపడంతో మృతి**





నాగార్జున సాగర్‌లో బుధవారం 18 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

# రికార్డుల కృష్ణమ్మ

**ఈ ఏడాది ఏడోసారి తెరుచుకున్న శ్రీశైలం గేట్లు**

**నాగార్జునసాగర్ 18 గేట్ల నుంచి నీటి విడుదల**

**మూడు నెలల్లో ఎనిమిదోసారి ఎత్తివేత**

**డ్యామ్ నిర్మాణమైనప్పటి నుంచి ఇదే తొలిసారి**

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కృష్ణమ్మ బిరబిరా పరుగులిడుతోంది! అంచనాలకు మించి పోటెత్తి ప్రాజెక్టుల గుండా పొంగి పొర్లి దిగువకు ప్రవహిస్తోంది. జూరాల నుంచి సాగర్ దాకా అన్ని చోట్లా రికార్డు స్థాయి ప్రవాహంతో కళకళలాడిపోతోంది. ఎగువ నుంచి భారీగా ప్రవాహం వస్తుండడంతో జోగులాంబ

మిగతా 2వ పేజీలో...


వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట ప్రాంతంలో దెబ్బతిన్న పత్తి పంట

## పత్తి చేలకు వాన ముప్పు

**ఎడతెరిపిలేని వర్షాలతో ఒకేసారి 5 రకాల చీడపీడల దాడి**

**జాలుపడుతున్న పంట**

**నేల రాలుతున్న పూత, కాత**

2

**ఆందోళనలో రైతులు**




# అమ్మ భాషకు ఆంగ్ల గండం

## తెలుగు మాధ్యమం కనుమరుగు

**ఇంగ్లిషు మీడియం చదువుపై ఆసక్తి**

**ఒకటి నుంచి డిగ్రీ వరకు ఇదే పరిస్థితి**

**ఒకటో తరగతిలో ప్రవేశాల్లో 71% మంది ఇంగ్లిషు మీడియంలో చేరిక**

**పెరుగుతున్న ఇంగ్లిషు విద్యాసంస్థలు**

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కమ్మనైన అమ్మభాషకు కష్టాలు ఎదురవుతున్నాయి. మాతృభాషలో చదువు కనుమరుగవుతోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మనవాళ్లు ఇంగ్లిషుపై మక్కువ

మిగతా 10వ పేజీలో...

# డెంగీ నివారణలో సర్కారు ఫెయిల్



**డెంగీకి ధనిక-పేద తేడా ఉండదు**

**ఖమ్మం జిల్లా జడ్జి బలైపోయారు**

**మా ఆదేశాలు కూడా లెక్కచేయరా?**

**ఏం చేసినా ఊరుకుంటామనుకోవద్దు**

**దోమలను లెక్కించొద్దు.. చంపేయండి**

**అధికారుల కుటుంబాలకు సోకితే ఆ బాధ ఎలా ఉంటుందో తెలుస్తుంది**

**అన్యమనస్కంగా ఆరోగ్య శాఖ అఫిడవిట్**

**దోమల నివారణకు 'ఫ్రైడే-డ్రైడే' ఏంటి?**

**డెంగీ చర్యలపై హైకోర్టు ఆగ్రహం!**

11

## సీఎస్ సహా ఉన్నతాధికారుల హాజరీకి ఆదేశం.. నేడూ విచారణ



## 350 కట్టె కోత మిల్లుల బంద్

**నిలిచిన వ్యవసాయ పనిముట్ల తయారీ**

**స్మగ్లింగ్ కట్టడికి కేసీఆర్ ఆదేశాలు**

**అత్యుత్సాహంతో అధికారుల తాళాలు**

**లైసెన్సులుంటేనే తెరవాలని హుకుం**

**వ్యాపారులు, వడ్రంగులు ఒకేగాటన**

3

# బతుకుదెరువు కోసం.. పట్నం బాట!

**కామారెడ్డి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి), ఎల్లారెడ్డి టౌన్:** ఇదివరకు కన్న ఊళ్లోనే చేతినిండా పని చేసుకున్న వారంతా, ఇప్పుడు పొట్ట కూటి కోసం పట్నం బాట పట్టారు. ముఖ్యంగా ఇక్కడి ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లేక ఊర్లు ఊర్లే పొట్టకూటి కోసం పట్టణాలకు వలస బాట పట్టారు. పట్నం వెళ్లిన వారంతా అడ్డాల మీద కూలీలు చేసుకోవడం, వివిధ కంపెనీలలో చిన్నచిన్న పనులు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇలా వెళ్లిన వారితో ఆ గ్రామాల్లో ఇళ్లకు తాళాలే ఎక్కువగా కనిపిస్తుండడాన్ని ఆ గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇది వరకు కలిసిమెలిసి బతికామని అందరూ గ్రామాలని విడిచి ఉపాధి కోసం వెళ్లిపోతున్నారని గ్రామ పెద్దలు చెమర్చిన కళ్లతో తమ బాధను వెల్లగక్కుకుంటున్నారు. వారితో ఇదివరకు జ్ఞాపకాలను నెమరేసుకుంటున్నారు. ఇక ఇప్పుడున్న గ్రామాల్లో చాలా వరకు ఇళ్ళల్లో తమ పిల్లలను, కుటుంబ సభ్యులను దూరం చేసుకుని బ్రతుకుతున్న వృద్ధులే ఎక్కువగా దర్శనమిస్తారు.. కాగా ఆర్థిక పరిస్థితులు అనుకూలించక, కటిక దరిద్రాలతో ఉన్నవారు కన్నవారిని వదిలి కూటి కోసం కూలీ పనులను చేసుకుంటూ జీవిస్తున్నారు. ఊళ్లో ఉంటే ఏమొస్తది, పట్నం పోతే పది రాళ్లు వెనకేసుకొని, పూట గడుపుకోవచ్చు. ఈడేముంది ఉపాధి లేదు, ఏమీలేదు.. అప్పులు తప్ప. అంటూ గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు కూలీ పనుల కోసం వెళ్లారు. వీరంతా ఇప్పుడు హైదరాబాద్‌లోని యాప్రాల్, గండిమైసమ్మ, సూరారం, షాపూర్, అత్తాపూర్, ఇలా పలు ప్రాంతాలలో ఉదయాన్నే అడ్డా మీదకు వెళ్లి కూలీ పనులకు వెలుతున్నారు. కూలీ దొరికితే ఆ రోజు పండుగే.. లేదంటే రోజంతా ఎండుడే.. ఇదీ కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ప్రాంతంలోని పలు గ్రామాలలోని ప్రజల దుస్థితి.

**వలసలకు మారుపేరుగా ఎల్లారెడ్డి**

వలసలకు మారుపేరుగా మారింది ఈ ఎల్లారెడ్డి ప్రాంతం. రోజు పదుల సంఖ్యలో వలసలు వెళ్లడమే. ఎల్లారెడ్డి మున్సిపాల్టీ పరిధిలోని ఒక్క లింగారెడ్డి పేట


ఎల్లారెడ్డి ముఖచిత్రం

గ్రామంలోనే సుమారుగా 70శాతం మంది ప్రజలు వలస బాట పట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఈ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో గతంలో వంద కు పైగా విద్యార్థులు ఉండేవారు. వీరికి చదువు చెప్పేందుకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేవారు. క్రమక్రమంగా ఈ విద్యార్థుల సంఖ్య 30కి తగ్గిపోయింది. ఉపాధ్యాయుల సంఖ్య ఇద్దరికి తగ్గింది. అదేమిటని ప్రశ్నిస్తే.. వీరి తల్లిదండ్రులు వలసపోతున్నారు కదా అని ఉపాధ్యాయుల బదులిస్తున్నారు. మిగతా గ్రామాల్లో సైతం అనేక మంది వలస బాట పట్టారు. పండగొస్తేనే వీరికి కన్న ఊరు గుర్తొస్తుంది. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా.. ఎంత మంది నాయకులు వచ్చినా.. వీరి బ్రతుకులు మాత్రం మారడం లేదు.. ఎన్నికల సమయంలో ఓటుకోసం నోట్లు పంచి పట్టణాల నుంచి తీసుకువస్తారు. ఓట్లు వేయగానే మర్చిపోతారు. వీరిని పాలకులు పట్టించునేది కేవలం ఓట్ల పండుగ వచ్చినప్పుడే.. వీరి వలసలను అడ్డుకోవడానికి నాటి నుంచి నేటి వరకు పాలిస్తున్న ఏ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు.. వీరి వలసలకు అడ్డుకట్ట వేసే ఆలోచనే చేయడం లేదు. ఉపాధి కల్పన కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్‌కు వెళ్ళే ప్రతీ ఆర్టీసీ బస్సులో ఎక్కువ మొత్తంలో కనిపించేది వలసలు వెళ్లే కూలీలే.. ఇక్కడి ప్రాంత ప్రజలే. వీరితో బస్సులు కిటకిటలాడుతాయంటే

మిగతా 10వ పేజీలో...

# ఏది నిజమైన ఆనందం?

పరంజ్యోతి

*సుఖియా సబ్ సంసార్‌హై, ఖాయే ఔర్ సోయే*
*దుఖియా దాస్ కబీర్ హై, జాగే ఔర్ రోయే*



అనుభవించే సుఖాలన్నీ ఎప్పుడూ ఉంటాయనుకుంటూ మరో విచారమేది లేకుండా తింటూ తిరుగుతూ హాయిగా నిద్రపోతున్నారు ప్రజలందరు. కబీరుదాసు మాత్రం వీళ్ల అజ్ఞానాన్ని చూసి ఏడుస్తూ కంటి మీద కునుకు లేకుండా జాగరణ చేస్తున్నాడు.

తాత్కాలికమైన సుఖభోగాలే శాశ్వత ఆనంద నిలయాలని భ్రమించే ప్రపంచాన్ని చూసి కబీరు కలత చెందుతున్నాడని భావం.

తమ వ్యక్తిత్వాలను బట్టి ప్రజలు సుఖంగా ఉండడానికి వేర్వేరు దారులు వెదుక్కుంటుంటారు. ఒకరు ఆహారంలో సంతోషాన్ని వెదుక్కుంటుంటే, మరొకరు సంపదలో, ఇంకొకరు పదవిలో ఆనందం పొందడానికి ప్రయత్నిస్తుంటారు.

ఈ ప్రపంచ పోకడలను చూసిన రమణ మహర్షి "నిన్ను నువ్వు తెలుసుకొని అందుకనుగుణంగా నడిచినప్పుడే నిజమైన ఆనందమేదో అర్థం చేసుకోగలవు" అంటాడు. శాశ్వత ఆనందం పొందడానికి నిష్కామకర్మల పట్ల అనురక్తి కలిగి ఉండాలంటుంది విదురనీతి.

మనం బయటి ప్రపంచాన్ని కళ్లతో చూస్తున్నాం, చర్మంతో తాకుతున్నాం, చెవులతో వింటున్నాం, నాలుకతో రుచి చూస్తున్నాం, ముక్కుతో సువాసనలు పీల్చుకుంటున్నాం. ఈ ఐదింటి వలన బయటి ప్రపంచం మన లోపలికి వెళ్తుంది. కానీ ఈ ఇంద్రియాలేవీ కూడా మనల్ని శాశ్వత ఆనందం వైపు నడిపించలేవు. ఆకలితో ఉన్నవారికి అన్నంపెట్టి, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకున్నపుడే మనకు తెలియకుండగానే మనలో ప్రేమ, దయ, అనురాగం పుట్టుకొస్తాయి. మనస్సంతా సంతృప్తితో నిండిపోతుంది. అప్పుడు కలిగే అనుభూతినే కృష్ణపరమాత్మ నిజమైన ఆనందం అంటాడు. దాన్నే సాత్విక ఆనందం అంటున్నారు జ్ఞానులు.



దోషాలను తొలగించుకోవడానికి లేదా భగవంతుని కృపను పొందడానికి చాలా మంది దానధర్మాలు చేస్తుంటారు. అలాంటి వారిని ధనవంతులు గానే గుర్తిస్తారు కానీ, దాతలుగా పిలవరు. తమ కోసం ఉంచుకొన్నదేదైనా పరుల అవసరాలు తీర్చడానికి ఇచ్చే వాళ్లను ధర్మాత్ములు, మహాత్ములు అంటుంది మహాభాగవతం. దానశీలురు, ధర్మాత్ములకున్న దైవిక గుణాలతో దైవాన్నే నేలకు దించగలరని తెలిపే కథను శ్రీమద్భాగవతంలోని తొమ్మిదవ అధ్యాయంలో వర్ణించాడు వేదవ్యాసుడు.

రంతిదేవుడు చంద్రవంశపురాజుగా రంతీపురాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలిస్తుంటాడు. ఆ రాజ్యంలో ఏళ్ల తరబడి వర్షాలు కురియక, పంటలు పండక కరువు కాటకాలతో ప్రజలు విలవిలలాడుతుంటారు. ప్రజలను ఆదుకోవడానికి రంతిదేవుడు ధనాగారాన్నంతా ఖాళీ చేసి అందరి ఆకలిదప్పులు తీరుస్తుంటాడు. నలభై తొమ్మిది రోజుల పాటు స్వయంగా మహారాజు ఆయన కుటుంబం, ఆకలితో అలమటిస్తుంటారు. నలభై తొమ్మిదవ రోజున మహారాణి ఎవరో తెచ్చిన కొద్దిపాటి ధాన్యంతో ఆహారం సిద్ధం చేస్తుంది. వడ్డించుకొని ఆరగించేలోగా ఒక పేదవాడు ఆకలితో ఉన్నాను, అన్నం పెట్టండని అర్థిస్తాడు. రంతిదేవుడు సంతోషంగా కొంత అన్నాన్ని అతనికి పెడతాడు. అన్నం తిన్న పేదవాడు అటుగా వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి తిందామనుకుంటుండగా ఇంకో ఇద్దరు వస్తారు. వాళ్లకూ సంతోషంగా సమర్పిస్తాడు రాజు. ఓ పండు ముదుసలి "అయ్యా, నేనూ నా కుక్కలు నాలుగు రోజుల నుండి పస్తులుంటున్నాం. తినడానికేమైనా పెట్టి మమ్మల్ని బ్రతికించండి" అంటాడు. లేదనకుండా ఆయనకు, ఆ కుక్కలకు అన్నం పెడతాడు. ఇంకా రంతిదేవుని వద్ద మిగిలిన నీళ్లతోనైనా ఆకలి తీర్చుకుందామనుకునేసరికి "ప్రభూ, నోరెండుకుపోయి గొంతు పిడిచకడుతుంది. గుక్కెడు మంచి నీళ్లిప్పించండి" అంటూ బతిమాలుతాడు ఆ ముదుసలి. ఉన్న ఆ కొద్ది మంచినీళ్లను ఆయనకిచ్చి తృప్తిగా ఆనందిస్తాడు రంతిదేవుడు సర్వం కృష్ణార్పణం అనుకుంటూ. అప్పుడు దేవతలంతా ప్రత్యక్షమై రంతిదేవుని దానగుణాన్ని మెచ్చుకొని దీవిస్తారు. ఇలా ధర్మబద్ధమైన ఆనందమే మనిషికి జీవనలక్ష్యం కావాలి. 'లోకంతో నాకేమిటి ఉపయోగం' అనుకోవడం కాదు, 'నా వల్ల లోకానికి ప్రయోజనం ఏమిటి' అని ప్రశ్నించుకున్నప్పుడే నిజమైన ఆనందానికి సరియైన దారి కనిపిస్తుంది.

**- పరికిపండ్ల సారంగపాణి, 98496 30290**

## లోకం తీరు




అగ్గిపెట్టె లేదు సార్... దీంతో ముట్టించండి..!

### చలి కాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 22.0 | 29.9 |
| వరంగల్ | 22.0 | 29.5 |
| ఆదిలాబాద్ | 22.7 | 31.3 |
| ఖమ్మం | 23.0 | 27.0 |
| నల్లగొండ | 24.0 | 29.4 |

### శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దాదాపు 60 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి దాదాపు 6గంటలు పడుతోంది. శుక్రవారం ఆర్జితసేవలకు సంబంధించి విజయాబ్యాంకులో గురువారం లక్కీడిప్‌లో జారీ చేసే టిక్కెట్లు సుప్రభాతం:50, వస్త్రాలంకరణ:3,అభిషేకం:26, కల్యాణోత్సవం:80 అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.

# పత్తి చేలకు వాన ముప్పు

## ఒకేసారి 5 రకాల చీడపీడల దాడి.. నేల రాలుతున్న పూత

హైదరాబాద్, అక్టోబరు, 23(ఆంధ్రజ్యోతి): దుక్కులు దున్ని, విత్తిన పత్తి కొన్నాళ్లకు భూపొరల్లోంచి మొలకెత్తి.. ఏపుగా పెరుగుతుంటే కష్టమంతా మరిచిన రైతు పంట దిగుబడి మీద గంపెడాశ పెట్టుకున్నాడు! ఇప్పుడదే రైతు ఆశలన్నీ అడియాసలవుతున్నాయి! ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చేదశలో పత్తి పంట నాశనమవుతోంది. చేలలో నీళ్లు నిలిచి పంట ఎక్కడికక్కడ దెబ్బతింటోంది. పత్తి కాయలు బూజు పట్టి నల్లగా మారుతున్నాయి. కొన్నిచోట్ల విచ్చుకున్న పత్తి తడసిపోతోంది. వీటికి తోడు ఐదురకాల చీడపీడలు ఏకకాలంలో విరుచుకుపడి పత్తి పంటను నిలువునా పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పత్తి పంట పరిస్థితి దయనీయంగా తయారైంది. రాష్ట్రవ్యాప్తంగా 18.6 లక్షల హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేయగా... సింహభాగం పత్తి పంటపై అధిక వర్షాల ప్రభావం పడింది. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. వ్యవసాయ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

**నివారణకు ఇవి వాడొచ్చు: రాంప్రసాద్, శాస్త్రవేత్త**

- పచ్చదోమ నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఫ్లోనికామి 0.3 గ్రా. లేదా డయాఫెన్ థయూరాన్ 1.25 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- తెల్లదోమ నివారణకు ఎకరానికి 10 చొప్పున ఎల్లోస్టిక్ ట్రాప్‌లు అమర్చుకోవాలి. దోమ తీవ్రతకు అనుగుణంగా ఎఫిసేట్ 1.5 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 1 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- బ్యాక్టీరియా, ఆకుమచ్చ తెగులు నివారణకు 10 లీటర్ల నీటికి 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్+ 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ లేదా 2 గ్రా. ప్లాంటోమైసిన్ వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
- కాయకుళ్లు తెగులు నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. కార్బండిజమ్+ మాంకోజెబ్ మిశ్రమాన్ని లేదా 10 లీటర్ల నీటికి 30 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్+ 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ లేదా 2 గ్రా. ప్లాంటామైసిన్‌ను వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు 2.5 గ్రా. కార్బండిజమ్+ మాంకోజెబ్ మిశ్రమాన్ని లేదా 3 గ్రా. కాబ్రియోటాప్(పైరాక్లోస్ట్రోబిన్+ మెటిరామ్) లేదా 1 మి.లీ. ప్రొపికొనజాల్ లేదా 2 మి.లీ. హెక్సాకొనజోల్‌ను లీటరు నీటికి కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. -ఆకులు ఎర్రబడి, పూత కాత రాలిపోతున్నపుడు వర్షపు నీటిని తీసివేసిన తర్వాత లీటరు నీటికి 10 గ్రా. 13-0-45 + 5 గ్రా. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. పూత, కాత రాలటం అధికంగా ఉంటే 15 లీటర్ల నీటికి 3 మి.లీ. ప్లానోఫిక్స్‌ను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

### తెగుళ్లు బాబోయ్

పత్తి పంటపై పచ్చ దోమ, తెల్ల దోమ, బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు, కాయకుళ్ల తెగులు, ఆకుమచ్చ తెగులు, ఆల్టర్నేరియా కాండం మచ్చ తెగులు దాడిచేసి ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. తెగుళ్ల దెబ్బతో పత్తి చేలు ఎర్రబడటంతోపాటు పూత, కాత రాలి పోతోంది. తెల్ల దోమ తీవ్రతకు పక్వానికి రాకముందే కాయలు పగిలి పోతున్నాయి. కాయలపై పురుగులు చేసిన రంధ్రాల ద్వారా వర్షపు నీరు కాయల లోపలికి వెళ్తోంది. దీంతో కాయ కుళ్లిపోతోంది. అధిక తేమ కారణంగా మచ్చ తెగులు వ్యాపిస్తోంది. దీని ప్రభావంతో చేనులో చాలా ప్రదేశాల్లో ఆకులు పండుబారి, పసుపు రంగులోకి మారుతున్నాయి. కొమ్మలు కూడా పెసులుబారి పోతున్నాయి. కొన్ని మొక్కలు చనిపోతున్నాయి. కొన్నిచోట్ల రైతులు పత్తి తీస్తున్నారు. అధిక వర్షాలతో పత్తి రంగు మారే ప్రమాదం కూడా ఉంది. దీంతో ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు పత్తి తీసి ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకెళ్లాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో దెబ్బతిన్న పత్తి పంట



# రికార్డుల కృష్ణమ్మ

శ్రీశైలం, జూరాల గేట్లు ఎత్తడంతో దిగువకు విడుదలవుతున్న నీరు



(మొదటిపేజీ తరువాయి)

గద్వాల జిల్లాలో ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు 33 గేట్లను బుధవారం ఎత్తి 3.50 లక్షల క్యూసెక్‌ల నీటిని దిగువకు విడుదల చేశారు. బుధవారం రాత్రికి మరింత వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక.. జూరాలతో పాటు సుంకేశుల డ్యామ్ నుంచి కూడా నీరు పోటెత్తడంతో శ్రీశైలం జలాశయానికి 4.3 లక్షల క్యూసెక్కుల నీరు పోటెత్తింది. దీంతో బుధవారం డ్యాం పది క్రస్ట్‌గేట్లను 15 అడుగుల మేర ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేశారు. ఈ ఏడాదిలో శ్రీశైలం డ్యామ్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయడం ఇది ఏడోసారి. డ్యామ్ పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 884.80 అడుగుల మేర నీరు చేరింది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా 214.3637 టీఎంసీల వద్ద నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇక.. శ్రీశైలం నుంచి బుధవారం భారీగా నీరు రావడంతో సాగర్ ప్రాజెక్టు 18 గేట్లను 10 అడుగుల మేర ఎత్తారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి మూడు నెలల కాలంలో ఎనిమిది సార్లు గేట్లను ఎత్తారు. నాగార్జున సాగర్ డ్యామ్ నిర్మాణం పూర్తయినప్పటి (1967) నుంచి ఇప్పటిదాకా.. అంటే ఈ 52 ఏళ్ల కాలంలో వర్షాకాలం సీజన్‌లో ఎనిమిదిసార్లు గేట్లు ఎత్తడం ఇదే మొదటిసారి. నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 312టీఎంసీలు కాగా; ప్రస్తుతం ఎగువన వరదతో నిండుకుండను తలపిస్తోంది. అంచనాకు మించి వరద పోటెత్తుతుండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా కిందికి వదులుతున్నారు. రెండు నెలలుగా డ్యామ్ నుంచి 525 టీఎంసీలు వృథాగా సముద్రం పాలయ్యాయి. దాదాపుగా రెండు సార్లు డ్యామ్‌ను నింపుకొనేటన్ని నీళ్లవి!! కాగా.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లాలో నిర్మించిన లక్ష్మీ బ్యారేజీ నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. బ్యారేజీ 15 గేట్లను ఎత్తి 60 వేల క్యూసెక్కుల నీటిని బుధవారం దిగువకు విడుదల చేశారు.

### గ్రిడ్‌కు పొంచి ఉన్న గండం

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ అనూహ్యంగా పడిపోవడంతో విద్యుత్తు సంస్థలు గ్రిడ్‌ను కాపాడుకోవడానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఏకంగా 19శాతం డిమాండ్ తగ్గిపోయింది. దాంతో థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తిని తగ్గించుకోవడంతోపాటు సంప్రదాయేతర వనరుల ద్వారా ఉత్పత్తిని కొన్ని రోజులు తగ్గించాలని నిర్ణయించినట్లు ట్రాన్స్‌కో తెలిపింది. స్టేషన్లను బ్యాక్‌డౌన్ చేస్తున్నామని, కొన్ని కేంద్రాలను మూసివేస్తున్నామని వెల్లడించింది. ఏటా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఖరీఫ్ కోసం డిమాండ్ ఉంటుంది. కానీ.. ఈసారి భారీ వర్షాలతో డిమాండ్ తగ్గిందని అధికారులు తెలిపారు.



### మోదీపై ఆత్మాహుతి దాడి చేస్తా

*భారత్ ప్రధాని నరేంద్ర మోదీపై ఆత్మాహుతి బాంబు దాడి చేస్తా. కశ్మీర్ బిడ్డగా అంటున్నా.. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేసిన మోదీ ఓ హిట్లర్.*

**- రబీ పీర్‌జాదా, ట్విటర్‌లో పాకిస్థాన్ పాప్ సింగర్**



### కశ్మీరుపై మోదీ చర్యలకు భారత పార్లమెంట్ ఆమోదం

మోదీ మళ్లీ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. కశ్మీరుపై మోదీ సర్కారు నిర్ణయాలను భారత పార్లమెంటు ఆమోదించింది. దానికి సంబంధించిన వ్యాజ్యాలను ప్రస్తుతం సుప్రీం కోర్టు విచారిస్తోంది. భారత రాజ్యాంగ సంస్థలు చురుగ్గా పనిచేస్తున్నాయి.

**- అమెరికా మంత్రి వెల్స్ వ్యాఖ్య**



పోలీసుల అదుపులో బండ్ల గణేశ్

## చెక్కుల బౌన్స్ కేసులో నిర్మాత బండ్ల గణేశ్ అరెస్టు

- **నేడు కడప కోర్టులో హాజరు**

బంజారాహిల్స్/హైదరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాత బండ్ల గణేశ్‌ను బంజారాహిల్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చెక్కుల బౌన్స్ కేసులో కడప కోర్టు వారెంట్ జారీ చేయడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. 2014లో కడపకు చెందిన వ్యాపారి మహేశ్ నుంచి గణేశ్ రూ. పదిలక్షలు తీసుకున్నారు. తిరిగి చెల్లింపునకు ఇచ్చిన మూడు చెక్కులు బౌన్స్ అయ్యాయి. మహేశ్ పలుమార్లు గణేశ్‌కు నోటీసులిచ్చినా ఆయన సమాధానమివ్వలేదు. దీంతో ఆయన 2017లో కోర్టును ఆశ్రయించారు. బండ్ల గణేశ్‌ను అరెస్టు చేసి తమ ముందు హాజరుపర్చాలని కడప కోర్టు బంజారాహిల్స్ పోలీసులను ఆదేశించింది. ఇదిలావుండగా, ఇటీవల పారిశ్రామికవేత్త పీవీపీ నివాసం వద్ద హంగామా సృష్టించిన గణేశ్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు పెట్టారు. దీనికి సంబంధించి బుధవారం నోటీసు తీసుకునేందుకు స్టేషన్‌కు రావాలని పోలీసులు గణేశ్‌ను కోరారు. గణేశ్ జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌కు వచ్చి బయటకు రాగానే చెక్కుల బౌన్స్ కేసులో ఆయన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం పోలీసులు ఆయన్ని కడప కోర్టు ముందు హాజరుపర్చనున్నారు. గణేశ్‌పై మొత్తం 15 చెక్ బౌన్స్ కేసులు ఉన్నాయి.

# శిశువిహార్‌లో మృత్యుఘోష




## 10 నెలల్లో 9 మంది.. ఇటీవల ఒకే రోజు ఇద్దరు పిల్లలు మృతి

**ఒకరు తలకు గాయమై చనిపోయినట్లు నివేదిక**

**సిబ్బంది నిర్లక్ష్యంతో పిల్లలకు తరచూ అనారోగ్యం**

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కొందరు తల్లిదండ్రులు లేని శిశువులు.. ఇంకొందరు వద్దనుకొని వదిలేసిన పిల్లలు! అనాథలైన ఆ శిశువులకు ప్రేమను పంచి.. ఆకలి తీర్చి.. ఆలనాపాలన చూడాల్సిన బాధ్యతలో హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని శిశువిహార్ గాడి తప్పుతోంది! గత పది నెలల్లో అంటే గత జనవరి నుంచి ఇప్పటి వరకు 9 మంది శిశువులు మృతిచెందారు. అనారోగ్యం బారిన పడి సరైన సమయంలో వైద్య సేవలు అందక కొందరికి.. ఆహారం అందక ఆకలితో ఇంకొందరికి నెలల వయసులోనే నూరేళ్లు నిండుతున్నాయి. జూలై 14న నాలుగు నెలల నిత్య అనే పాప జారి పడటంతో తలకు గాయమైంది. ముక్కు, చెవుల నుంచి రక్తం కారింది. ఆ చిన్నారిని నిలోఫర్‌కు తరలించగా అప్పటికే ఆ పాప చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే, పాప పోస్టుమార్టం నివేదికలో దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెలుగు చూశాయి. తలకు గాయంతో పాటు తీవ్రమైన ఆకలి వల్లే నిత్య చనిపోయినట్లు నివేదిక పేర్కొంది. నిత్యను ఆస్పత్రికి తరలించిన రోజే సత్యశ్రీ అనే 9 నెలల చిన్నారికి ఫంగల్ ఇన్ఫెక్షన్ సోకింది. ఆ పాపను కూడా నిలోఫర్‌కు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది. ఒకే రోజు నిత్య, సత్యశ్రీ చనిపోయారు. దీనిపై విచారణ జరపాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఓ స్వచ్ఛంద సంస్థ బుధవారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది.

### ఓ దాత.. అంబులెన్స్ ఇచ్చినా

శిశువిహార్ సిబ్బంది నిర్లక్ష్యానికి ఇదో ఉదాహరణ. అక్కడ పిల్లలు తరచూ అనారోగ్యానికి గురి అవుతుండటం, వారిని ఆటోల్లో నిలోఫర్‌కు తీసుకెళ్తుండటాన్ని చూసి చలించిపోయిన ఓ దాత అంబులెన్స్‌ను అందజేశారు. అయితే, అక్కడి సిబ్బంది దాన్ని వాడకుండా ఆటోలోనే వెళ్తున్నారు. గత జూలై 14న చనిపోయిన నిత్య అనే చిన్నారిని కూడా ఆటోలోనే తీసుకెళ్లారు. పిల్లల అనారోగ్యం విషయాన్ని బయటకు రానివ్వకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు.

### స్నానం లేక.. పొక్కులు

శిశువిహార్‌లో ప్రస్తుతం 210 మంది పిల్లలు ఉండగా..120 మంది ఆయాలు పనిజేస్తున్నారు. ఎప్పటికప్పుడు చిన్నారుల గదులను శుభ్రం చేయడం, పసికందులకు పాలుపట్టడం, తరచూ వైద్య పరీక్షలు చేయించడం వీరి విధి. ఎప్పటికప్పుడు వీటిని అధికారులు పర్యవేక్షించాలి. అయితే ఇవన్నీ జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పిల్లలకు సరిగా స్నానం చేయించకపోవడంతో శరీరంపై తరచూ పొక్కులు వస్తున్నాయి.

### అంబులెన్స్ వాడాలన్న రూల్ లేదు

పిల్లల ఆరోగ్య విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపం. చనిపోయిన పిల్లల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం ఎంతమాత్రం లేదు. పిల్లలు అనారోగ్యానికి గురయితే ఆస్పత్రికి పంపుతాం. ప్రతిసారి అంబులెన్స్ వాడాలన్న నిబంధన ఏమీ లేదు. అవసరాన్ని బట్టి వాడతాం లేకపోతే లేదు. అదంతా మా ఇష్టం.

**- లక్ష్మీదేవి, జాయింట్ డైరెక్టర్, మహిళా సంక్షేమశాఖ**

### విచారణ జరపాలి

శిశువిహార్‌లో తరచూ చిన్నారులు అనారోగ్యానికి గురవుతూ చనిపోతున్నారు. నిత్య అనే పాప తలపై గాయం వల్ల చనిపోయిందని పోస్టుమార్టంలో తేలింది. శిశువిహార్‌లో చనిపోయిన శిశువులందరి మరణాలపై విచారణ జరపాలని కోరుతూ సీపీకి ఫిర్యాదు చేశాం.

**- అచ్యుతరావు, ఎన్జీవో సంస్థ ప్రతినిధి**

# షైన్ ఆస్పత్రిలో అన్నీ అక్రమమే

- **అనుమతి 20 పడకలకు.. ఉన్నవి 58**
- **పై అంతస్తులో రేకుల షెడ్డే ఐసీయూ**
- **ప్రభుత్వానికి విచారణాధికారి నివేదిక**

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐసీయూలో షార్ట్ సర్క్యూట్ వల్లే షైన్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం జరిగిందని.. ఆ ఆస్పత్రిలో అన్నీ ప్రభుత్వం నుంచి తీసుకున్న అనుమతులకు విరుద్ధంగానే ఉన్నాయని విచారణాధికారి నివేదిక ఇచ్చారు. ఆ నివేదికలో ముఖ్యాంశాలు..




- ఆస్పత్రి భవనంలోని పై అంతస్తులో రేకుల షెడ్డులో ఐసీయూని ఏర్పాటు చేశారు. అందుకు అది అనుకూలమైన స్థలం కాదు.
- ఐసీయూలో రిఫ్రిజిరేటర్, దానిపైనే ఏయిర్ కండిషనర్ ఉన్నాయి. షార్ట్ సర్క్యూట్‌కు అదే ప్రధాన కారణం.
- వైద్య ఆరోగ్య శాఖ నుంచి 20 పడకలకు అనుమతి తీసుకుని ఏర్పాటు చేసిన ఈ ఆ స్పత్రిలో.. 58 పడకలను నిర్వహిస్తున్నారు. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధం.
- భవనం కొలతలు జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం లేవు. ఆస్పత్రికి ప్రవేశమార్గమే.. నిష్క్రమణ మార్గం కూడా. అది తప్ప బయటకు వెళ్లడానికి మరో మార్గం లేదు. ఇది కూడా నిబంధనల ఉల్లంఘనే.
- ఆస్పత్రికి తగ్గట్లుగా నీటి నిల్వలు అందుబాటులో లేవు.
- ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీ రెన్యువల్ చేయించుకోలేదు.

### షైన్ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రద్దు

నిర్లక్ష్యంతో నాలుగు నెలల శిశువు మృతికి కారణమైన షైన్ ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. వాస్తవానికి ఇటువంటి కేసుల్లో ముందుగా షోకాజ్ నోటీసులు ఇచ్చి... అనంతరం చర్యలు తీసుకుంటారు. కానీ జరిగిన సంఘటన తీవ్రత, ఆస్పత్రిలో అన్నీ అనుమతులకు విరుద్ధంగా ఉన్న నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నారు.



### బీపీ మాత్రలు రాత్రే మేలు

మాడ్రిడ్, అక్టోబరు 23: బీపీ ఉన్నవారు సాధారణంగా ఉదయం లేవగానే మందులు వేసుకొంటారు. డాక్టర్లు కూడా అలాగే చెప్తారు. అయితే స్పెయిన్‌కు చెందిన శాస్త్రవేత్తల పరిశీలనలో మాత్రం ఈ మాత్రలను రాత్రి నిద్రపోయే ముందు వేసుకొంటే అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తాయని తేలింది. నిద్రపోయే ముందు మాత్రలు వేసుకోవడం వల్ల బీపీ అదుపులో ఉండటమే కాక గుండెపోటు లాంటి తీవ్రమైన వ్యాధులకు గురయ్యే ప్రమాదం సగానికి తగ్గిందని శాస్త్రవేత్తలు తెలిపారు. 19వేల మందిపై సగటున 6 సంవత్సరాల పాటు పరిశోధనలు నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు.

### క్వాంటమ్ కంప్యూటింగ్‌లో గూగుల్ మైలురాయి

సాన్‌ఫ్రాన్సిస్కో, అక్టోబరు 23: క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనలో మైలురాయిని సాధించామని గూగుల్ తెలిపింది. వేల సంవత్సరాల సమయం తీసుకొనే లెక్కలను సైతం నిమిషాల్లోనే పరిష్కరించే క్వాంటమ్ ప్రాసెసర్‌ను కనిపెట్టామని పేర్కొంది. తాము అభివృద్ధి చేసిన 'సైకామోర్' అనే ప్రాసెసర్.. 3 నిమిషాల 20 సెకండ్లలోనే లెక్కలను పరిష్కరించిందని, ఇదే సమస్యను పరిష్కరించడానికి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌కంప్యూటర్‌కు సైతం పదివేల ఏళ్లు పడుతుందని ఓ ప్రకటనలో గూగుల్ వ్యాఖ్యానించింది. అయితే గూగుల్ వ్యాఖ్యలను ఐబీఎం ఖండించింది. అవే లెక్కలను పరిష్కరించడానికి తమ సంప్రదాయ సూపర్‌కంప్యూటర్ 'సమ్మిట్' కు అంత సమయం పట్టదని, రెండున్నర రోజుల్లోనే ఆ సమస్యలను పరిష్కరిస్తుందని పేర్కొంది.

# 6నెలలుగా 350 సామిల్లుల బంద్

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 'కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు' అన్నచందంగా అటవీశాఖ అధికారులు వ్యవహరించిన తీరుకు సామిల్లుల (కోత యంత్రాలు) యజమానులు గోస పడుతున్నారు. కలప అక్రమ రవాణాను అరికట్టే పేరుతో ఏళ్లుగా నడుస్తున్న సామిల్లులను మూసివేసి, కులవృత్తినే నమ్ముకున్న మా పొట్టకొడతారా? అని వడ్రంగి, కమ్మరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి గోసకు కారణం కలప స్మగ్లింగ్‌పై సీఎం కేసీఆర్ ఆదేశాలను అమలు పరిచే విషయంలో అటవీశాఖ అధికారుల అత్యుత్సాహమే! అక్రమ కలప వ్యాపారులను అడ్డుకోవాల్సింది పోయి లైసెన్సులు లేవంటూ రాష్ట్రవ్యాప్తంగా 350 సామిల్లులకు తాళం వేశారు. 30 మిల్లుల్లోని యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఫలితంగా ఆరు నెలలుగా సామిల్లులు మూతపడటంతో 'కమ్మరి కొలిమిల దుమ్ము పేరెను' అంటూఓ పాటలో గోరటి ఎంకన్న ఆవేదన వ్యక్తం చేసినట్లుగా పరిస్థితి తయారైంది. సామిల్లుల మూసివేతతో వ్యవసాయ పరికరాల తయారీ నిలిచిపోయింది. వృత్తినే నమ్ముకున్న 3లక్షల మంది వడ్రంగులు, కమ్మరికుల వృత్తులు ప్రమాదంలో పడ్డట్లయింది.

## లైసెన్సులు అవసరం లేదు

తెలంగాణ ఫారెస్ట్ ప్రొడ్యూస్ ట్రాన్సిట్ రూల్స్-1970, ప్రభుత్వం జారీ చేసిన జీవో 10 ప్రకారం.. 44 రకాల వృక్షాలను నరకొచ్చు. కలపను రవాణాను చేసుకోవచ్చు. సామిల్లుల ద్వారా ముక్కలుగా చేసుకుని సాగు పనిముట్లను తయారు చేయొచ్చు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా కలప ఆధారిత పరిశ్రమల నిబంధనలను రూపొందించింది. 2016 నవంబరు 11న ఓ గెజిట్‌ను విడుదల చేసింది. వ్యవసాయ పనిముట్లు, రైతుల గృహోపకరణాలను సంబంధించిన కలపను నరకవచ్చునని మినహాయింపునిచ్చింది. విశ్వబ్రాహ్మణులు నిర్వహించే సామిల్లులకు లైసెన్స్‌లు అవసరం లేదని, కులవృత్తుల వారిని ఇబ్బందులకు గురిచేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కేంద్ర ఆదేశాలతో రాష్ట్రప్రభుత్వం కలప ఆధారిత పరిశ్రమల నిబంధనలను అడాప్ట్ చేసుకుంది. నిబంధనల ప్రకారం సామిల్లులకు లైసెన్స్ అవసరం లేదని అప్పటి పీసీసీఎఫ్ ప్రశాంత్ కుమార్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని సీఎం కేసీఆర్ ఆదేశాలతో నిబంధనలకు విరుద్ధంగా సామిల్లులను మూసివేశారు.



## కేంద్రం ఆదేశించినా..

ఈ సమస్యను విశ్వబ్రాహ్మణ సంఘాలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాయి. 40 ఏళ్లుగా సామిల్లులు నిర్వహిస్తున్నామని, లైసెన్స్‌లు తీసుకోవాలని అధికారులు వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన కేంద్రం.. కలప ఆధారిత పరిశ్రమల నిబంధనలు-2016ను అమలు చేయాలని కేంద్ర ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ మే 3న తెలంగాణ పీసీసీఎఫ్‌కు ఒక లేఖరాశారు. లైసెన్స్‌ల పేరుతో విశ్వబ్రాహ్మణులు, విశ్వకర్మలను వేధించవద్దని సూచించారు. కానీ, ప్రభుత్వం ఆ నిబంధనలను అమలుపరచడం లేదు.

### కక్షపూరితంగా ప్రభుత్వం

2014 నుంచి విశ్వబ్రాహ్మణులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. సమస్యను మంత్రులు, అటవీశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు. మా సంఘం తరపున కేంద్ర అటవీ ప్రత్యేక ప్రధానకార్యదర్శిని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశాం. తెలంగాణ అటవీశాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వ నిబంధనలను అమలు చేయడం లేదని, సామిల్లుల యాజమానులపై కఠినంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదుచేశాం.

*- పి.రంగాచారి, అధ్యక్షుడు, విశ్వబ్రాహ్మణ సంఘం*

### మా వృత్తిని నాశనం చేస్తున్నారు

సామిల్లుల్లో మేం వ్యాపారం చేయడం లేదు. రైతుల పనిముట్లను మాత్రమే తయారు చేస్తున్నాం. నిబంధనల మేరకే సామిల్లులను నిర్వహిస్తున్న మమ్మల్ని లైసెన్స్‌లు తీసుకోవాలని అటవీ అధికారులు వేధిస్తున్నారు. మా కుల వృత్తిని నాశనం చేస్తున్నారు.

*- గణేషాచారి, అధ్యక్షుడు, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం*


బాహాబాహీకి దిగుతున్న ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు

## బీజేపీ 'యాత్ర'ను అడ్డుకున్న కాంగ్రెస్

జమ్మికుంట/కమలాపూర్, అక్టోబరు 23: కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఎంపీ బండి సంజయ్ చేపట్టిన గాంధీజీ సంకల్పయాత్రను బుధవారం కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. ఎంపీ గాంధీ చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి రెండో రోజు యాత్ర ప్రారంభించబోగా.. సంకల్ప యాత్రకు గాంధీజీ పేరు పెట్టుకోవడం విడ్డూరంగా ఉందంటూ కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి పరస్పరం భౌతిక దాడులకు దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా యాత్ర కొనసాగుతుందని ఎంపీ బండి సంజయ్ అన్నారు. కాగా, మహాత్మ గాంధీ ఆశయ సాధన, కాశ్మీరు రక్షణ, అఖండ భారత నిర్మాణం కోసమే ఆర్టికల్ 370ని రద్దు చేశారని ఎంపీ సంజయ్‌కుమార్ అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లి, కన్నూరు, కమలాపూర్‌లలో జరిగిన గాంధీ సంకల్పయాత్రలో ఎంపీ మాట్లాడుతూ గాంధీజీ వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ మహాత్మగాంధీ ఆశయాలను విస్మరించిందని, అధికారం కోసం ప్రజలలో ఆయోమయం సృష్టిస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను, రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ఫసల్ బీమా యోజన పథకాన్ని నిర్వీర్యం చేసిందని, ఆకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.


బద్దిపడగలో 'డబుల్' ఇళ్లు ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

## పేదల సొంతింటి కల సాకారం చేశాం: హరీశ్

నంగునూరు, అక్టోబరు 23: డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారమైందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగలో నిర్మించిన 30డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన బుధవారం ప్రారంభించారు. గత ప్రభుత్వాలు ఇళ్లు నిర్మించి ఇస్తే లబ్ధిదారులు అప్పుల పాలయ్యే పరిస్థితి ఉండేదని.. ఇప్పుడా స్థితి లేదన్నారు. అర్హులైన పేదలు ఉంటే, వారికీ ఇళ్లు కట్టించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.


శ్రీశైలం ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

## మల్లన్నను దర్శించుకున్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్

శ్రీశైలం, అక్టోబరు 23: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను బుధవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ దర్శించుకున్నారు. ఆయనకు ఈవో కేఎస్ రామారావు స్వాగతం పలికారు. మోహన్ భగవత్ మల్లికార్జున స్వామికి అభిషేకం, భ్రమరాంబదేవికి కుంకుమార్చన చేశారు. అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. ఈవో ప్రసాదాలను, చిత్రపటాన్ని అందించారు.

## విద్యుత్ స్తంభంపైనే విలవిల

**ప్రాణాపాయస్థితిలో గాంధీకి తరలింపు**

కొడంగల్: విద్యుత్ స్తంభంపై మరమ్మతులు పనులు చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో జరిగింది. గొల్లనర్సింహులు(35) బుధవారం కొడంగల్ సన్‌సిటీ కాలనీలో విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుత్ ప్రసరణ కావడంతో షాక్‌కు గురై స్తంభంపైనే విలవిల్లాడుతూ పడిపోయాడు. అతనిని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

చేర్యాల/కొండపాక, అక్టోబరు 23: అప్పుల బాధతో సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం తపాస్‌పల్లిలో రైతు లకుడ బోయిన బాలయ్య(41) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు పెరిగిపోయి తీర్చే మార్గం కనిపించక పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

## ఏసీబీకి చిక్కిన సర్వే చైన్‌మెన్


బ్రహ్మం

రెంజల్, అక్టోబరు 23: నిజామాబాద్ జిల్లా రెంజల్‌లో బుధవారం జరిగింది. బోర్గాంకు చెందిన రైతు చీరడి రమేష్ భూమి నాలా మార్పిడికి వెళ్లగా..సర్వే చైన్‌మెన్ బ్రహ్మం 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు.బుధవారం బ్రహ్మం నుంచి రూ.8వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

## గుండెపోటుతో అర్చకుడు మృతి


సీతారామాచారి(ఫైల్)

వికారాబాద్: వికారాబాద్ జిల్లా అనంతపద్మనాభ స్వామి దేవాలయ ఫౌండర్ ట్రస్టీ, ప్రధాన అర్చకులు నాళాపురం సీతారామాచార్యులు(75) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆలయ పుష్కరిణి సమీపంలో సీతారామాచార్యుల అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

# ఏవీ.. దోమ తెరలు?

**ప్రతిపాదనలకే పరిమితమైన మెడికేటెడ్ తెరల పంపిణీ.. ప్రాణాలు పోతున్నా పట్టని వైద్యారోగ్యశాఖ**

### ఖమ్మంలో భారీగా డెంగీ కేసులు

ఖమ్మం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలతోపాటు దోమల కారణంగా వ్యాధులు ప్రబలే జిల్లాల్లో దోమతెరలు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం ప్రతిపాదనలకే పరిమితమైంది. ప్రతిఏటా దోమల కారణంగా జ్వరాలు విజృంభించే జిల్లాల్లో ఉమ్మడి ఖమ్మం ముందు వరసలో ఉంటుంది. ఈ ఏడాది కూడా జిల్లాలో డెంగీ, మలేరియా, చికున్ గున్యా తదితర జ్వరాలు విజృంభించాయి. వేలాది సంఖ్యలో జనాలు ఆసుపత్రుల పాలవుతున్నారు. పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. అయినా.. ఇప్పటి వరకూ జిల్లాకు మెడికేటెడ్ దోమతెరలు చేరలేదు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారుల నుంచి ప్రభుత్వం ప్రతిపాదనలు తీసుకున్నా.. వీటి పంపిణీపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. వర్షాకాలం రాకముందే ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలకు 30వేల దోమతెరలు, భద్రాద్రి జిల్లాలో లక్ష అవసరమని అధికారులు ప్రతిపాదించినా ఫలితం లేకపోయింది.

### హైరిస్క్ గ్రామాల గుర్తింపు

ఖమ్మం జిల్లాలో 323 హైరిస్క్ గ్రామాలతోపాటు 74 అర్బన్ వాడల్లో డెంగీ, మలేరియా కేసులు ప్రతి ఏటా నమోదవుతున్నాయి. అలాగే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 756 హైరిస్క్ గ్రామాల్లో ప్రతి ఏటా జ్వరాలు ప్రబలుతున్నాయి. వాస్తవానికి మెడికేటెడ్ దోమతెరల వినియోగం ఎంతో ఉపయోగం. దోమలు ఆ తెరపై వాలి వెంటనే మృతి చెందుతాయి. విదేశీ పరిజ్ఞానంతో తయారయ్యే మెడికేడెట్ దోమతెరలు ఉమ్మడి జిల్లాలో రెండేళ్ల క్రితం పంపిణీ చేశారు. కొంత ఫలితం కనిపించింది. ఈ ఫలితాన్ని దృష్టిలో ఉంచుకుని దోమతెరలకు ప్రతిపాదనలు పంపినా.. పంపిణీ చేయలేదు. ఒక్క దోమ తెరకు రూ.15వందల నుంచి రూ.2వేలవరకు ఖర్చవుతుంది. దోమలతో రోగాలు విజృంభించిన తర్వాత వైద్యంపేరుతో కోట్లాది రూపాయలు ఖర్చుచేసే ప్రభుత్వం.. ముందస్తుగా దోమ తెరలు పంపిణీ చేస్తే చాలా వరకు ఉపయోగం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### డెంగీ కేసులు 2 వేలపైనే..

ఈ ఏడాది ఎన్నడూలేని విధంగా ఖమ్మం జిల్లా పరిధిలో 2వేల మందికి పైగానే డెంగీ వచ్చింది. మలేరియా కేసులు కూడా అనధికారికంగా ఎక్కువగానే గుర్తించారు. చికెన్‌గున్యా కేసులు ప్రభుత్వాసుపత్రిలో 146 నమోదు కాగా.. ప్రైవేటు ఆసుపత్రుల్లో రెట్టింపు ఉంటుందని అంచనా. ఇక భద్రాద్రి జిల్లాలో మలేరియా కేసులు 452, డెంగీ కేసులు 351 అధికారికంగా నమోదయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రులను లెక్కలోకి తీసుకుంటే మరింత పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దున ఉన్న భద్రాచలం ఏజెన్సీకి అక్కడి నుంచి గొత్తికోయలు వస్తుండడంతో వారినుంచి మలేరియా వ్యాప్తి చెందుతోంది. అందువల్ల గొత్తికోయల నివాస గ్రామాల్లో కూడా గతంలో దోమతెరల పంపిణీ జరిగింది. ఈ దఫా ఇలాంటి కార్యక్రమం చేపట్టకపోవడంతో ఇరు జిల్లాల్లోనూ రోగాలు విజృంభించాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, మెడికెటెడ్ దోమతెరలు పంపిణీచేస్తే వ్యాధులను అదుపులో ఉంచడం సాధ్యమవుతుంది.

### బీటెక్ విద్యార్థి మృతి

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన బత్తిని సాయిప్రకాశ్ (23) బుధవారం డెంగీ జ్వరంతో మృతి చెందాడు. సాయిప్రకాశ్ హైదరాబాద్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల్లో స్వగ్రామమైన చిన్నమల్లారెడ్డికి రాగా.. వారం క్రితం తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు చికిత్స చేశారు. బుధవారం చిన్నమల్లారెడ్డిలో మృతి చెందాడు.


కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

### వాగులు దాటి.. వైద్యం చేసి..

అశ్వారావుపేట రూరల్: దట్టమైన అడవిలో వాగులు, వంకలు దాడుకుంటూ పది కిలోమీటర్లు నడిచి గొత్తికోయ గిరిజనులకు వైద్యం అందించారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల వైద్యసిబ్బంది. గొత్తికోయల గిరిజన గ్రామమైన ఉడుములబండలో బుధవారం వైద్య సిబ్బంది మందులు, ఇతర సామగ్రితో రెండు వాగులను దాటుకుని వెళ్లి వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు.


**SANGAREDDY MUNICIPALITY**
Sangareddy District
**Invitation for Request for Proposal (RFP)**
Roc No. RFP2/2019-20 Dated : 24-10-2019
Sangareddy Municipality invites RFP from the interested persons who have adequate experience and adequate financial strength in the field for "CONSTRUCTION, OPERATION AND MAINTENANCE OF Pay and Use public toilets in Sangareddy town on Design, Build, finance, Operate and Transfer (DBFOT) basis. In five locations as per the terms and conditions laid down in the RFP documents. The documents will be available from 24-10-2019 to 04-11-2019 in Sangareddy Municipal Office notice board and website. Against payment of Rs. 1,000/- Rupees One Thousand only through Demand Draft in favour of the Commissioner, SRD Municipality.
Date of Prebid Meeting : 29-10-2019 at 3 PM
Bid due date/Last Date of bid submission 5-11-2019
Sangareddy Municipality reserves the right to cancel, terminate, change, modify procurement process and / or requirement of bid stated in the RFP with out assigning any reason or providing any reason and with out accepting any liability for the same.
For further details contact : Md Younus, DEE
Mob : 8978581104
Mail : mc.sangareddy@cdma.gov.in
Sd/- **Commissioner,** Sangareddy Municipality



సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

# త్వరలో కుడా మాస్టర్‌ప్లాన్

**15 రోజుల్లోగా కేటీఆర్ ఆమోదం.. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

వరంగల్ సిటీ, అక్టోబరు 23: 'త్వరలోనే మాస్టర్‌ప్లాన్-2041 ఆమోద శుభవార్తను వరంగల్ ప్రజలు వింటారు. వీలైతే 15 రోజుల్లోనే జరిగేలా చూస్తా' అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. కుడా మాస్టర్‌ప్లాన్ ద్వారా వరంగల్ ప్రజలకు ఎంతో మేలు జరుగనుందన్నారు. బుధవారం వరంగల్ అర్బన్ కలెక్టరేట్ కార్యాలయంలో మాస్టర్‌ప్లాన్-2041 సమీక్ష సమావేశం జరిగింది. ఎర్రబెల్లి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, రాజ్యసభ సభ్యులు బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, మేయర్ గుండా ప్రకాశ్‌రావు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి దయాకర్‌రావు మీడియాకు వివరాలు వెల్లడించారు. వరంగల్ నగరాభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టితో ఉన్నారని అన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని మంత్రి కేటీఆర్ సూచనల మేరకు పక్కగా ప్లాన్‌ను రూపొందించామన్నారు. దేశ వ్యాప్తంగా 27 నగరాల అభివృద్ధిని అధ్యయనం చేసినట్లు చెప్పారు. ఆ పరిజ్ఞానంతో వరంగల్ మహానగరం, కుడా పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేసినట్లు వివరించారు. వరంగల్‌కు ఉన్న చారిత్రక ప్రాధాన్యత. పర్యాటక నగరంగా వరంగల్ అభివృద్ధి. పారిశ్రామిక, విద్యా, సాంకేతిక రంగాలు తదితర విభాగాల్లో నగరం భవిష్యత్తు అభివృద్ధికి కొలమానంగా మాస్టర్‌ప్లాన్ ఉండనుందన్నారు. ప్రజల నుంచి సుమారు 3800 సూచనలు పరిగణనలోకి తీసుకొని ఆ మేరకు ప్లాన్ రూపకల్పన చేసి, మంత్రి కేటీఆర్ ఆమోదానికి పంపామని చెప్పారు.

**మాస్టర్‌ప్లాన్‌లో ప్రధానంశాలు**

స్మార్ట్‌సిటీ, హృదయ్, అమృత్ ప్రాజెక్టులు. టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం, మామునూర్ ఏయిర్‌పోర్టు, లాగిస్టిక్ హబ్స్, చెరువులు, కుంటల పరిరక్షణ, అభివృద్ధి, టీపీఎస్, ఎల్‌పీఎస్ ద్వారా ల్యాండ్ పూలింగ్, భూముల అభివృద్ధి అనుమతులు. మౌలిక వసతుల కల్పన తదితర విధానాల ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం. నగరాభివృద్ధికి వినియోగించడం, ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్‌ను మరింత సరళం చేయడం.




ఆంధ్రజ్యోతి
గురువారం
24 అక్టోబరు 2019


## ఆర్సీఈపీతో కొత్త ముప్పు

'ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం' (రీజినల్ కాంప్రహెన్సివ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్–ఆర్సీఈపీ) పేరిట కొనసాగుతున్న 16 దేశాల స్వేచ్ఛావాణిజ్య ఒప్పంద యత్నాలు దేశంలోని రైతులను, పాల ఉత్పత్తి సంఘాలను, వ్యాపారులను, చిన్న పరిశ్రమలను తీవ్రంగా భయపెడుతున్నాయి. మొన్న చైనా అధ్యక్షుడు మోదీతో మనసు విప్పి మాట్లాడిన కీలకాంశాల్లో ఇదీ ఉన్నదట. ఇప్పటికే చైనా ఉత్పత్తులు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతూ, దేశీయ ఉత్పత్తులను చావుదెబ్బతీస్తున్న నేపథ్యంలో, చైనా నాయకత్వంలోని ఈ ఒప్పందంలో చేరితే మరిన్ని దేశాల ఉత్పత్తులు మన అనేక రంగాలను ముంచుతాయన్నమాట వాస్తవం. ఆరేళ్ళుగా నానుతూ, ఇప్పుడు తుది అంకానికి చేరిన తరుణంలోనే ఆర్సీఈపీ నుంచి భారత్ బయటకు వచ్చేయాలన్నది అనేకమంది డిమాండ్.

ఆర్సీఈపీలో చేరితే పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ తరువాత దేశప్రజలమీద మోదీ ప్రభుత్వం కొట్టిన మరో పెద్ద దెబ్బ అవుతుందని కాంగ్రెస్ అంటున్నది. దేశీయ చిన్నతరహా పరిశ్రమలను ముంచే చైనా ఉత్పత్తులు, భారతీయ పాడి రైతులను దెబ్బతీసే న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాల డైరీ ఉత్పత్తులు, చివరకు కీలకమైన డేటాను స్వేచ్ఛగా పంచుకోవడం వల్ల దేశభద్రతకు వచ్చిపడే ప్రమాదాన్నీ పలువురు ఎత్తిచూపుతున్నారు. స్వదేశీ జాగరణ్‌మంచ్ సైతం ఆగ్రహంతో ఉన్నందున మోదీ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తున్నది. పీయూష్ గోయల్ మొన్న సోమవారం చేసిన వ్యాఖ్యలో ఒప్పందం నుంచి తప్పుకొనే అవకాశాలు ఉన్న ధ్వని వినిపించింది. ఒకవేళ చేరవలసి వస్తే దేశీయంగా అన్ని రంగాలకూ భద్రత కల్పించిన తరువాతే అటు కన్నెత్తి చూస్తామని కూడా కేంద్ర పెద్దలు మరోపక్క అంటున్నారు. బ్యాంకాక్‌లో నవంబరు 4న జరిగే దేశాధినేతల సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొనబోతున్నారని వార్తలు వస్తున్నాయి. ఆ రోజు భారతదేశం తన అంగీకారం తెలిపే అవకాశం, ప్రమాదం ఉన్నది కనుక, దేశవ్యాప్త నిరసనలు, ఉద్యమాలతో దానిని అడ్డుకొనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలన్నీ చౌకదిగుమతులకు గేట్లు తెరిచి స్థానిక ఉత్పత్తులను, ఉత్పత్తిదారుల జీవితాలను దెబ్బకొడుతున్నవే కనుక, ఆర్సీఈపీతో వచ్చిపడే కొత్త ముప్పును శక్తిమేరకు నిలువరించాలన్నది పలు సంఘాల ప్రయత్నం.

చైనా, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణకొరియాలతో పాటు ఆసియాన్‌కు చెందిన మరో పదిదేశాలు ఈ ఒప్పందంలో భాగం కనుక, సుంకాలు బాగా తగ్గించుకోవడం లేదా ఎత్తివేయడం ద్వారా వీటి ఉత్పత్తులను మనం స్వాగతించవలసి ఉంటుంది. కేవలం చైనా ఉత్పత్తులే మరో 80 మనదేశంలోకి అదనంగా వచ్చిపడతాయట. ప్రపంచవాణిజ్యంలో మూడోవంతు, స్థూల ఉత్పత్తిలోనూ, విదేశీపెట్టుబడుల్లోనూ నాలుగోవంతు ఆర్సీఈపీలో ఉన్న దేశాలన్నీ నియంత్రిస్తున్నందున భారతదేశానికి ఈ కూటమిలో చేరడం ఒక పెద్ద వాణిజ్య, ఎగుమతి అవకాశంగా ప్రచారం జరుగుతున్నది. కానీ, ప్రస్తుతం ఈ దేశాలకు మనం చేస్తున్న ఎగుమతుల కంటే దిగుమతులే ఎంతో అధికం. చైనాతో మనకు నాలుగులక్షలకోట్ల పైచిలుకు వాణిజ్యలోటు ఇప్పటికే ఉన్నది. వాణిజ్యావకాశాల మాట అటుంచితే, దిగుమతి సుంకాలు తగ్గించడం వల్ల ఆ లోటు మరింత పెరుగుతుందన్నది వాస్తవం. ఈ పరిస్థితిని కాస్తంత సరిదిద్దడానికే ఆర్సీఈపీ చర్చలు ఆరంభమైన 2013ను కాక, 2019ను తగ్గించిన సుంకాలకు 'బేస్ ఇయర్'గా తీసుకోవాలని భారత్ కోరుతున్నది. 2014తరువాత భారతదేశం వివిధ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను 17శాతం వరకూ పెంచింది. అలాగే, ఈ ఒప్పందం కారణంగా దిగుమతులు అనూహ్యంగా పెరిగిపోయినప్పుడు, కొన్ని ఉత్పత్తులపై అవే మినహాయింపులు, రాయితీలు కొనసాగించననే హక్కు తనకుండాలని కూడా భారత్ అంటున్నది. అతిపెద్ద భారత మార్కెట్‌ను ఎవరూ వదులుకోరు కనుక, ఈ ప్రతిపాదనల్లో కొన్నింటికి కూటమి తలూపినప్పటికీ, అందులో చేరికవల్ల మనకు లాభం కంటే నష్టమే ఎక్కువని అనేకుల అభిప్రాయం. ఈ దేశాల్లో అనేకం తమ స్థానిక ఉత్పత్తి దారులకు భారీ రాయితీలు ఇచ్చి ఉత్పత్తి ఖర్చు తక్కువ ఉండేట్టు చూడటం వల్ల, అవి మన ఉత్పత్తులకంటే తక్కువ ధరలో ఉండటం సహజం. న్యూజిలాండ్‌లో వెయ్యి పశువులతో, భారీ దిగుబడితో పాలవ్యాపారం చేస్తున్న ఓ రైతుతో మనదేశంలో ఒకటీరెండు పశువులను పోషించుకొనే బక్కరైతు ఎంతమాత్రం పోటీపడలేడు. ఈ కారణంగానే, పెద్ద పెద్ద సహకార డైరీలు సైతం ఈ ఒప్పందాన్ని చూసి భయపడుతున్నాయి. ఇప్పటికే, మలేషియా పామాయిల్ దేశీ రైతులను దెబ్బతీసినట్టుగా, ఇకపై అనేక పంట ఉత్పత్తులు మన రైతులను దెబ్బతీయవచ్చు. ఈ ఒప్పందం అమలులోకి వస్తే వ్యవసాయం, ఇతర రంగాల్లో కనీసం 5కోట్లమంది జీవనోపాధి కోల్పోతారన్న ఆర్థిక నిపుణుల హెచ్చరికను ప్రభుత్వం లక్ష్యపెడుతుందని ఆశిద్దాం.

## శభాష్ తమిళిసై!

ఒక రాష్ట్ర గవర్నర్ ఆ రాష్ట్ర విశ్వవిద్యాలయాలకన్నిటికీ ఛాన్సలర్‌గా ఉంటారు. ఒక గవర్నర్ ఊరకే ఉండదలచుకుంటే తప్ప ఆ పదవి ఊరకే నామకార్థంగా వ్యవహరించేది కాదంటే కానే కాదు. it is not a teethless, ornamental position. గవర్నర్ గట్టివాడయితే ఒక్క విశ్వవిద్యాలయాల విషయంలోనే కాదు, ఎన్నో విషయాల్లో తాను చూసింది, తన దృష్టికొచ్చిన ప్రతి అవకతవక గురించి, అన్యాయం గురించి, inefficiency, ineffectiveness, అవినీతి గురించి, దుష్టదుర్యోధన పరిపాలన గురించి ప్రభుత్వాన్ని ప్రతి రోజు సంజాయిషీ అడగవచ్చు, అడ్వైజ్ చేయవచ్చు, అడ్వైజ్ చేసిన దానిని ఎంతవరకు పాటించారో, లేదో, తగు చర్య తీసుకున్నారో లేదో తెలుపుమని చీఫ్ సెక్రెటరీకే కాదు, చీఫ్ మినిస్టర్‌కు కూడా నేరుగా వ్రాయవచ్చు. Reminder కూడా పంపవచ్చు. ప్రతి గవర్నర్‌కు అలాంటి implied powers ఉంటాయి.

అంతేకాదు, తాను చూస్తున్న, తన దృష్టికొస్తున్న హీనమైన, దుర్మార్గమైన పరిపాలనా దుశ్చర్యలు దుర్మార్గాలేమి ఉన్నా, తాను రాష్ట్ర ప్రభుత్వానికి వ్రాసిన లేఖల ప్రతులతో సహా, వాటిపై తగు చర్యలు తీసుకోకపోతే ఆ సమాచారంతో సహా కేంద్రీయ ప్రభుత్వానికి గవర్నర్ రెగ్యులర్‌గా తెలుపవచ్చు. ప్రభుత్వం సక్రమంగా నడవడం లేదు, నడపబడడం లేదు అని వ్రాయవచ్చు. గవర్నర్ వ్రాసిన వాటి ఆధారంగానే సెంట్రల్ గవర్నమెంట్ స్టేట్ గవర్నమెంట్‌ను సంజాయిషీ అడగవచ్చు.

నన్నడిగితే గవర్నర్‌లు చేయవలసిన అసలు సిసలైన పనులు అవి. కాని అవి రాజకీయ దృక్పథంగా కాక పరిపాలనా దృక్పథంగా చేస్తున్నట్లు, అలాంటి కీర్తి, ప్రజా విశ్వాసం గవర్నర్ సంపాదించుకోవాలి.

అంతేకాదు, పూర్వ గవర్నర్ నరసింహన్‌గారు చేసినట్లు పొద్దస్తమానం అయితే హైదరాబాద్‌లో ఉండడం, లేకపోతే తిరుపతి, భద్రాచలం గుళ్లల్లో దర్శనాలకు పోవడంలాంటిది కాదు చేయవలసింది, కనీసం నెలకొకసారైనా ప్రతి జిల్లాకు వెళ్ళి ప్రజల బాగోగులు చూడాలి, వినాలి, తెలుసుకోవాలి. వాటిగురించి లోకల్ ఆఫీసర్స్‌తో మాట్లాడాలి, వారికి తగు సలహాలు ఇవ్వాలి. ప్రజలనుండి వచ్చిన అర్జీలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని రావాలి.

తమిళిసై గారు తెలంగాణ గవర్నర్‌గా వచ్చాక ఈ ప్రక్క కొంత దృష్టి పెడుతున్నట్లు కనిపిస్తోంది. వచ్చిన వెంటనే వి.సి.ల నియామకాలు అతి త్వరగా చేబట్టమని చెప్పడం ఒక మంచి వార్తయితే, మరొకటి వి.సి.ల మీటింగ్ ఒకటి పెట్టి విశ్వవిద్యాలయాల బాగోగుల గురించి తెలుసుకోవడం మరొక శుభసూచకం. వీటి అన్నిటికన్నా మంచి వార్త 18.10.2019 హిందూ పత్రికలో వచ్చిన వార్త. అది ఇటు ప్రభుత్వాన్ని, అటు వి.సి.లను 'ఖబర్దార్, నేను ఇక ముందు ఊరకుండను' అని హెచ్చరించే సువార్త.



అదేమిటంటే రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (RUSA) ద్వారా విశ్వవిద్యాలయాల అభివృద్ధి కొరకు శాంక్షన్ చేయబడిన ఒకటి కాదు రెండు కాదు వంద కోట్ల రూపాయలు ఖర్చు చేయకుండా మిగిలిపోవడం గురించి తనకొచ్చిన కంప్లయింట్ గురించి అటు ప్రభుత్వాన్ని ఇటు వి.సి.లను గవర్నర్‌గారు గట్టిగా మందలిస్తూ, మార్చి 2020లోగా ఆ కేటాయింపులను వాడి తనకు రిపోర్ట్ చేయుమని ఆదేశించడం.

ఈ సొమ్ము మొత్తం ఏడు యూనివర్సిటీలకు మాత్రమేనన్న వార్త కాస్త నాకు నిరాశా జనకంగా ఉంది. వీటిలో శాతవాహన విశ్వవిద్యాలయానికి వర్తించకపోవడం నాకు మరీ విచారాన్ని కలిగించింది. ఎందుకంటే నేను దానికి ఒకప్పుడు డైరెక్టర్‌గా ఉంటిని కనుక. అది ఏమి పాపం చేసిందో కాని దానిపై ప్రభుత్వం సవితి కన్ను పడింది. అయిదేళ్లనుండి అది వి.సి. నియామకం లేకుండా నడపబడుతోంది. అందువలన అది దాని ఒకప్పటి క్రమశిక్షణ ఎంతో కోల్పోయింది. తగిన వి.సి. నియామకం కానందున అది ఎన్నో కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లకు, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లకు నోచుకోకుండా పోయింది. ఒకనాడు ఎంతో గౌరవ ప్రతిష్ఠలతో నడచిన నడపబడిన ఆ విశ్వవిద్యాలయం ఇపుడు ఎంతో దుస్థితి పాలయింది. తుదకు ఇపుడు RUSA గ్రాంట్స్‌కు కూడా eligible కాకుండా పోయింది.

గవర్నర్‌గారు ఈ యూనివర్సిటీ గురించి ఒక స్పెషల్ రిపోర్ట్ తెప్పించుకొని, వీలయితే దానిని ఒకసారి సందర్శించి, ఇప్పటికైనా వెంటనే వి.సి. నియామకం చేయించి RUSA గ్రాంట్లు దానికి కూడా వచ్చే ఏర్పాటు చేయగలరని వారిని నేను దాని ఫౌండర్ డైరెక్టర్‌గానే కాక ఒక సీనియర్‌మోస్ట్ ఫ్రీడమ్ ఫైటర్‌గా, సీనియర్ సిటిజన్‌గా, కరీంనగర్ పౌరునిగా, విద్యావేత్తగా సవినయంగా కోరుతున్నాను.

గవర్నర్ గారిని వి.సి. నియామకాలు ప్రతిభ, అనుభవం ఆధారంగానే చేయించగలరని, అలాగే విశ్వవిద్యాలయాల ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్ల నామినేషన్లు కూడా వారి వారి ప్రతిభలు వారి గత విద్యారంగ అనుభవాలను బట్టి చేయించగలరని కోరుతున్నాను.

తెలుగు భాషను కె.జి. నుండి పి.జి. వరకు అన్ని స్కూళ్ళలో, కాలేజ్‌లలో తప్పనిసరిగా అమలు చేయించగలరని కోరుతున్నాను.

■ డాక్టర్ వెల్చాల కొండలరావు
పూర్వ సంచాలకులు, తెలుగు అకాడమి

# చరిత్ర చదవడానికి చక్కటి అవకాశం!

సందర్భం



■ కె. శ్రీనివాస్

రకరకాలుగా భిన్నమైన మనుషుల మధ్య సంబంధాన్ని, సంలీనతను పెంచే ప్రక్రియే ప్రపంచీకరణ– అని ఎవరో ఒక ఉదాత్తమైన నిర్వచనం ఇచ్చారు. అంతమాత్రమే అనుకుంటే కూడా, కలసిపోవడం, కలుపుకుపోవడం ఏమంత సులువు కాదు. సమాజాల మధ్య అగాధాలు, అడ్డుగోడలు నిర్మించేది వర్తమాన అంశాలు మాత్రమే కాదు, చారిత్రక సమస్యలు కూడా. అంతా ఒకటేగా మారిపోవాలనుకునే మహాక్రమం, భ్రమలోనో వాస్తవంలోనో ఒకటిగా భ్రమిస్తున్న వారు తమను తాము అనేకులుగా భావించుకోవడానికి కూడా దారితీస్తుంది. 1990 దశకమే ప్రస్తుతదశ ప్రపంచీకరణకు ఒక మొదలు అనుకుంటే, అది అనేక జాతుల విశాల దేశం ఒకటి కకావికలు కావడంతోను, రెండో ప్రపంచయుద్ధకాలం నుంచి గోడలు కట్టుకుని ఉన్న దేశాలు కలసిపోవడంతోను ప్రయాణం ప్రారంభించింది. తూర్పు యూరప్ తనను తాను కొత్తగా మలచుకోవడంలో ఎంతో యాతన పడింది. చారిత్రక జ్ఞాపకాలు మనుషులలో జాతి ద్వేషాలకు ఆజ్యంపోసి మనిషి తలదించుకునే పాపాలు చేయించాయి. వివాదం పాతదే అయినా, అది రగులుకున్నది 1980 దశకం మధ్యలో అయినా, బాబ్రీమసీదును కూల్చివేసింది కూడా 90 దశకం మొదట్లోనే. సమకాలికులు కాని బాబర్, రాముడు– వర్తమానరాజకీయాల కోసం ఘర్షణకు దిగవలసి వచ్చింది. చరిత్ర, పురాతత్వ శాస్త్రం రాజకీయాలలో కీలక అంశాలుగా ప్రవేశించాయి. రెండు పక్షాలు ఉన్నప్పుడు, రెండూ వాస్తవాలు అయ్యే అవకాశం లేదు కాబట్టి, తప్పుడు చరిత్రా, తప్పుడు ఆర్కియాలజీ కూడా అవతరిస్తాయి. విశ్వాసాలూ చరిత్రా సంఘర్షించే సమయాల్లో, ప్రతి శాస్త్రీయ ఆవిష్కరణా విశ్వాసపు పరీక్షను గెలవవలసివస్తుంది. సింధు నాగరికతలో బతికిన మనిషి ఎవరు అన్నది, సమకాలిక భారత జాతీయ వాద విశ్వాసాలకు, ప్రయోజనాలకు అనుగుణమైన రీతిలో ఇంకా తెలియడం లేదు.

కేంద్రంలో అధికారంలో ఉన్న తీవ్రజాతీయవాదులు ఎప్పటినుంచో తాము చెబుతూ వస్తున్న పనులను ఒక్కొక్కటిగా చేస్తున్నారు. అట్లా చేయడానికి కావలసిన ప్రజామోదాన్ని వారు సంపాదించుకున్నారు. భారతదేశంలో ఇక ఏకపార్టీ ప్రభుత్వాలు ఉండవు, సంకీర్ణాలే ఏర్పడతాయి– అన్న అంచనా 2014లో పటాపంచలయింది. పేరుకు కూటమి ప్రభుత్వమే అయినా బిజెపికి తిరుగులేని బలం ఉన్నది. తన మిత్రపక్షాలే కాదు, దూరంగా ఉన్న పక్షాలు కూడా భయభక్తులతోనే ఉంటున్నాయి. ఈ జనామోదాన్ని సాధించుకోవడానికి వారు ఉపయోగించిన ఆయుధాలలో చరిత్ర కూడా ఒకటి. ముఖ్యంగా రెండో దఫా అధికారంలోకి వచ్చిన తరువాత, చారిత్రక చర్చలు ప్రజాజీవితంలో అధికం అయ్యాయి. వాటిలో జాతీయ ఆవేశాలు కూడా కలగలిస్తే, వాదబలమూ వాదిబలమూ రెండూ ద్విగుణీకృతమవుతాయి.

కశ్మీర్ ప్రతిపత్తిని రద్దుచేసినప్పుడు అకస్మాత్తుగా అందరూ 1940, 50 దశకాలకు తలలు తిప్పారు. పుస్తకాలలో ఏముందో పరామర్శించారు. సజీవులైన ప్రత్యక్షసాక్షులను సంప్రదించారు. ఇటీవలి చరిత్రే. 70 ఏళ్ల కిందటి చరిత్రే. అయినా, పరస్పర భిన్నమైన వాదాలు విన్నాము. వాస్తవం ఒకటే కావచ్చు. అన్వయాలు వేరు కావచ్చు. సత్యానంతర సమాజంలో వాస్తవాలు కూడా అనేకం ఉండవచ్చు. అందులో ఒకటి అబద్ధం కావచ్చు. దాన్ని గుర్తించి బయటకు చెప్పడం ప్రజాభద్రతకు చేటు కావచ్చు. కానీ, ఆలోచనాపరులందరికీ చరిత్రను పునర్దర్శించవలసిన అవసరం అయితే కలిగింది.

ఇపుడు తాజాగా సావర్కర్. ఆయనకు భారతరత్న ఇవ్వాలని కేంద్రం మీద ఒత్తిడి తెస్తామని బిజెపి మహారాష్ట్ర విభాగం తన ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పింది. వామపక్షీయులు, సెక్యులరిస్టులు, ఉదారవాదులు– వీరంత తెలివి తక్కువ వారు మన దేశంలో మరొకరు ఉండరు. గిల్లితే వీళ్లు ఏడుస్తారు గోల చేస్తారని బిజెపికి తెలుసు. ఆ అల్లరే తనకు కావాలి అందుకని గిల్లుతుంది. వాళ్లు బిజెపికి కావలసింది చేసేస్తారు. ఎవరో ఒకరు ఒక మాట అనగానే వెంటనే దాన్ని ఖండించడం మొదలుపెడతారు. ఎప్పుడూ ప్రతిస్పందనలే తప్ప, అవతలివారిని ఆత్మరక్షణలో పడేసేవిధంగా తామే ప్రథమంగా దాడి చేయడం ఈ ప్రగతిశీలురకు రాదు. సావర్కర్ మాట రాగానే, ఇక ఖండన మండనల్లోకి, చర్చల్లోకి దిగారు. కావలసినంత ప్రచారం లభించింది.

అయితే, ఆసక్తి ఉన్న వారు సావర్కర్ గురించి తెలుసుకుని తీరవలసిందే. సావర్కర్ గురించి మాత్రమేనా, లోకమాన్య తిలక్ గురించి, అరబింద ఘోష్ గురించి, గాంధీ గురించి, జిన్నా గురించి, అంబేడ్కర్ గురించి.. అందరి గురించి అధ్యయనం చేయవలసిందే. వందా రెండువందలేళ్ల చరిత్ర అయినా తెలుసుకోకుంటే ఎట్లా? కాంగ్రెస్ వారు ఏకఛత్రంగా పాలించినకాలంలో, జాతీయోద్యమం అంతా తమదే అన్న ధీమాతో, చరిత్రను స్పష్టంగా స్థిరపరచడం మీద శ్రద్ధ పెట్టలేదు. పైగా వారిది సమన్వయ దృష్టి. గాంధీని, అంబేడ్కర్‌ని, నెహ్రూను, సుభాష్‌ను అందరిని చరిత్రలో నిలుపుతారు. భగత్‌సింగ్‌నూ స్మరిస్తారు. పరస్పర వైరుధ్యాలను తడమరు. అందువల్ల, జాతీయోద్యమం అంతా ఏకతాటితో జరిగిన ప్రక్రియ అనే భ్రమ చాలామందిలో ఉంటుంది. ఇవాళ్టి హీరోలకు పూర్వీకులు, ఇవాళ్టి విలన్‌లకు మూలపురుషులు అంతా ఆనాటి చరిత్రలో దొరుకుతారు. వాళ్ళ మధ్య కూడా ఘర్షణ జరిగింది. కొన్ని సందర్భాలలో ఐక్యతా ఉండింది. అంతటి సమన్వయవాదులైన కాంగ్రెస్ చరిత్రకారులు కూడా నాథూరామ్ గాడ్సే వంటి వారికి ప్రేరకులుగా ఉన్న వారికి చరిత్రలో పెద్ద ప్రాధాన్యం ఇవ్వలేదు.





> 1857 నాటి పోరాటంలో ప్రజాస్వామిక అంశాలు బీజప్రాయంలో ఉన్నాయని, విజయానంతరం ఏర్పడే ప్రభుత్వం ఎట్లా సమష్టిగా ఉండాలో ఆలోచనలు చేశారని చరిత్రకారులు చెబుతారు. అన్నిటికంటె ముఖ్యం, ఆ పోరాటంలో హిందువులు, ముస్లిములు కలసికట్టుగా పాల్గొన్నారు. ఆ ఐక్యత తీవ్రతను గుర్తించినందువల్లనే తరువాతి కాలంలో బ్రిటిషువారు రెండు మతాల మధ్య చిచ్చు పెట్టారు. 1857కు పెద్దపీట వేస్తే, మరి మత ఐక్యతను కూడా గొప్పవిలువగా నేటిపాలకులు గుర్తిస్తారా?

కేంద్రంలోని అధికారపార్టీకి పూర్వరూపం 1948లో ఏర్పడింది. స్వాతంత్ర్య పోరాట కాలంలో ఈ పార్టీకి పూర్వీకులు ఒకే ఉనికి కింద లేరు. వారిలో అనేకులకు విస్తృతమైన ప్రతిష్ఠ ఏర్పడలేదు. అందుకే తమ పరంపరను ఆ నాటి కాలంలోని ప్రసిద్ధులలో, తమకు భావపరంగా సమీపంగా ఉన్నవారిలో నుంచి వెదుక్కుంటున్నారు. అది సహజమే. అందువల్లనే చరిత్రను పునర్లిఖించే అవసరం ఏర్పడుతున్నది. పూర్వకాలం నాటి, మధ్యయుగాల నాటి చరిత్రను పనిగట్టుకుని తిరిగి రాయనవసరం లేదు. ఇప్పుడున్న చరిత్ర పుస్తకాలలో అనేకం నేటి పాలకులకు ఆమోదయోగ్యంగానే ఉంటాయి. వాటిని పాఠ్య పుస్తకాలుగా, అధికారిక పాఠ్యాలుగా గుర్తిస్తే చాలు. సమస్య అల్లా, జాతీయోద్యమచరిత్ర. దాన్ని 1857 నుంచి ప్రారంభించాలని అనుకుంటున్నట్టున్నారు. ఎటువంటి భావవైరుధ్యం అవసరం లేకుండా ఆనాటి పోరాటవీరులు అనేకులు ప్రేరణ ఇస్తారు, ఆమోదయోగ్యులవుతారు. 1857ను గుర్తించినందుకు సావర్కర్ ఇప్పుడు ప్రాసంగికుడవుతాడు (మహారాష్ట్ర ఎన్నికలలో శివసేనను మించిన ప్రాంతీయతను సాధించడానికే శివాజీని, సావర్కర్‌ను ఆధారం చేసుకున్నారని విమర్శకులు అంటారు). 1857 ముందు 1947 వెలవెల పోతుంది.

సావర్కర్ అనంతర జీవితం వివాదాస్పదమే. ఆయనకు మతతత్వ భావాలున్నాయని అనిపించవచ్చు. గాంధీ హత్యకేసులో ఆయన కేవలం సాంకేతిక కారణాల వల్ల మాత్రమే నిర్దోషిగా నిర్ధారణ పొంది ఉండవచ్చు. కానీ, 1907లో 1857 పోరాటానికి 50 ఏళ్లు అయిన సందర్భంగా సావర్కర్ రాసిన పుస్తకం ఆయనను దోషిని చేసింది, విప్లవకారులతో సంబంధాలు ఆయనను ద్వీపాంతరం పంపాయి. అండమాన్ జైలులోనే ఆయన హిందూత్వ సిద్ధాంతానికి అక్షరరూపం ఇచ్చారు. స్వాతంత్ర్యానంతర కాలంలో దేశం నడిచినమార్గంలో సావర్కర్‌కు పెద్ద ప్రాముఖ్యం లేకపోయింది.

ప్రథమస్వాతంత్ర్యపోరాటం విషయంలో కూడా ఆధునిక భారతదేశం ఒక అనాసక్త స్మరణనే చేస్తూ వచ్చింది. ఆయుధం పట్టడానికి వ్యతిరేకతతో పాటు, ప్రజాస్వామ్యవాది కావడం వల్ల కూడా గాంధీ 1857 స్మరణను పెద్దగా చేయలేదు. నిజానికి 1857 నాటి పోరాటం ఫ్యూడల్ శక్తులు వలసవాదులపై చేసినదిగా పరిగణిస్తే, అందులో సామాన్య ప్రజలు ఎవరిని ప్రగతిశీలురుగా గుర్తించాలని చర్చలు చేసేవారు ఇప్పటికీ ఉన్నారు. 1857 నాటి పోరాటంలో ప్రజాస్వామిక అంశాలు బీజప్రాయంలో ఉన్నాయని, విజయానంతరం ఏర్పడే ప్రభుత్వం ఎట్లా సమష్టిగా ఉండాలో ఆలోచనలు చేశారని చరిత్రకారులు చెబుతారు. అన్నిటికంటె ముఖ్యం, ఆ పోరాటంలో హిందువులు, ముస్లిములు కలసికట్టుగా పాల్గొన్నారు. ఆ ఐక్యత తీవ్రతను గుర్తించినందువల్లనే తరువాతి కాలంలో బ్రిటిషువారు రెండు మతాల మధ్య చిచ్చు పెట్టారు. 1857కు పెద్దపీట వేస్తే, మరి మత ఐక్యతను కూడా గొప్పవిలువగా నేటిపాలకులు గుర్తిస్తారా?

నేటి చరిత్రచర్చల్లో పండితులు, విద్యావేత్తలు కాకుండా, సోషల్ మీడియా ప్రొఫెసర్లు అధికంగా పాల్గొంటున్నారు. విద్యావిషయికమైన అంశాలు ఈలలు, చప్పట్లు, కేకలతో నిర్ధారణ జరిగేవి కావు, లైకులతో నిరూపణ జరిగేవీ కావు. ఫలితం ఏమయినా, పాలకులు ఇస్తున్న హోంవర్కును అభిరుచి ఉన్న వారందరూ స్వీకరించి, అధ్యయనం మీద దృష్టి పెట్టడానికి ఇదొక మంచి అవకాశం! ■

## హారన్

పరుగెత్తి పరుగెత్తి
ఇవ్వాళ
బస్సు అలసిపోయింది

నిన్ను నన్ను
గమ్యస్థానానికి క్షేమంగా మోసుకెళ్ళిన
బస్సు
తన క్షేమం మరచి
ఎంతకని ఉరుకుతుంది

ఆ రథ సారధి వొంట్లో
ఓపిక వున్నంతవరకూ
ముందుకు కదిలిన బస్సు
ఇవ్వాళ స్వరం మార్చుకున్నది

మెత్తనోడిని చూస్తే
ఎవరికయినా మొత్త బుద్ధయితది
చెవిటోడి ముందు

శంఖం ఊదినట్టు
చలనం లేని మనుషుల నడుమ

దారి ఇవ్వమంటూ
నోరెత్తి
ఎంత మొత్తుకున్నా
ముందున్నోడు పక్కకు జరిగితేనే
ముందుకు కదిలే బస్సు
ఒక్కసారయినా
ఎదురు తిరగకపోతే ఎట్లా

వానికో
సంసారం ఉన్నది
డబ్బు ఉంటేనే
బ్రతుకుతమంటున్న లోకంలో

వాడిని కూడా
బాగుపడనీయమంటూ
హారన్ కొడుతున్నది.

– గజ్జెల రామకృష్ణ,
భూదాన్ పోచంపల్లి

# 'ఆర్థిక మాంద్యం' వల్ల హాని ఎవరికి?

గత రెండు మూడు నెలలుగా వార్తా పత్రికల్లోనూ, టీవీ చానళ్లలోనూ తరుచుగా కనిపిస్తున్న, వినిపిస్తున్న మాటలు 'ఆర్థిక మాంద్యం, ఆర్థిక మాంద్యం, ఆర్థిక మాంద్యం!' ఈ మాంద్యాన్ని వర్ణిస్తున్న కొన్ని మాటలు చూడండి!

'ప్రపంచ వ్యాప్తంగా 90 శాతం మందగమనం'. 'మాంద్యం వాత, ఖర్చులో కోత'. 'అంతర్జాతీయంగా తగ్గిన కొనుగోలు శక్తి'. 'వ్యాపార వర్గాల్లో ఆందోళన'. 'దివాళా స్థితికి వ్యాపారం'. 'వృద్ధి రేటు నేల చూపులు'. 'సిమెంటుకు గిరాకీ కరువు'. 'మార్కెట్లకు ఆటో దెబ్బ'. 'రియల్‌ఎస్టేట్ రంగంలో కొనసాగుతున్న సంక్షోభం'. 'రెండు లక్షల కోట్లకు పెరిగిపోయిన బ్యాంకుల మొండి బకాయిలు! వచ్చే రెండేళ్ల వరకూ పరిస్తితి ఇంతే!'–ఇదీ దేశంలో ఆర్థిక పరిస్తితి!

ఈ ఆర్థిక మాంద్యం గురించి, ముఖ్యంగా పరిశ్రమల అధిపతులూ, ఆర్థిక వేత్తలూ మాట్లాడుతున్నారు. అసలు, 'ఆర్థిక మాంద్యం' అంటే ఏమిటి? అది ఎందుకు, ఎప్పుడెప్పుడు వస్తుంది? దానివల్ల జరిగే హాని ఏమిటి? ఎవరికి?– ఈ విషయాల గురించి, శ్రామిక జనాలు తెలుసుకుని తీరాలి. 'శ్రామిక జనాలు' అంటే, ఏయే సెక్షన్ల వాళ్ళు? జీతాల మీద బ్రతికే వాళ్ళూ, స్వతంత్ర శ్రామికులుగా బ్రతికే పేద రైతులూ, చేతి వృత్తుల వాళ్ళూ, చిన్న దుకాణదారులూ; కౌలు రైతులూ– ఈ రకపు సెక్షన్ల వారే శ్రామిక జనాలు!

'ఆర్థిక మాంద్యం' అంటే, సరుకుల అమ్మకాలు తగ్గిపోవడమే. దీన్ని గురించి, ఇదేదో 'ఆర్థిక వేత్తలు మాత్రమే గ్రహించగలిగిన పెద్ద వ్యవహారం' అని, ఆ వేత్తలు అనుకుంటారు. ఆ వేత్తలు అనుకునేటట్టు శ్రామిక జనాలు అనుకోకూడదు. సరుకుల అమ్మకాలు ఎందుకు తగ్గిపోతూ, ఆగిపోతూ వుంటాయి? ఈ సమస్య లేకుండా చేసేది ఎలాగ? ఈ నిజాల్ని తెలుసుకోవలిసింది శ్రామిక జనాలే. ఎందుకంటే, దానివల్ల హాని జరిగేది వారికే గనక! ఈ విషయాలు గ్రహించినప్పుడే, ఆ మాంద్యానికి అవకాశం లేని సమాజాన్ని భవిష్యత్తులో ఎలా ఏర్పరచుకోవాలో, శ్రామిక జనాలకు అర్థమౌతుంది.

సరుకుల్ని తయారు చేయించే పరిశ్రమల వాళ్ళు, ముఖ్యంగా రెండు రకాలుగా ఉంటారు. వాళ్ళు 'వస్తు రూపం'లో వుండే సరుకుల్ని (తిండీ, బట్టా, ఇళ్ళూ వంటి వాటిని) తయారు చేయించే వారు కావచ్చు; లేదా వస్తువులుగా కాకుండా జరిగే శ్రమల్ని చేయించేవారు కావచ్చు. ఉదా: రవాణా, విద్యా, వైద్యం వంటి శ్రమలు, వస్తువుల్ని తయారు చెయ్యవు. అయినా, అవి అన్నీ అవసరమైన శ్రమలే!

పరిశ్రమల అధిపతుల ప్రకారమూ, వాళ్ళ ఆర్థికవేత్తల ప్రకారమూ, ఆర్థిక మాంద్యం అంటే, గడిచిన మూడు నెలల కాలంలో గానీ, ఆరు నెలల కాలంలో గానీ, సంవత్సర కాలంలో గానీ– ఆ కాలంలో తయారైన సరుకుల విలువని, అంతకు ముందు కాలంలో తయారైన సరుకుల విలువతో పోల్చినప్పుడు, కొత్త సరుకుల విలువ తగ్గుతూ పోయే పరిస్తితే! అంటే, కొత్తగా తయారైన సరుకులు, కొన్ని చోట్ల చాలా మందగొడిగా అమ్మకాలు కావడం; అనేక చోట్ల అసలు అమ్మకాలే కాక పోవడం! అంటే, సరుకుల అమ్మకాలు ఎప్పుడూ జరిగే స్థాయిలో జరగక పోవడం. దీని ఫలితం ఏమిటి?

> 'ఆర్థిక మాంద్యం' అంటే, సరుకుల అమ్మకాలు తగ్గిపోవడమే. దీని వల్ల పరిశ్రమాధిపతులకు జరిగే నష్టం ఏమీ ఉండదు. అసలైన కష్టాలూ, నష్టాలూ భరించాల్సింది శ్రామిక జనాలే. 2018వ సంవత్సరంలో, భారత దేశంలోనే 1 కోటీ, 10 లక్షల మందికి ఉద్యోగాలు పోయాయి. మామూలుగా జీతాలు అందుతూ ఉన్న రోజుల్లోనే, కార్మిక కుటుంబాలు సమస్యల్లో కూరుకుపోయి ఉంటాయి కదా? అటువంటప్పుడు, ఆ కుటుంబాలకు జీతాలే ఆగిపోతే, అన్నిటికీ కష్టమే! శ్రామిక జనాలు క్షీణించి పోకుండా ఉండాలంటే, ఆర్థిక సంక్షోభాలకు కారణలనూ, పరిష్కారాన్నీ వివరించే సిద్ధాంతాన్ని వారు తెలుసుకోవాలి.

కొన్ని పరిశ్రమలు పూర్తిగా మూత పడతాయి. (లాక్ ఔట్). ఆ పరిశ్రమల్లో శ్రామిక జనాలు నిరుద్యోగులై పోతారు. 'నిరుద్యోగం' అనే మాట, ఇక్కడే కొత్తగా పుట్టింది కాదు. అప్పటికే ఉన్న నిరుద్యోగ జనాభాతో ఈ కొత్త నిరుద్యోగులు కూడా కలిస్తే ఏమవుతుంది?ఆ నిరుద్యోగ జనాభా ఇంకా పెరుగుతుంది. కొన్ని పరిశ్రమలు తాత్కాలికంగా మూతపడతాయి (లే ఆఫ్). కొన్ని పరిశ్రమలు వారానికి రెండు మూడు రోజులే పనిచేస్తాయి. దానికి తగ్గట్టే ఆ కార్మికులకు, సగం పనో, పావు పనో, దొరుకుతుంది. చాలా సార్లు అదీ జరగదు! ఇప్పుడు దేశంలో, అనేక రకాల పరిశ్రమల్లో, ఇదే జరుగుతున్నట్టు, ఆర్థిక వ్యవహారాల పత్రికలూ, టీవీ చానెళ్ళూ సర్వేలు జరిపి చెబుతున్నాయి. సరుకులు అమ్ముకోలేని పరిస్తితి ఎందుకు ఏర్పడుతుంది? అనేక పరిశ్రమల్లో సరుకులు, గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి, మార్కెట్ అవసరాల్ని మించి ఉంటాయి. ఇలా ఎందుకు జరుగుతుందంటే, సరుకుల్ని తయారు చేయించే పరిశ్రమల దారుల మధ్య, ఒక 'సమిష్టి ప్లాను' వుండదు. పైగా, ఒకళ్ళ లెక్కలు ఒకళ్ళకి తెలియకుండా సరుకుల యజమానులు జాగ్రత్తలు పడతారు.

ఏదైనా ఒక సరుకుని ఉదాహరణగా తీసుకోండి! ఉదా: సబ్బులు. లేదా చెప్పులు. మార్కెట్‌లో అమ్మడానికి మొత్తం మీద, ఒక సంవత్సరంలో ఎన్ని సబ్బులు అవసరం? సబ్బులు తయారు చేయించేవాళ్ళు, ఒక్కొక్కరూ ఎన్నెన్ని సబ్బులు తయారు చేయించాలి?– అనే ఉమ్మడి ప్లాను ఎవరికీ ఉండదు. (సమాజంలో వున్న మొత్తం జనాభాకి ఎంత ఉత్పత్తి అవసరమో, దాని ప్రకారం ఉత్పత్తి జరగదు. కేవలం అమ్మకాల కోసమే ఉత్పత్తి జరిగే విధానం ఇది.). ఆ ఉమ్మడి ప్లాను లేకపోవడానికి కారణం, ఆ సరుకుని తయారు చేయించేవాళ్ళు, ఒకరితో ఒకరు పోటీలు పడే ప్రైవేటు పెట్టుబడిదారులు కావడమే. అందుకే ఎవరికి వాళ్ళు ఏ లెక్కా లేకుండా మితిమీరిన స్తాయిలో సరుకుల్ని ఉత్పత్తి చేయిస్తారు. సమాజంలో, సబ్బుల్ని కొనే జనాభా 100 మంది అనుకుందాం. వాళ్ళ కోసం వెయ్యి సబ్బులు తయారై వుంటే, వాటిని కొనేది ఎవరు? ఏ సరుకుకైనా ఇదే ఉదాహరణ చాలు. ఈ సరుకుల తయారీ పద్ధతిని మార్క్సు, ఎంగెల్స్ లు ఒక అంటు రోగంగా వర్ణించారు. ఎక్కువ సరుకుని అమ్మాలనే రోగం ఒకరి నించి ఒకరికి అంటుకుంటుంది. "గత యుగాల్లో అసంభవంగా కనిపించే ఒక 'అంటు రోగం'. 'మితిమీరిన సరుకు ఉత్పత్తి' అనే అంటురోగం. హఠాత్తుగా, మానవ సమాజం, తాత్కాలిక ఆటవిక దశలో ప్రవేశించినట్టుంటుంది. కాటకామో, సర్వ విధ్వంసక ప్రపంచ యుద్ధమో వచ్చి, సకల ప్రాణాధారాల వస్తువుల సరఫరానూ భగ్నం చేసినట్టుంటుంది. పరిశ్రమలూ, వాణిజ్యమూ ధ్వంసమైనట్టుంటుంది. కారణం ఏమంటే, మితిమీరిన నాగరికత, మితిమీరిన ప్రాణాధారిత సంపద, మితిమీరిన పరిశ్రమలు, మితిమీరిన వాణిజ్యం!" (కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక).

సరుకుని తయారు చేయించే పెట్టుబడి దారులందరికీ లక్ష్యం ఒక్కటే, ఎక్కువ లాభం! ఇతరుల కన్నా ఎక్కువ లాభం! ఈ లాభాల పోటీలు యుద్ధాల దాకా పోతాయి. అందుకే లాభాల కోసం పోటీపడే పెట్టుబడిదారుల్ని, మార్క్సు "శత్రు సోదరులు" ('హాస్టైల్ బ్రదర్స్') అంటాడు. ఇది ఒక్క దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా (ప్రపంచపు మార్కెట్లో) జరిగే వ్యవహారమే. అందుకే 'సంక్షోభం' అనేది ఒక దేశానికే పరిమితమై ఉండదు. తరతమ భేదాలతో ప్రపంచమంతటా వ్యాపిస్తుంది.

ఈ సంక్షోభాలు రాకుండా ఉండాలంటే, అంటే అమితోత్పత్తి అనే రోగం రాకుండా ఉండాలంటే, ఉత్పత్తి సాధనాలు ఏ శ్రమా చెయ్యని ప్రైవేటు వ్యక్తుల, సంస్థల చేతుల్లోంచీ, శారీరక, మేధో శ్రమలు చేసేవారి ఉమ్మడి ఆధీనంలోకి వచ్చినప్పుడే సాధ్యం. అది జరగనంత కాలమూ, ఆర్థిక సంక్షోభాలు కొన్నేళ్లకు ఒకసారి వస్తూనే వుంటాయి. శ్రామికుల ఉమ్మడి ఆధీనంలోకి ఉత్పత్తి సాధనాలు వచ్చినప్పుడు, ప్రతి ఒక్కరూ శ్రమలు చేసే వారుగా వుండే సమాజంలో, జనాభా అంతటికీ అవసరమైన స్తాయిలో,





ఉత్పత్తి ఒక ప్లాను ప్రకారం జరుగుతుంది. అలా జరిగినప్పుడు సంక్షోభాలకు అవకాశమే వుండదు.

ఆర్థికమాంద్యం వల్ల పరిశ్రమాధిపతులకు జరిగే నష్టం ఏమీ ఉండదు. సరుకుల అమ్మకాలు మందగిస్తాయి కాబట్టి, లాభాలు తగ్గుతాయి అనేది నిజమే. లాభాలు తగ్గి, కొన్ని పరిశ్రమల్లో పెట్టుబడులకు కూడా కొన్ని నష్టాలు జరగవచ్చు. అంత మాత్రాన ఆ యజమానుల ప్రాణాలు ఎగిరిపోవు. వాళ్ళు సుఖంగానూ, విలాసవంతంగానూ జీవించడానికి కావలిసినంత సరుకు వాళ్ళకి అందుబాటులో వుంటుంది.

అసలైన కష్టాలూ, నష్టాలూ భరించాల్సింది శ్రామిక జనాలే. అదెలాగంటే: సరుకుల అమ్మకాలు మందగించినప్పుడు, పరిశ్రమల యజమానులు సరుకు తయారీ తగ్గించుతారు. తయారీనే తగ్గించినప్పుడు, ఆ పరిశ్రమల వాళ్ళు 'ఉత్పత్తి సాధనాల్ని' కొనడం తగ్గిపోతుంది. కొత్త సబ్బుల తయారీ ఆగిపోతే, లేదా తగ్గిపోతే, ఆ తయారీ కోసం అవసరం అయ్యే 'ఉత్పత్తి సాధనాల్ని' తయారు చేసే పరిశ్రమల్లో అమ్మకాలు మందగిస్తాయి. లేదా పూర్తిగా ఆగిపోనూ వచ్చు. అలా ఉత్పత్తిని తగ్గించి వేసిన పరిశ్రమల్లో, శ్రామికులతో అంతకు ముందు ఉన్నంత అవసరం, తగ్గిపోతుంది. అసలు శ్రామిక వర్గంలో కొంత జనం ఎప్పుడూ నిరుద్యోగంలోనే ఉంటారు. కానీ, మాంద్యం కాలాల్లో ముంచుకు వచ్చే నిరుద్యోగం పరిస్తితి, అలాంటిది కాదు. ఒక పరిశ్రమలో, నిన్నటి దాకా 100 మంది కార్మికులు ఉంటే, ఇవ్వాల్టికి, కనీసం 90 మంది నిరుద్యోగులైపోతారు. ఇది ఒక రకం పరిశ్రమల్లోనే కాదు, అనేక రకాల పరిశ్రమల్లో జరుగుతుంది. శారీరక శ్రమల్లోనూ జరుగుతుంది, మేధా శ్రమల్లోనూ జరుగుతుంది.

భారత దేశ ఆర్థిక వ్యవహారాల మీద పరిశోధన చేసే ఒక స్వతంత్ర సంస్థ (సి.ఎం.ఐ.ఇ.) సర్వే ప్రకారం, 2018వ సంవత్సరంలో, భారత దేశంలోనే 1 కోటీ, 10 లక్షల మందికి ఉద్యోగాలు పోయాయి! ఈ మధ్య కొన్ని నెలలలోనే కార్ల తయారీ పరిశ్రమల్లో పని చేసే వాళ్ళల్లో 3 లక్షల, 50 వేల మందికి ఉద్యోగాలు పోయాయి. కార్ల పరిశ్రమలకి అనుబంధంగా, విడిభాగాల్ని తయారు చేసే చిన్న పరిశ్రమలలో పనిచేసే వారి సంగతి చెప్పనక్కర లేదు. త్వరలో ఒక 10 లక్షల మంది నిరుద్యోగులయ్యేలా ఆ రంగంలో మాంద్యం ఉందని ఒక అంచనా. గృహాల, భవనాల, ఆ రకపు కట్టడాల నిర్మాణ రంగమైన రియల్ ఎస్టేట్ రంగంతో సహా అనేక రంగాలలో ఉద్యోగాలు పోతున్నట్టు తెలుస్తోంది.

అలా ఉద్యోగాలు పోయిన కార్మికులంతా ఏమై పోతారు? మామూలుగా జీతాలు అందుతూ ఉన్న రోజుల్లోనే, కార్మిక కుటుంబాలు సమస్యల్లో కూరుకుపోయి ఉంటాయి కదా? అటువంటప్పుడు, ఆ కుటుంబాలకు జీతాలే ఆగిపోతే, అన్నిటికీ కష్టమే! తిండి సరిపడా ఉండదు. అద్దె ఇళ్ళు ఖాళీ చేసి చెట్ల కిందకో, ఫుట్‌పాతుల మీదకో, వంతెనల కిందకో, చేరవలసిందే! పిల్లల చదువులు ఆగిపోతాయి. ఆకలి జబ్బులు మొదలవుతాయి. (ఈ దేశంలో వెయ్యి మంది పిల్లలలో 42 మంది పిల్లలు, యాడాది అయినా నిండకుండానే చచ్చిపోతున్నారనేది ఒక లెక్క.) వైద్యం దొరక్క, చావులు మొదలు. బతికి ఉంటే, పిచ్చెక్కడమో, ఆత్మహత్యలు చేసుకోవడమో, నేరాలు చేసుకుంటూ ఉండటమో తప్ప ఇంకే మార్గమూ కనపడదు. శ్రామిక జనాలు క్షీణించి పోకుండా ఉండాలంటే, ఆర్థిక సంక్షోభాలకు కారణలనూ, పరిష్కారాన్నీ వివరించే సిద్ధాంతాన్ని వారు తెలుసుకోవాలి.

■ రంగనాయకమ్మ



దివ్వెల వెలుగుల్లో అయోధ్య

శ్రీ శక్తి

**అత్యాచారానికి గురైనవారు కోర్టుల నుంచి సత్వర న్యాయం పొందేలా క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్టం చేయాలని 23 ఏళ్ల సానియా మెహ్రా ఆలోచించారు. అందుకే 'అడిరో ల్యాబ్స్'కు శ్రీకారం చుట్టారు. లైంగికదాడులకు గురైన బాధిత మహిళల కోసం 'ఆశా' (అసాల్ట్ అండ్ సెక్సువల్ హెల్త్‌కేర్ అసెస్‌మెంట్) డీఎన్‌ఎ ఎవిడెన్స్ శాంపుల్ కలెక్షన్ కిట్‌ను తయారుచేశారు. 'ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ డైరెక్ట్ ఎయిడ్ ప్రోగ్రామ్ ఫండ్'కు ఎంపికైన ఐదుగురు మహిళా సామాజిక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలలో ఆమె ఒకరు. ఈ సందర్భంగా ఆమె అభిప్రాయాలివి...**



# అత్యాచార బాధితులకు ఆశా రేఖ!

"వుయ్-హబ్ భారతదేశంలోనే తొలి మహిళా ఇంక్యుబేటర్. 'కమ్యూనిటీ స్లేట్స్ యాక్సిలేటర్ ప్రోగ్రామ్' కింద వుయ్-హబ్ మాలాంటి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మద్దతుగా నిలవాలనుకుంది. అలా ఆస్ట్రేలియన్ కాన్సులేట్ 'డైరెక్ట్ ఎయిడ్ ప్రోగ్రామ్' (డిఎపి) కింద మొత్తం 15 లక్షల రూపాయలను పోటీలో ఎంపికైన



ఐదుగురు సామాజిక ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు అందించారు. ఆ కంపెనీలలో మా 'అడిరో లాబ్స్' (అడ్వాన్స్‌డ్ డిజైన్, ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఆర్గనైజేషన్)కూడా ఉంది. ఈ అవకాశం మా ల్యాబ్ వృద్ధిని మరో మెట్టు పెంచుతుంది. ఈ ల్యాబ్‌ను వినూత్నమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్నాం. పలు ప్రయోగాత్మకమైన సాంకేతిక పరికరాలకు, ఉత్పత్తులకు వేదికగా మలుస్తున్నాం.

**'ఆశా కిట్స్'తో సత్వర సాయం...**

మేము పరిచయం చేస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రధానంగా భారత చట్టాల అమలును, ఫోరెన్సింగ్ పరిశోధనలను ఆధునీకరించి మరింత బలోపేతం చేస్తాయి. భారత క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌ను మెరుగుపరచాలనేది కూడా మా కంపెనీ 'విజన్'లో ఉంది. మేము అందించే సేవలు నాణ్యంగా, అత్యాధునికంగా ఉంటాయి. నాకు సైన్స్, టెక్నాలజీ రంగాలంటే విపరీతమైన ఆసక్తి. మా సంస్థ చేపట్టిన మొదటి సోషల్ వెంచర్ 'ఆశా' కిట్స్ మహిళలకు తగిన రక్షణ, భద్రత, న్యాయం చేకూరేలా సహాయపడుతుంది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వీటిని బాధిత మహిళలకు ఉచితంగా అందజేయాలనేది మా లక్ష్యం. ఈ కిట్ ద్వారా అత్యాచారాలకు గురైన బాధిత మహిళల డీఎన్‌ఎ సాక్ష్యాలను వేగంగా రాబట్టవచ్చు. ఈ పద్ధతిని హాస్పిటల్స్‌లో నిరంతరం కొనసాగిస్తూ బలమైన సాక్ష్యాధారాలను కోర్టు ముందు పెట్టి, నిందితులకు సకాలంలో శిక్ష పడేలా చేయొచ్చు. తద్వారా లైంగిక దాడులకు గురైన బాధిత మహిళలకు సకాలంలో సహాయాన్ని, న్యాయాన్ని అందించవచ్చు.

మేము రూపొందించిన 'ఆశా' కిట్‌ను భారత అధికారులు, దేశంలోని పలు ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్స్, డిటెక్టివ్స్, నేర పరిశోధనా సంబంధిత సంస్థల ముందు ప్రదర్శించాం. దేశమంతా అవగాహన కల్పిస్తున్నాం కూడా. వుయ్-హబ్ ద్వారా తెలంగాణ ప్రభుత్వాన్ని కలిసే అవకాశాన్ని అందిపుచ్చుకున్నాం. మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కూడా కలిశాం. అన్ని చోట్లా మా తొలి ప్రయత్నమైన 'ఆశా' కిట్‌కు మంచి స్పందన వచ్చింది. లైంగిక బాధితులు న్యాయం పొందడానికి ఏళ్లు పట్టడానికి కారణం సరైన సాక్ష్యాలను వెంటనే ముందు పెట్టలేకపోవడమే. దాంతో బాధిత మహిళలు తీవ్ర కష్టాలకు, అవమానాలకు గురవుతున్నారు.

**ఇద్దరం కలిసి...**

మాది ముంబయి. డిజైనింగ్‌లో పట్టా తీసుకున్నా. నాతో పాటు మా కంపెనీ కో-ఫౌండర్, కో-మేనేజింగ్ డైరెక్టర్ అయిన జేన్ సెర్లే బార్బోంజా పనిచేస్తారు. మా ఇద్దరి ఆలోచనా ఒక్కటే. టెక్నాలజీ స్టార్టప్ చేపట్టాలని. దాని ద్వారా సాధారణ పౌరులు, మహిళలకు సత్వర ప్రయోజనాలు లభించాలి. అందుకే మహిళల రక్షణకు ఉపయోగపడే వాటిపై నేను, జేన్ దృష్టిపెట్టాం. మేము రూపొందించిన 'ఆశా' కిట్ పాన్-ఇండియాలో అమలుకావాలనేది మా ఆశ. అత్యాచారానికి గురైన బాధిత మహిళలు సంఘటన జరిగిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి ఆశా కిట్స్‌ను తీసుకొని శాంపిల్స్ ఇచ్చి డీఎన్‌ఎ సాక్ష్యం ఇవ్వాలి. వీటిని బాధిత మహిళలకు ఉచితంగా ఇస్తాం. ఒక్కమాటలో చెప్పాలంటే మహిళలపై లైంగిక దాడుల నేరానికి పాల్పడిన వారి సాక్ష్యాలన్నింటినీ 'ఆశా' కిట్ సేకరిస్తుంది.

**ఆన్‌లైన్‌లో ప్రచారం...**

మా పని గురించి ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తున్నాం. ఇందుకోసం సోషల్ మీడియాను వేదికగా ఉపయోగించుకుంటున్నాం. సామాజిక ప్రయోజనాలున్న మా ఉత్పత్తుల గురించి, అధునాతన సాంకేతిక పరికరాల గురించి ప్రచారం చేస్తున్నాం. 'ఆశా కిట్' మా తొలి ప్రయత్నం. ఇదే కాదు... మరికొన్ని కమర్షియల్ కిట్స్‌ను కూడా తయారుచేస్తున్నాం. క్రైమ్ సీన్ డీఎన్‌ఎ కలెక్షన్, ఫింగర్ ప్రింట్స్ కలెక్షన్, డిటెక్షన్ కిట్, నార్కోటిక్ డిటెక్షన్ కిట్ వంటివి కూడా మా దగ్గర అందుబాటులో ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల నుంచి స్మాల్ ట్రయల్ ఆర్డర్స్ చేశాం కూడా. అలాగే మెడికల్, మెడికో-లీగల్, ఫోరెన్సిక్ ఏజన్సీలకు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్‌లో సహాయపడాలనేది మరో ముఖ్య లక్ష్యం. వీటన్నింటితోపాటు ఎవిడెన్స్ స్టోరేజ్, ఎవిడెన్స్ డాక్యుమెంటేషన్, ఎవిడెన్స్ ట్రాన్స్‌పోర్టేషన్ వంటి వాటినీ సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

**నాతో కలిసి మా కంపెనీలో కో-ఫౌండర్‌గా, కో-ఎండీగా సేవలు అందిస్తున్న జేన్ చాలా విలక్షణ వ్యక్తి. మహిళా హక్కుల పోరాటంలో స్త్రీలే కాదు పురుషులు కూడా ముందుండి పోరాడాలంటారు. దేశాభివృద్ధికి ప్రతి వ్యక్తీ తన వంతుగా ఏదో ఒకటి అందించాలని అంటుంటారు జేన్. జెండర్ అర్థాన్ని పురుషులు మార్చగలిగితే అద్భుతాలు సృష్టించవచ్చంటాడు.**

విచారించాల్సిన విషయం ఏమిటంటే మన చట్టాలు ఇంకా జెండర్ బయాస్డ్‌గానే ఉన్నాయి. ఈ విషయంలో మా టెక్నాలజీ అవుట్‌పుట్స్ ద్వారా ప్రభుత్వాలకు, ప్రభుత్వ సంస్థలకు సహాయపడతాం. ఆశా కిట్ లైంగికదాడులకు గురైన వారి మీదే కాకుండా మిస్సింగ్ పర్సన్స్, లైంగిక వేధింపులకు గురైనవారికి, హ్యూమన్ ట్రాఫికింగ్ కేసుల్లో, హోమిసైడ్ వంటి వాటిల్లో కూడా ఉపయోగపడుతుంది. ప్రతి పోలీస్ స్టేషన్లలో, ఆసుపత్రుల్లో ఈ కిట్స్ ఉండేలా చూస్తాం".

• **నాగసుందరి**
ఫొటోలు: **అశోకుడు**

వేడుక

# రికార్డు 'దీపోత్సవ్'!



దీపావళి అంటే దీపాల వరుస అంటారని తెలుసు. అయితే ఆ వరుస నది పొడవునా కొన్ని కిలోమీటర్ల మేర ఉంటే... అది గిన్నిస్ రికార్డు అవుతుంది. గత ఏడాది దీపావళి సందర్భంగా అయోధ్య (ఉత్తరప్రదేశ్)లోని సరయూ నది ఒడ్డున అక్షరాలా 3,01,152 దివ్వెలను వెలిగించడం గిన్నిస్‌బుక్ రికార్డులోకి ఎక్కింది. ఒకేచోట లక్షలాది దివ్వెల కాంతులను చూసిన జనం ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయి. ఇదే స్ఫూర్తితో ఈసారి సరికొత్త రికార్డును సృష్టించేందుకు ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ సిద్ధమవుతోంది.

దీపావళికి ఇళ్లు, వ్యాపార సముదాయాలను దివ్వెలతో కాంతివంతం చేయడం అన్ని ప్రాంతాల్లో కనిపించేది. అయితే కనుచూపుమేర దీపాల వెలుగుల్ని చూడాలంటే అయోధ్యకు వెళ్లాల్సిందే. దీపావళికి అయోధ్య శోభాయమానంగా మారుతుంది. అక్కడి సరయూ నది దీపకాంతులతో తళుక్కున మెరిసి మురిసిపోతుంది. ఈసారి దీపావళిని మరింత ఘనంగా జరిపేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భారీగా సన్నాహాలు చేస్తోంది. ఈ దీపోత్సవాన్ని 24 నుంచి 26 దాకా జరుపుతారు. ఇందులో పాల్గొనేందుకు ఇండోనేషియా, థాయ్‌లాండ్, నేపాల్, శ్రీలంక, మారిషస్ నుంచి కళాకారులు రానున్నారు. ఈసారి దీపోత్సవ్‌లో 3 లక్షల 50 వేల ప్రమిదలను వెలిగించేందుకు ప్రణాళికలు రచించారు. వీటితో పాటే అయోధ్యలోని దేవాలయాలు, చారిత్రక కట్టడాలను విద్యుత్ కాంతులతో తేజోవంతం చేస్తారు. పట్టణంలోని భవంతులు, గోడలను కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రధాన రహదారులపై దేశ విదేశాల నుంచి విచ్చేసిన కళాకారులు, సందర్శకులతో 'శోభాయాత్ర' నిర్వహిస్తారు. సరయూ నది ఒడ్డున ఉండే ఘాట్లపై 'మహా హారతి' ఇస్తారు. లైట్ అండ్ సౌండ్ ఫైర్‌వర్క్ షోను ఘనంగా జరిపేందుకు అక్కడి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గత ఏడాది 'దీపోత్సవ్'కు ముఖ్య అతిథిగా దక్షిణ కొరియా ప్రథమ మహిళ కిమ్ జంగ్ సూక్ హాజరయ్యారు. ఈసారి కూడా విదేశీ అతిథులకు ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లాయి. సో... ఒకేచోట లక్షలాది దివ్వెల 'రికార్డు' వెలుగులు చూడాలంటే అయోధ్యకు వెళ్లాల్సిందే!

ఫ్యామిలీ కౌన్సెలింగ్

# నా భర్తకు కోపమెక్కువ...



నా వయసు 30 సంవత్సరాలు. వివాహమై నాలుగేళ్లయ్యింది. రెండు నెలల పాప ఉంది. నేనూ నా భర్త ఇద్దరం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లమే. సమస్య అంతా నా భర్తతోనే. మొదటి నుంచీ అతని మాటలు, చేతలు తీవ్రంగానే ఉండేవి. కోపం వస్తే చేతిలో ఉన్నది విసిరేస్తాడు. నోటికీ అదుపు ఉండదు. పిల్లలు పుడితే మారతాడని ఓపికగా ఎదురుచూశాను. ఈ మధ్యలో ఆఫీసు పని మీద నేను 20 రోజులు విదేశాలకు వెళ్లే అవకాశం వచ్చింది. అది నా భర్తకు నచ్చలేదు. అతనికి అటువంటి అవకాశం రాలేదు. నేను వెళితే నలుగురిలో తనకు చులకనగా ఉంటుందని, నా తల్లిదండ్రులు తనను గౌరవించరని గొడవ. నిజానికి వారు చాలా బాగా ఉంటారు. ఎలాగో వెళ్లి వచ్చాను. అప్పటి నుంచీ నేను తనని మోసం చేశానని, నాతో కాపురం చేయనని అంటున్నాడు. ఏదో కోపంలో అన్నాడనుకున్నా. కానీ పాపను చూడడానికి కూడా రావడం లేదు. అడిగితే కోపం తగ్గలేదంటున్నాడు. అతను చెప్పినట్లు నడుచుకుంటే తీసుకెళ్తాడట. కానీ వెళ్లాక ఏదో ఒక గొడవ పెడతాడని భయంగా ఉంది. ఏం చేయమంటారు? **- ప్రియ**

మీ భర్త స్వభావం మొదటి నుంచీ అంతే అంటున్నారు. మరి అలాంటప్పుడు విదేశాలకు వెళ్లే ముందు, పిల్లల్ని కనే ముందు కాస్త ఆలోచించాల్సింది. ఇటువంటి భర్తతో నాలుగేళ్లుగా ఉన్నారంటే అర్థం చేసుకునే ఉంటారు కదా! అతనిది తీవ్రమైన స్వభావం. కానీ ముందే మీరు ఆఫీస్ ట్రిప్ ఎంత ముఖ్యమో నచ్చజెప్పాల్సింది. ఇటువంటి స్వభావం ఉన్న వ్యక్తులు త్వరగా ఆత్మన్యూనతకు గురవుతారు. తాము చెప్పేదే కరెక్ట్ అని నమ్ముతారు. ఆఫీసులో వారి ఆటలు సాగవు కాబట్టి ఇంట్లో ఆధిపత్యం చలాయించి సంతృప్తి పడతారు. అతనికి రాని అవకాశం మీకు రావడం పెద్ద దెబ్బ. దానికి ప్రతీకారం ఇలా తీర్చుకుంటున్నాడు. అయితే అతనిలో కూడా కొన్ని మంచి లక్షణాలు ఉండే ఉంటాయి. లేకపోతే మీరు ఇన్ని రోజులు కలసి ఉండలేరు. వీలైతే మీరు అతన్ని కలసి సావకాశంగా మాట్లాడండి. అతని ఆరోపణలు తప్పు అని వివరించండి. అతని మంచితనం వివరిస్తూనే, కోపం వల్ల మీ కుటుంబ జీవితానికి జరుగుతున్న నష్టం గురించి చెప్పండి. ఇదంతా సాధ్యం కాదనుకుంటే అప్పుడు విడిగా జీవించడం గురించి ఆలోచించాలి. కానీ తల్లిదండ్రులయ్యారు కాబట్టి సామరస్యంగా కలిసిపోవడానికే ముందడుగేయండి.

• **కె.శోభ,** ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

బ్యూటీ

# పండుగ వేళ.. ఫేస్‌ప్యాక్స్!

పండుగ వేళ ప్రత్యేకంగా కనిపించాలంటే అలంకరణతో పాటు అందానికి మెరుగులద్దడం ముఖ్యమే. అందుకోసం ఇంటివద్దనే చర్మాన్ని తాజాగా, కాంతిమంతంగా మార్చేందుకు అలోవెరా, బాదం పాలు, పసుపు ఫేస్‌ప్యాక్‌ను సిద్ధం చేసుకోవచ్చు.

**అలోవెరా ఫేస్‌ప్యాక్:** ఇది స్కిన్ టానింగ్‌ను తగ్గిస్తుంది. మలినాలను తొలగించి చర్మాన్ని కాంతిమంతంగా చేస్తుంది. అలోవెరా జెల్‌ను ముఖానికి రాసుకోవచ్చు. లేదా దీనిలో కొద్దిగా నిమ్మరసం లేదా పచ్చిపాలు కలిపి వాడినా సరే.



**సెనగపిండి, చందనం ప్యాక్:** కొద్దిగా ఎర్రచందనంలో రెండు టేబుల్ స్పూన్ల సెనగపిండి, నిమ్మరసం, రోజ్‌వాటర్ వేసి కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖం, మెడ భాగంలో రాసుకోవాలి. మృతకణాలు, చర్మం మీది మలినాలు తొలగి, చర్మం తాజాగా మారుతుంది.

**పసుపు, మిల్క్ క్రీమ్ ప్యాక్:** పొడిచర్మానికి ఈ ప్యాక్ బాగా పనిచేస్తుంది. జిడ్డు చర్మం వారు ఈ ప్యాక్ వేసుకోవద్దు. మిల్క్ క్రీమ్‌లో కొద్దిగా పసుపు, రోజ్‌వాటర్ కలిపి ముఖానికి రాసుకొని 10 నిమిషాలయ్యాక కడిగేయాలి. మిల్క్ క్రీమ్‌లోని లాక్టిక్ ఆమ్లం చర్మ తత్వాన్ని, చర్మ స్వభావాన్ని మెరుగుపరుస్తుంది. పసుపు చర్మాన్ని యవ్వనంగా ఉంచుతుంది.



**గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడానికి వివిధ దేశాలు నడుంకడుతున్న నేపథ్యంలో రెన్యూవబుల్ ఎనర్జీ(పునరుత్పాదక ఇంధన వనరులు)రంగానికి తిరుగులేదు. అందుకే రానున్న అయిదేళ్లలో గ్రీన్ జాబ్స్ ఎక్కువగా పెరుగుతాయని ఒక అంచనా. పునరుత్పాదక ఇంధన వనరుల అవసరం ఏ స్థాయిలో ఉంది, వీటికి సంబంధించిన చదువు, ఉపాధి ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటున్నారు నిపుణులు.**

# ఎమర్జింగ్ కోర్స్

# రెన్యూవబుల్ ఎనర్జీ

టెక్నాలజీ విస్తృతం అవుతున్న కొద్ది లాభాలతోపాటు నష్టాలు కూడా అంతే స్థాయిలో ఉంటున్నాయి. వీటిని నివారించకపోతే మానవజాతి మనుగడకే ప్రమాదం. అభివృద్ధి ప్రతికూల అంశాల్లో నీటి కొరత, కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ వంటివి ప్రధానంగా ముందుకు వచ్చాయి. వీటిని విస్మరించలేని పరిస్థితి చేరుకుంది. ఇవి మానవ జీవన ప్రమాణాలను నియంత్రించే స్థాయికి చేరుకున్నాయి. వీటికి వెంటనే పరిష్కారం కనుగొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం వేదికలపైనో, బోర్డు రూమ్ చర్చలతో కాలక్షేపం చేస్తే కుదరదని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటి ప్రభావాన్ని తగ్గించడానికి ప్రతి వ్యక్తీ సన్నద్ధం కావాల్సి ఉంది. అదృష్టవశాత్తు భారత దేశంలోని పరిస్థితి ఈ పోరాటానికి అనుకూలంగా ఉంది. సూర్య కిరణాలు మొదలుకుని గాలి, నీరు, బయోమాస్ నుంచి ప్రత్యామ్నాయ ఇంధనాన్ని ఉత్పత్తి చేసుకునే వీలు భారత్‌లో ఉంది. టెక్నాలజీతో ఎదురవుతున్న విపరిణామాలకు విరుగుడు పునరుత్పాదక ఇంధన వనరులు మాత్రమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## ప్రభుత్వ చొరవ

సహజ వనరులతో ఇంధన ఉత్పత్తికి భారత దేశం పలు చర్యలు చేపట్టింది. 2030 నాటికి 550 గిగావాట్ల మేర పునరుత్పాదక ఇంధనాన్ని విద్యుత్తు గ్రిడ్‌కు జోడించాలని ఆశిస్తోంది. తద్వారా పట్టణాల్లో గాలిని పరిశుభ్రపర్చాలని అలాగే బొగ్గు వాడకాన్ని తగ్గించుకోవాలని అనుకుంటోంది. 2022 నాటికి 175 గిగావాట్లు సాధించాలని అందులో వంద గిగా వాట్లను సోలార్ నుంచి పొందాలని భావిస్తోంది. గ్రీన్ హౌస్ గ్యాసెస్ ఉద్గారంలో ప్రపంచంలోనే మూడో స్థానంలో భారత దేశం ఉంది. ఉద్గారాల తగ్గింపునకు కట్టుబడి ఉంది. పునరుత్పాదక ఇంధన వనరులతో సామర్థ్యాన్ని 40 శాతం మేర పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు ఆ సామర్థ్యం 21.4శాతం మాత్రమే. పెరుగుతున్న జనాభా విద్యుత్తు అవసరాలను తీర్చడానికి ఉద్దేశించి తీసుకున్న చిన్నపాటి చర్యగా దీన్ని పేర్కొనవచ్చు.

## కెరీర్

పునరుత్పాదక ఇంధన వనరులపై ప్రభుత్వం దృష్టి సారించడంతో సరికొత్త ఉద్యోగ సృష్టికి అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే ప్రక్రియలో మొదటగా వివిధ పరికరాలు అవసరమవుతున్నాయి. దాంతో వాటిని ఉత్పత్తి చేసేందుకు నైపుణ్యం కలిగిన మానవవనరులకు డిమాండ్ పెరిగింది. అయితే ఆ డిమాండ్ అక్కడితో ఆగలేదు. సంబంధిత ప్రతి ఏరియా అంటే ఆ పరికరాల బిగింపు, సిస్టమ్ డిజైనింగ్, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ఫైనాన్సింగ్, మార్కెటింగ్ కోసం సిబ్బంది రూపంలో అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం నెలకొల్పిన 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ' అవసరమైన సిబ్బందికి తగు సాంకేతిక నైపుణ్యాలను నేర్పించడంలో సహకరిస్తోంది. సంబంధిత పరిశోధనలనూ ప్రోత్సహిస్తోంది.

## కాలేజీ కరికులమ్‌లో

పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టుల్లో ప్రధానాంశం ఫైనాన్షియల్ ఎవల్యూషన్. ఆర్థికంగా సదరు ప్రాజెక్టు సానుకూలంగా ఉందా లేదా అన్నది తేల్చుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పేబ్యాక్ పీరియడ్, నెట్ ప్రజెంట్ వాల్యూ, ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్, డిప్రిసియేషన్, డిప్రిషియేషన్ అకౌంటింగ్ వంటి టాపిక్స్‌తో ప్రాజెక్టులను స్టడీలో భాగంగా చేస్తారు. అందులో భాగంగా వివిధ అంశాలను లోతుగా పరిశీలించాల్సి ఉంటుంది. విద్యాసంస్థలు ఈ విషయాలను తమ కరికులమ్‌లో పొందుపరుస్తారు. తద్వారా తమ విద్యార్థులు ప్రొఫెషనల్స్‌గా ముఖ్యంగా ఎనర్జీ మేనేజర్లుగా ఎదిగేందుకు తోడ్పడుతున్నారు. నిర్వహణలో తలెత్తే రిస్కులు, నష్టం తగ్గింపు వంటి ప్రాజెక్టులు ప్రధానంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపకరిస్తాయి. వారికి మేనేజీరియల్ కార్యకలాపాలపై అవగాహనను పెంచుతాయి. అలాగే రెన్యువబుల్ ఎనర్జీ ప్రోగ్రామ్‌ల్లో ఎనర్జీ మేనేజ్‌మెంట్ అండ్ ఆడిట్ అనే ప్రధాన అంశం కలగలిసి ఉంటుంది. ప్రిన్సిపల్స్ ఆఫ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్, రిక్వయిర్‌మెంట్ ఆఫ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్, టెక్నికల్ ఇంప్లిమెంటేషన్ వంటి అంశాలు కోర్సు డిజైనింగ్‌లోనే ఉంటాయి. ఎనర్జీ ఆడిటింగ్‌పై అవగాహన ఉంటే మంచి వేతనాలతో జాబ్స్ వస్తాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు తమ కరికులమ్‌లో రెన్యువబుల్ ఎనర్జీ ప్రోగ్రామ్‌లను కలుపుతున్నాయి. ఎనర్జీ ఎఫిసియెంట్ టెక్నాలజీపై కృషి చేసే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది.



### రెన్యువబుల్ ఎనర్జీలో ఎంటెక్ అందిస్తున్న సంస్థలు

- ఐఐటి, ఢిల్లీ
- ఐఐటి, బాంబే
- ఎన్ఐటి, తిరుచ్చి
- ఎన్ఐటి, హమీర్‌పూర్
- యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్, డెహ్రాడూన్
- అమ్రిత విశ్వవిద్యాలయం, కోయంబత్తూరు
- తెరి యూనివర్సిటీ, న్యూఢిల్లీ
- స్కూల్ ఆఫ్ ఎనర్జీ, యూనివర్సిటీ ఆఫ్ పుణె
- దేవీ అహిల్య విశ్వవిద్యాలయం, ఇండోర్
- తేజ్‌పూర్ యూనివర్సిటీ
- విఐటి యూనివర్సిటీ, వెల్లూరు
- ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, చెన్నై
- ఎమిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రెన్యువబుల్ అండ్ ఆల్టర్నేటివ్ ఎనర్జీ, నోయిడా
- స్కూల్ ఆఫ్ ఎనర్జీ స్టడీస్, జాదవ్‌పూర్ యూనివర్సిటీ, కోల్‌కతా
- దీనబంధు చోటురామ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సోనెపట్(హర్యానా)
- కళాసలింగం యూనివర్సిటీ, విరుధునగర్
- కారుణ్య యూనివర్సిటీ, కోయంబత్తూరు
- నిట్టే మీనాక్షి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బెంగుళూరు
- పెరియార్ మణియమ్మాయ్ యూనివర్సిటీ, తంజావూర్
- రాజస్థాన్ టెక్నికల్ యూనివర్సిటీ, కోట
- సామ్ హిగ్గిన్‌బాథమ్ అగ్రికల్చర్, సైన్స్ అండ్ టెక్నాలజీ, అల్హాబాద్
- గాంధీగ్రామ్ రూరల్ యూనివర్సిటీ, చిన్నాలపట్టి
- స్కూల్ ఆఫ్ సోలార్ ఎనర్జీ, పండిట్ దీనదయాళ్ పెట్రోలియం యూనివర్సిటీ, గుజరాత్

(ఇవి కాకుండా డెహ్రాడూన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం పీజీ ప్రోగ్రామ్ ఇన్ రెన్యువబుల్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ కోర్సును అందిస్తోంది.)

## జాబ్స్

### టెక్నీషియన్లు

ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (భారత ప్రభుత్వ శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన సంస్థ), పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 235**
**పోస్టులు:** ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, ఆఫీసర్, అసిస్టెంట్ ఆఫీసర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, టెక్నీషియన్ తదితరాలు.
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, సీఏ / ఐసీడబ్ల్యూఏఐ, పోస్టు గ్రాడ్యుయేట్, ప్లస్ అనుభవం.
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
**దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
**వెబ్‌సైట్:** www.eeslindia.org

### ప్రాజెక్ట్ ఇంజనీర్లు

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ - తిరువనంతపురం (కేరళ), ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 82**
**పోస్టుల వారీగా ఖాళీలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్ - 73, ప్రాజెక్ట్ అసిస్టెంట్ - 5, ప్రాజెక్ట్ టెక్నీషియన్ - 4.
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఐటీఐ, డిప్లొమా, బీఈ / బీటెక్, ఎంఈ / ఎంటెక్, అనుభవం. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
**దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
**వెబ్‌సైట్:** www.cdac.in/

### స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు:67**
**పోస్టులు:** మేనేజర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్, మేనేజర్ అనలిస్ట్. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, బీఈ / బీటెక్, ఎంబీఏ, అనుభవం. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
**దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 6
**వెబ్‌సైట్:** www.sbi.co.in/

## ఎన్‌టిఎస్ఇ సక్సెస్ రూట్

# ప్రాక్టీస్, మాక్ టెస్ట్, అనాల్సిస్, కరెక్షన్

నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్(ఎన్‌టిఎస్ఇ) దేశంలోనే పురాతనమైన, ప్రతిష్ఠాత్మక పోటీ పరీక్ష. ఇది రెండు దశలుగా జరుగుతుంది. మొదటి దశ పరీక్షను రాష్ట్ర స్థాయి బోర్డులు చేపడతాయి. రెండో దశ ఎగ్జామ్‌ను జాతీయ స్థాయిలో ఎన్‌సిఇఆర్‌టి నిర్వహిస్తుంది. మొదటి దశ పరీక్షలో ప్రతి రాష్ట్రానికీ కోటా ఉంటుంది. ఆ కోటా నిర్దుష్టంగా ఉంటుంది. రెండో దశకు సంబంధించి ఎలాంటి సీలింగ్ ఉండదు. అందరూ ఒకటే. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయవచ్చు.

మొదటి దశ పరీక్ష ఏటా నవంబర్‌లో జరుగుతుంది. అకడమిక్‌పరంగా చూసుకున్నప్పుడు ఈ టాలెంట్ పరీక్షకు హాజరుకావడం విద్యార్థి దశలో చాలా ముఖ్యం. తోటి తెలివైన విద్యార్థులతో పోటీ పడేందుకు ఈ పరీక్ష బాగా ఉపయోగపడుతుంది. తన సత్తా ఏమిటో తేల్చుకునే ప్రాథమిక పరీక్షగా పేర్కొనవచ్చు. సైన్స్‌లో భవిష్యత్తును నిర్మించుకోవాలని భావించే విద్యార్థులు తప్పనిసరిగా రాయాల్సిన ఎగ్జామ్ ఇది. ఈ టెస్ట్ రెండు దశలను క్లియర్ చేయడమంటే ఆ వయస్సులో అతి పెద్ద విజయంగానే చెప్పుకోవచ్చు. నిజానికి ఈ టెస్ట్‌లో సాధించిన విజయం విద్యార్థి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది. కఠోరమైన ప్రాక్టీస్ అంతకు మించి టెస్ట్ పేపర్ల సాల్వింగ్, వైఫల్యాల విశ్లేషణ ఈ పరీక్షకు సంబంధించి ప్రధాన ఎత్తుగడలు. ఈ టెస్ట్‌తో వచ్చే స్కాలర్‌షిప్ మొత్తం స్వల్పమే అయినప్పటికీ, ప్రభుత్వ వ్యవస్థ నిర్వహిస్తున్నందున ఈ పరీక్షకు ఇతోధిక విలువ ఉంటుంది.

నిజానికి సాధారణ పరీక్షల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థుల్లో ఎక్కువ మంది పోటీ పరీక్షల్లో ఎటువంటి ఫలితాన్ని చూపలేరు. అలాంటి విద్యార్థులకు రియాలిటీ చెక్ మాదిరిగా ఈ పరీక్ష ఉపయోగపడతుంది. భ్రమల నుంచి బయటపడేస్తుంది. ఈ పరీక్ష ద్వారా బయటపడ్డ బలహీనతలను సరిగా అంచనా వేసుకోగలిగితే, లోపాలను సరిదిద్దుకునేందుకు రెండేళ్ళు అంటే ఇంటర్ చదివే కాలం సరిపోతుంది. తదుపరి చదువులకు చక్కగా సన్నద్ధం కావచ్చు. ఇంటర్ తరవాత జరిగే పోటీ పరీక్షలను చాలా సులువుగా ఎదుర్కోవచ్చు.

అమెరికా, బ్రిటన్ తదితర పాశ్చాత్య దేశాల్లో చదువుకోవాలని అనుకునే విద్యార్థులకు ఈ పరీక్ష ఎంతో ముఖ్యం. విద్యేతర కార్యకలాపాల రికార్డు వారికి చాలా అవసరం. అందుకు ఈ టెస్ట్‌లో సాధించిన విజయం ఎంతగానో పనికొస్తుంది. ప్రొఫైల్‌లో అదనపు మైలురాయిగా ఈ విజయం సహాయపడుతుంది.

ఇంటెలిజెంట్ కోషియంట్(ఐక్యు), మెంటల్ ఎబిలిటీ(ఎంఎ)ను డెవలప్ చేసుకునేందుకు ఎన్‌టిఎస్ఇ ఎగ్జామ్ స్ట్రక్చర్ వీలైనది. నేర్చుకున్న కాన్సెప్ట్‌ను ఉపయోగించి ప్రాబ్లెమ్‌ను సాల్వ్ చేసే విధం తెలుస్తుంది. ఆ రకంగా ప్రాక్టీస్ మొదట అలవడుతుంది. విద్యార్థిలో ఉండే పోటీతత్వాన్ని సరిగ్గా అంచనా వేసేందుకు, సదరు లక్షణాలను సరిచూసుకునేందుకు ఆ స్థాయి విద్యార్థులకు ఉపయోగడే బహుశా ఒకేఒక పరీక్షగా దీన్ని చెప్పవచ్చు. ఇంటర్ తరవాత రాసే పోటీ పరీక్షల్లో అడిగే ప్రశ్నలు ఎక్కువగా లాజిక్, రీజనింగ్, అనలిటిక్ అప్రోచ్‌ను కలిగి ఉంటున్నాయి. ఆ సామర్థ్యం ఎన్‌టిఎస్ఇ ఎగ్జామ్‌తో అలవడుతుంది.

### ప్రిపరేషన్ వ్యూహం

ఈ టెస్ట్‌కు నిర్దేశించిన సిలబస్‌ను మొదట రెండు భాగాలుగా విభజించుకోవాలి. అంటే 9, 10 తరగతుల సిలబస్‌గా విడదీసుకోవాలి. మొదటి దశపై దృష్టిపెట్టే విద్యార్థి అప్రోచ్ ఈ విధంగా ఉండాలి.

ఈ పరీక్షలో తొమ్మిదో తరగతి సిలబస్ ఎక్కువ సవాలును విసురుతుంది. ఆ క్లాస్ పూర్తయినందున అక్కడ నేర్చుకున్న అంశాలు మర్చిపోయే అవకాశమే ఎక్కువగా ఉంటుంది. ఆ సిలబస్‌పై సరైన రివిజన్ జరగాలి. అక్కడ వెనకడుగుపడితే పరీక్షలో విజయం సాధ్యం కాదు. ఇబ్బందికరంగా అనిపించిన ఏరియాలో మరింత దృష్టిపెట్టి ప్రిపరేషన్ కొనసాగించాలి.

పదో తరగతికి సంబంధించి సిలబస్‌లో ఒక మేర పోర్షన్ ఇప్పటికే కవర్ అయి ఉంటుంది. మిగిలిన అంశాలను అధ్యయనం చేయాలి. పోటీలో ముందు ఉండాలంటే ఉన్న దానికి మించిన స్థాయిలో ప్రిపరేషన్ కొనసాగించాలి. రివిజన్‌కు మంచి నోట్స్‌ను రూపొందించుకోవాలి.

పరీక్షకు చాలా రోజుల ముందే సిలబస్ యావత్తు పూర్తి చేయాలి. అప్పుడే రివిజన్‌కు అవసరమైన సమయం మిగులుతుంది. ఇక అప్పట్నించి టెస్టింగ్, అసెస్‌మెంట్ మోడ్‌లోకి వెళ్ళాలి. గట్టిగా ప్రాక్టీస్, టెస్ట్ పేపర్ల సాల్వింగ్, పర్ఫార్మెన్స్ అనాల్సిస్ తదుపరి దశలో కీలకంగా ఉంటాయి. సిలబస్ పూర్తికాలేదంటూ మాక్ టెస్టులకు దూరంగా ఉండొద్దు. టెస్ట్ పేపర్ల సాల్వింగ్, అనాల్సిస్ ప్రిపరేషన్‌లో భాగం అన్న అంశాన్ని మరువొద్దు. ఆ క్రమంలో టెస్ట్ టెంపర్‌మెంట్ నిర్మితమవుతుంది. స్ట్రాంగ్, వీక్ ఏరియాలు ఏమిటన్నది తేటతెల్లమవుతుంది. ఈ ప్రాక్టీస్‌లో భాగంగానే ఆక్యురసీ, స్పీడ్ పెరుగుతాయి.

ఆలిండియా టెస్ట్ సిరీస్ సబ్‌స్క్రైబ్ అయితే చాలా మంచిది. జాతీయ స్థాయిలో ప్రిపరేషన్‌కు, పోటీకి ఇది ఉపయోగపడుతుంది. ఎక్కడ వీక్‌గా ఉన్నామనది త్వరగా తేల్చుకోవచ్చు. పోస్ట్ టెస్ట్ అనాల్సిస్ చాలా ముఖ్యం, మెంటల్ ఎబిలిటీ సెక్షన్ కోసం ప్రతి రెండో రోజు వంద ప్రశ్నలతో కూడిన పూర్తి పేపర్‌ను అటెంప్ట్ చేయడం మంచిది. పాత పేపర్లను సాల్వ్ చేయడం కూడా మంచిదే. ఈ పరీక్షలో ఏ టైప్ ప్రశ్నలు వస్తున్నాయో తెలుస్తుంది. పరీక్షించే విధంపై పట్టు ఏర్పడుతుంది. అలాగే కాన్సెప్ట్ లిస్టును రూపొందించుకుంటే మంచిది. సబ్జెక్టులు, చాప్టర్ వారీగా ఉంటే దేనిపై ఎక్కువ గురిపెట్టాలో అర్థమవుతుంది.

స్టడీ ప్లాన్‌కు అనుగుణంగా ప్రిపేరైతే చాలు, అనవసరంగా ఒత్తిడిని మాత్రం పెంచుకోవద్దు.

**- పార్థా హల్దార్,** ఫిట్జీ



## Bulletin Board

### Legal scholarship

The University of Wollongong, Australia invites applications for UOW Law's Change the World Scholarship 2019-20 from Law applicants. The deadline to apply is November 8. For more details, log on to www.uow.edu.au

### Research training programme scholarship

The Government of Australia in partnership with Deakin University, Australia invites application from master's and doctoral degree applicants for Research Training Programme scholarship. The last date to apply is November 31. For more details, log on to www.deakin.edu.au

### Name NASA's Mars rover contest

NASA is inviting students from kindergarten to Class 12 to submit essays to name NASA's next Mars rover. The last date to submit essays is November 1. The essays of nalists will be published on NASA's Mars website.

### Scholarship for Class 12 students

Applications are invited for NSDL Shiksha Sahyog Scholarship Scheme for Class 12 students. For more information, log on to www.vidyasaarathi.co.in/Vidyasaarathi/resources/114/197_2.html or write to vidyasaarathi@nsdl.co.in.

### Cambridge scholarship

Gates Cambridge is offering full-tuition scholarships to outstanding applicants from countries outside the UK to pursue a full-time postgraduate degree in any subject available at the University of Cambridge. For more details, log on to www.gatescambridge.org/.

### Grant for master's degree

Université de Lausanne, Switzerland invites applications for UNIL Master's Grants 2019 from graduate students who want to pursue a master's degree. The deadline to apply is November 1. For more details, log on to www.unil.ch/international/unil-mastersgrant-1.

### International development fellowship

Catholic Relief Services invites application for International Development Fellows Programme 2019-20. The deadline to apply is November 1. For more details, log on to www.crs.org/about/careers/fellowships .

### Course in cosmology

An introductory course in Cosmology will be conducted at M P Birla Institute of Fundamental Research, Bengaluru from November 9 to December 7. The classroom sessions will be held on Saturdays from 2 pm to 5 pm. This course is open to all. For more details, contact 080- 2238 5956 or log on to www.mpbifr-blr.in.

### International relations, literature fellowship

Osmania University's Centre for International Programmes is inviting applications for James Roach Fellowship from PhD students for a one-month long residential fellowship that will be held during the winter vacations. The deadline to apply is November 15. For more details, log on to www.osmania.ac.in/oucip

### IIE MSA scholarships

IIE MSA invites applications for IIE MSA Scholarships 2019 from undergraduates applicants. The deadline to apply is November 15. For more details, log on to www.iiemsa.co.za/financing-options/msa-scholarships/ .

## ఎన్టీఆర్... స్వీట్ హార్ట్!

**- అట్లీ**


ప్రియ, అట్లీ, మహేశ్ కోనేరు, హరీశ్ శంకర్

"నాకు అట్లీ సినిమాలన్నీ నచ్చాయి. విజయ్-అట్లీ కాంబినేషన్‌కు తమిళంలోనే కాదు, తెలుగులోనూ అభిమానులున్నారు. హై ఎమోషనల్ కంటెంట్‌తో తీసిన 'విజిల్' అట్లీ కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అవుతుంది. దేశమంతటా మెచ్చుకునే చిత్రమిది. త్వరలో ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్‌లో మహేశ్ కోనేరుతో సినిమా చేయబోతున్నా" అన్నారు హరీశ్ శంకర్. విజయ్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'బిగిల్'. ఈ నెల 25న తెలుగులో 'విజల్'గా మహేశ్ కోనేరు విడుదల చేస్తున్నారు. అట్లీ మాట్లాడుతూ "తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించాలనే చిరకాల కోరిక అతి త్వరలో నెరవేరనుంది. జూనియర్ ఎన్టీఆర్... స్వీట్ హార్ట్. నా సినిమా విడుదలైన ప్రతిసారీ ఫోన్ చేసి అభినందిస్తారు. ఆయన చూపించే ప్రేమ వల్లే తెలుగు సినిమా చేయాలనుకుంటున్నా. 'విజిల్' విషయానికొస్తే... కంప్లీట్ స్పోర్ట్స్ సినిమా కాదిది, మహిళా సాధికారతపై తీసిన యాక్షన్ డ్రామా. సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, అత్యాచారాలు చూసి... బాధతో ఈ కథ రాశా. ప్రతి మహిళ, పురుషుడు ఈ సినిమా చూడాలి. ఈ చిత్రాన్ని మహిళలకు అంకితమిస్తున్నా" అన్నారు. మహేశ్ కోనేరు మాట్లాడుతూ "తమిళంలో ఈ చిత్రానికి ఎంత క్రేజ్ ఉందో... తెలుగులోనూ అంతే క్రేజ్, డిమాండ్ ఉన్నాయి. ఇది భారతీయ సినిమా" అని అన్నారు. ఈ కార్యక్రమంలో అట్లీ సతీమణి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## గెలిస్తే... దేశమంతా గెలుస్తా!

**- సల్మాన్‌ఖాన్**



"ఈ సినిమా కథ నేనే రాశా. అందుకని, హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో విడుదల చేయాలనుకున్నాను. గెలిస్తే... దేశమంతా, అన్ని ప్రాంతాల్లో గెలుస్తా. లేదంటే ముంబైలో విమర్శకులే కాదు... చెన్నై, బెంగళూరు ఇలా అన్ని ప్రాంతాల్లో విమర్శకుల నుండి తిట్లు పడతాయి" అని సల్మాన్‌ఖాన్ అన్నారు. చుల్‌బుల్ పాండేగా 'దబాంగ్', 'దబాంగ్ 2' చిత్రాల్లో అలరించిన ఆయన, 'దబాంగ్ 3'తో డిసెంబర్ 20న మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ప్రభుదేవా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సోనాక్షీ సిన్హా, సయీ మంజ్రేకర్ హీరోయిన్లు. సుదీప్ విలన్‌గా నటించారు. బుధవారం ఈ సినిమా ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో మీడియాతో పాటు అభిమానులతో సల్మాన్‌ఖాన్ లైవ్ చాట్‌లో సంభాషించారు. "సౌతిండియన్ సినిమా ఫార్మాట్‌లో 'దబాంగ్ 3' ఉంటుంది. కథ, యాక్షన్, డ్యాన్సులు, కామెడీ, ప్రేమ సన్నివేశాలు... అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటాయి. ఇంతకుముందు నేను తెలుగు సినిమాలను హిందీలో రీమేక్ చేశా. ఇప్పుడు టీవీలో తెలుగు సినిమాల డబ్బింగ్ వెర్షన్లు టెలికాస్ట్ చేస్తున్నారు. అందువల్ల, రీమేక్ చేయాల్సిన అవసరం లేదనుకుంటున్నా" అన్నారు. త్వరలో పూరి జగన్నాథ్‌ను కలిసే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు.
















## చేసేయండి!

### పక్షి బొమ్మ

1. చదరపు కాగితం తీసుకోండి. A, B పాయింట్లను మధ్య వైపు మడవండి. ఇప్పుడు 1, 2 పాయింట్లు కలిసేలా కాగితాన్ని సగానికి మడవండి.



2. C పాయింట్ వద్ద పదునైన మడత చేసి దాన్ని లోపలికి లాగండి. ఇప్పుడు పక్షి తల సిద్ధం.



3. కత్తెర సహాయంతో బొమ్మలో చూపించిన విధంగా కత్తిరించండి



4. బొమ్మలో చూపిన విధంగా పాయింట్ D ని మడవండి. రెండోవైపు కూడా అలాగే మడవండి. అంతే... పక్షి బొమ్మ రెడీ.



## సరైన నీడను గుర్తించండి?






## దారి కనుక్కోండి?



## చుక్కలు కలపండి



### డైలీ సుడోకు - 175

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 6 | | 9 | | 4 | | 5 |
| | | | 3 | 4 | | 1 | | |
| | | | | | 5 | | 6 | 8 |
| | 4 | 7 | 6 | | | 9 | | |
| | | | | | | | | |
| | | 5 | | | 4 | 2 | 8 | |
| 3 | 6 | | 8 | | | | | |
| | | 9 | | 3 | 7 | | | |
| 1 | | 4 | | 6 | | 8 | | |

### సుడోకు- 174 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 9 | 4 | 1 | 8 | 2 | 6 | 7 | 5 |
| 8 | 5 | 1 | 3 | 7 | 6 | 4 | 2 | 9 |
| 6 | 2 | 7 | 4 | 9 | 5 | 3 | 1 | 8 |
| 7 | 4 | 6 | 2 | 1 | 9 | 5 | 8 | 3 |
| 9 | 8 | 2 | 7 | 5 | 3 | 1 | 4 | 6 |
| 1 | 3 | 5 | 6 | 4 | 8 | 2 | 9 | 7 |
| 5 | 7 | 3 | 9 | 2 | 4 | 8 | 6 | 1 |
| 4 | 1 | 8 | 5 | 6 | 7 | 9 | 3 | 2 |
| 2 | 6 | 9 | 8 | 3 | 1 | 7 | 5 | 4 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.



## ఠాగూర్ పేరుతో డైనోసార్

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ పేరిట ఓ డైనోసార్ ఉందట. కోల్‌కతా మ్యూజియంలో ఉన్న ఈ డైనోసార్ శిలాజానికి 'బరపాసారస్ ఠాగూరై' అని పిలుస్తారు. ఈ విషయాన్ని పర్వీన్ కాశ్వాన్ అనే ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారి ట్విటర్‌లో షేర్ చేశారు. ఈ డైనోసార్ శిలాజం పొడవు 18 మీటర్లు, బరువు 7 టన్నులని, 1960లో తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో దీని అస్థిపంజరాన్ని కనుగొన్నారని కాశ్వాన్ పేర్కొన్నారు. బరపాసారస్ అంటే పెద్దకాళ్లు కలిగిన బల్లి అని ఆయన తెలిపారు. - న్యూఢిల్లీ

## అభినవ శ్రవణ కుమారుడికి మహీంద్ర కారు

'ఇంట్లో కూర్చొని విసుగొస్తోందిరా. పుణ్యక్షేత్రాలు చూడాలని ఉంది' అన్న 70 ఏళ్ల తల్లి మాటతో ఓ అభినవ శ్రవణ కుమారుడు తన తండ్రి వాడిన 20 ఏళ్లనాటి స్కూటర్‌పై తల్లిని కూర్చోబెట్టుకొని 'మాతృ సేవా సంకల్ప యాత్ర'కు బయల్దేరాడు. జనవరి 16న దక్షిణామూర్తి కృష్ణకుమార్(39) ప్రారంభించిన ఈ యాత్రలో 48,100 కిలోమీటర్ల దూరాన్ని చుట్టుముట్టి దేశంలోని పుణ్యక్షేత్రాల దర్శనం చేయించాడు. దీని గురించి ఆయన స్నేహితుడు మనోజ్ చేసిన ట్వీట్‌కు స్పందించిన పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా రూ.5 లక్షల విలువైన 'మహీంద్రా కేయూవీ 100 ఎన్ఎక్స్‌టీ' కారును గిఫ్ట్‌గా ఇస్తానన్నారు.



# ఇంకిన కన్నీరు ఉబికొచ్చి..

## కుళ్లిపోయి, ఎముకల గూడుగా మృతదేహాలు.. ఐదింటిని గుర్తించిన బంధువులు

**తాయెత్తులు, మొలతాళ్ల ఆధారంగా గుర్తింపు**

**ఒక మృతదేహం గుర్తింపులో గందరగోళం**

**డీఎన్ఏ పరీక్షకు పంపిన అధికారులు**

రాజమహేంద్రవరం సిటీ, దేవీపట్నం, మడికొండ అక్టోబరు 23: ఏడ్చి ఏడ్చి ఇంకిన ఆ కళ్లు మళ్లీ కన్నీళ్లతో ఉబికాయి.. పూర్తిగా కుళ్లిపోయి, ధరించిన బట్టలు మాత్రమే మిగిలి ఎముకలగూడుగా మారిన మృతదేహాలను చూసి వెక్కివెక్కి ఏడ్చాయి. ఆప్తుల మృతదేహాల కోసం ఆవేదనతో వెతుకులాడాయి! ఏపీలోని రాజమహేంద్రవరం ఆస్పత్రి వద్ద బుధవారం కనిపించిన విషాద సన్నివేశమిది! గోదావరిలో మునిగిన బోటును వెలికితీసిన సమయంలో అందులో ఏడు మృతదేహాలు లభ్యమయ్యాయి. మొలతాళ్లు, మెడలో తాయెత్తులను చూసి మృతదేహాలను బాధితులు గుర్తించారు. గుర్తించిన వాటిలో వరంగల్ జిల్లా కడిపికొండకు చెందిన కొమ్ముల రవి (35), బస్కే ధర్మరాజు (50), కాకినాడ జగన్నాథపురానికి చెందిన బోటు అసిస్టెంట్ డ్రైవర్ పోతాబత్తుల సత్యనారాయణ (62), సంగాడి నూకరాజు (53), పశ్చిమ గోదావరి జిల్లా పట్టిసీమకు చెందిన బోటు క్యాంటీన్ హెల్పర్ కర్రి మణికంఠ (22) మృతదేహాలున్నాయి. రవి మృతదేహాన్ని ఆయన జేబులోని ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించారు. కాగా కొండా రాజశేఖర్ బంధువులు, సురభి రవీంద్ర బంధువులు ఒక మృతదేహం విషయంలో గందరగోళానికి గురయ్యారు. ఆ మృతదేహం రవీంద్రదని కొంతసేపు, రాజశేఖర్‌దని కొంతసేపు తర్జనభర్జన పడ్డారు. దీంతో ఆ మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం కాకినాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలిస్తున్నట్టు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్ కిశోర్ తెలిపారు. మిగిలిన రెండు మృతదేహాలను (ఇందులో ఒకటి రెండు రోజుల క్రితం వెలికితీత సమయంలో దొరికిన మొండెం) కూడా పరీక్షలకు పంపిస్తున్నట్టు ఆయన చెప్పారు. కాగా గోదావరి నుంచి వెలికితీసిన బోటులోనే మరో ఐదు మృతదేహాల అస్తిపంజరాలను పోలీసులు, వైద్యులు గుర్తించారు. గోదావరి ఒడ్డున ఉన్న రాయల్ వశిష్ఠ బోటును పోలీసులు, వైద్యులు బుధవారం పరిశీలించారు. బోటు లోపల ఇసుకను బయటకు తీస్తున్న క్రమంలో ఐదు మృతదేహాలకు సంబంధించిన ఎముకలు కనిపించాయి. వాటిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒక పర్సు, ఒక ప్యాంటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



మృతదేహాలను గుర్తించేందుకు వస్తున్న బంధువులు

మార్చురీ వద్ద రమ్యశ్రీ తండ్రి

### రమ్యశ్రీ.. ఎక్కడమ్మా నువ్వు

బోటు వెలికితీసిన నేపథ్యంలో తమ కుమార్తె రమ్యశ్రీ మృతదేహం లభిస్తుందేమోనని తెలంగాణలోని మంచిర్యాల నుంచి వచ్చిన ఆమె తల్లిదండ్రులు సుదర్శన్, భూలక్ష్మిలకు నిరాశే ఎదురైంది. బోటు వెలికితీసే సమయానికి దేవీపట్నం చేరుకుని అక్కడి నుంచి రాజమహేంద్రవరం ఆస్పత్రికి వచ్చారు. ఏడు మృతదేహాల్లో రమ్యశ్రీ లేదని నిర్ధారణ జరిగింది. మరోపక్క విశాఖకు చెందిన ఒక కుటుంబంలో ఇంకా తలారి గీతా వైష్ణవి (4), తలారి ధాత్రిఅనన్య (2), మధుపాడ అఖిలేష్ (7) ఆచూకీ కోసం మేనమామ ప్రవీణ్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎదురు చూస్తున్నాడు. వీరి ఆచూకీ కూడా లభ్యం కాలేదు. ఏడింటిలో ఒక మృతదేహం రెండేళ్ల వయసు కలిగిన చిన్నారిదని వైద్యులు తెలిపారు.



ధర్మాడి సత్యానికి చెక్కు అందిస్తున్న కలెక్టర్ మురళీధర్‌రెడ్డి

### ధర్మాడి సత్యానికి సన్మానం

కాకినాడ సిటీ, అక్టోబరు 23: దేవీపట్నం మండలం కచ్చులూరు వద్ద సెప్టెంబరు 15న నీట మునిగిన రాయల్ వశిష్ఠ బోటును వెలికితీసిన ధర్మాడి సత్యంను తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మురళీధర్‌రెడ్డి అభినందించారు. కలెక్టరేట్‌లో బుధవారం సత్యం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సత్యానికి శాలువా కప్పి, ఒక మొక్కను అందించిన కలెక్టర్ ఆపరేషన్‌లో పాల్గొన్న బృందాన్ని అభినందించారు. అనంతరం రూ.20 లక్షల చెక్‌ను అందజేశారు. బోటు వెలికితీతకు రూ.22.70 లక్షలకు ఒప్పందం కుదరగా తొలుత అడ్వాన్స్‌గా రూ.2.70 లక్షలు అందించారు.




## కుమార్తెతో 'హనీ ట్రాప్'!

బెంగళూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డేటింగ్ యాప్‌ను ప్రారంభించి, 21 ఏళ్ల తమ కుమార్తెను ఓ వైద్యుడికి ఎరగా వేసి అతడి నుంచి ఐదు నెలల్లో రూ.42 లక్షలు కాజేశారు బెంగళూరుకు చెందిన దంపతులు. తమ కుమార్తెతో ఏకాంత ఫొటోలు, వీడియోలు చూపి వైద్యుడి నుంచి మరో రూ.కోటి డిమాండ్ చేసి దొరికిపోయారు. 'మీ కుమారుడి కారణంగా మా అమ్మాయి గర్భం దాల్చింది. మరింత డబ్బు కట్టండి' అంటూ పదేపదే బెదిరిస్తుండడంతో వైద్యుడి తల్లి పోలీసులను ఆశ్రయించారు. వారు కూపీ లాగితే డేటింగ్ యాప్ వెలుగు చూసింది. సొంత కూతురినే డేటింగ్‌లోకి దించడం పోలీసులను విస్మయ పరిచింది. దీనిపై వారు దర్యాప్తు చేస్తున్నారు.



## ట్రక్కులో 39 మృతదేహాలు

లండన్, అక్టోబరు 23: ఎస్సెక్స్ కౌంటీలోని పారిశ్రామిక ప్రాంతంలో ఓ ట్రక్కులో 39 శవాలు బయటపడడంతో లండన్ బుధవారం ఉలిక్కిపడింది!! నగర సమీపంలో ఓ ట్రక్కు గంటల తరబడి ఉండటం.. డ్రైవర్ లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చి చూడగా టీనేజర్ సహా 39 మంది మృతదేహాలు కనిపించాయి! ఉపాధి కోసం అక్రమంగా వస్తున్నవారితో ఈ ట్రక్కు బల్గేరియా నుంచి బ్రిటన్‌లోని హోలీహెడ్ పట్టణంలోకి ప్రవేశించింది. రిఫ్రిజిరేటెడ్ ట్రక్కు కావడం, ఉష్ణోగ్రత మైనస్ 25 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉండడం, 4 రోజులు అందులోనే గడపడంతో వలసదారులు ప్రాణాలు కోల్పోయారు.

# ఎంఎస్‌వోలకు జరిమానా

## 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రసారాల నిలిపివేత ఫలితం




- **ఒక్కో ఎంఎస్‌వో రూ.5 వేలు చెల్లించాలి**
- **మరోసారి ప్రసారాలకు విఘాతం కలిగించొద్దు**
- **7 ఎంఎస్‌వోలకు టీడీశాట్ ఆదేశం**

న్యూఢిల్లీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' న్యూస్ చానల్ ప్రసారాల నిలిపివేత విషయంలో ఏడు ప్రైవేటు ఎంఎస్‌వో సంస్థలకు టెలికాం వివాదాల సెటిల్మెంట్ అండ్ అప్పిలేట్ ట్రైబ్యునల్(టీడీశాట్) జరిమానా విధించింది. 24 గంటల్లో చానల్ ప్రసారాలను పునరుద్ధరించాలని సెప్టెంబరు 27నే ట్రైబ్యునల్ ఆదేశించినా.. ఈ నెల 20వ తేదీ వరకు అమలు చేయనందుకు ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఒక్కో ఎంఎస్‌వోకు రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 'ఏబీఎన్' దాఖలు చేసిన బ్రాడ్‌కాస్టింగ్ పిటిషన్, కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ట్రైబ్యునల్ చైర్మన్ జస్టిస్ శివకీర్తి సింగ్ బుధవారం విచారణ జరిపారు. ఈ నెల 20 నుంచి 'ఏబీఎన్' చానల్‌ను ప్రసారం చేస్తున్నామని ఎంఎస్‌వో సంస్థల తరఫు న్యాయవాదులు ఈ సందర్భంగా ట్రైబ్యునల్‌కు తెలిపారు. అయితే, తాము ఆదేశించినా చాలా ఆలస్యంగా ప్రసారాలను పునరుద్ధరించినందుకు ఏపీలోని మాస్టర్ చానల్ కమ్యూనిటీ నెట్‌వర్క్(విజయవాడ, కృష్ణా జిల్లా), మచిలీపట్నం కమ్యూనికేషన్స్(మచిలీపట్నం), భీమవరం కమ్యూనిటీ నెట్‌వర్క్(భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా), యాక్ట్ డిజిటల్ నెట్‌వర్క్(నెల్లూరు జిల్లా), శ్రీదేవి డిజిటల్ సిస్టమ్స్ (విశాఖపట్టణం), విజయనగర్ సిటీ కమ్యూనికేషన్(విజయనగరం జిల్లా), శ్రీసాయి స్పందన డిజిటల్ కమ్యూనికేషన్స్(శ్రీకాకుళం జిల్లా) సంస్థలకు రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. దీన్ని 'ఏబీఎన్'కు వారం రోజుల్లో చెల్లించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకుండా..ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మరోసారి ప్రసారాలకు విఘాతం కలిగించవద్దని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని 'ఏబీఎన్' తరఫు న్యాయవాది గుంటూరు ప్రభాకర్ ట్రైబ్యునల్‌ను కోరారు. ప్రసారంలో చానల్ నాణ్యత దెబ్బతీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై కీలక ఆదేశాలు జారీ చేసిన జస్టిస్ శివకీర్తి సింగ్ ఈ పిటిషన్లపై విచారణను ముగించారు.

## రైతులకు దీపావళి కానుక

**రబీ పంటలకు కనీస మద్దతు ధర పెంపు**

**గోధుమ క్వింటాలు ధర రూ.1925**

న్యూఢిల్లీ, అక్టోబరు 23: ఉత్తర, మధ్య భారతావని రైతాంగానికి కేంద్రం దీపావళి కానుక ప్రకటించింది. రబీ పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ను పెంచింది. గోధుమ ఎంఎస్‌పీని రూ.85 మేర పెంచింది. దీని ప్రకారం ఇకపై గోధుమ క్వింటాలు ధర రూ.1925కు పెరుగుతుంది. నిరుడు గోధుమను క్వింటాలుకు రూ.1840 చెల్లించి ప్రభుత్వం రైతుల నుంచి కొనేది. బార్లీ ఎంఎస్‌పీని రూ.85 పెంచి క్వింటాలు ధరను రూ.1525 చేసింది. ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం ఈ నిర్ణయాలను తీసుకుంది. ఎర్ర కందిపప్పును రూ 325 మేర పెంచి క్వింటాలు ధర రూ.4800 చేశారు. పుట్నాల పప్పు (గుల్ల శనగపప్పు) ధరను రూ.255 మేర పెంచి రూ.4875 చేశారు. కుసుమ (శాఫ్లవర్) ధరను రూ.270 పెంచి క్వింటాల్‌ను రూ.5215కు పెంచారు. ఇతరత్రా పప్పుల (శెనగలు, వివిధ రంగుల్లో లభ్యమయ్యే కాయ ధాన్యాలు..) ధరను రూ.325 పెంచి క్వింటాలుకు రూ.4800 చేశారు. ఇక రేప్ సీడ్, ఆవ నూనెల కనీస మద్దతు ధరను రూ.225 మేర పెంచి క్వింటాలు ధరను రూ.4425గా స్థిరీకరించారు. ఈ ధరవరలు 2020-21 మార్కెటింగ్ సీజన్‌కు వర్తిస్తాయని జావడేకర్ తెలిపారు.

## కశ్మీరులో ఏజీహెచ్ అంతం

- **అల్‌ఖైదా అనుబంధ సంస్థ చీఫ్ హతం: డీజీపీ**



న్యూఢిల్లీ, అక్టోబరు 23: అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అన్సర్ ఘజ్వాత్ ఉల్ హింద్ (ఏజీహెచ్)ను నామరూపాల్లేకుండా చేశామని జమ్మూకశ్మీరు డీజీపీ దిల్బాగ్ సింగ్ వెల్లడించారు. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏజీహెచ్ చీఫ్ హమీద్ లోన్, మరో ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చినట్లు తెలిపారు. ఈ ముగ్గురిపైనా ఉగ్రదాడులకు సంబంధించి అనేక కేసులు ఉన్నట్లు తెలిపారు. లోయలోని ఉగ్రవాద సంస్థలకు పాక్ మద్దతిస్తోందని ఆరోపించారు. కాగా.. ఈ నెల 19, 20 తేదీల్లో పీవోకేలోని ఉగ్రశిబిరాలపై శతఘ్నులతో జరిపిన దాడిలో 16 మంది పాక్ సైనికులు, 18 మంది ఉగ్రవాదులు మరణించినట్లు ఓ సైనికాధికారి చెప్పారు.

### పాఠశాలను తగులబెట్టిన మిలిటెంట్లు

జమ్మూకశ్మీరులో మిలిటెంట్లు విధ్వంసానికి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి కుల్గాంలో ఒక పాఠశాలను, శ్రీనగర్‌లో దుకాణాన్ని తగులబెట్టారు. పుల్వామాలో ట్రక్కును దగ్ధం చేశారు. శ్రీనగర్‌లోని కూరగాయల మార్కెట్‌లో పెట్రోల్ బాంబు విసిరారు. ఈ ఘటనల్లో ఎవరూ గాయపడలేదని సమాచారం. రాష్ట్రంలో గురువారం బ్లాక్ అభివృద్ధి మండళ్లకు ఎన్నికల జరుగనుండగా మిలిటెంట్లు దాడులకు తెగబడ్డారు.

## కాశీ.. కాలుష్యభరితం!

**హైదరాబాద్‌కు 91వ ర్యాంకు: సీపీసీబీ**

లఖ్‌నవూ, అక్టోబరు 23 : దేశంలోనే అత్యంత కాలుష్యభరిత నగరంగా కాశీ నిలిచింది. గాలి నాణ్యతా సూచీ(ఏక్యూఐ) ఆధారంగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) ఈవిషయాన్ని వెల్లడించింది. దేశంలోని 500 నగరాలకు 'ఏక్యూఐ ర్యాంకింగ్'లు ఇచ్చారు. ఈ జాబితాలోని తొలి మూడు కాలుష్యభరిత నగరాలు ఉత్తర ప్రదేశ్‌లోనివే. కాశీ 276వ స్థానంలో నిలవగా.. తర్వాతి స్థానాల్లో యూపీలోని లఖ్‌నవూ(269), ముజఫర్‌నగర్(266), మొరాదాబాద్(256) నిలిచాయి. ఇందులో హైదరాబాద్(91), విశాఖపట్నం(55), విజయవాడ(36), తిరుపతి(49), అమరావతి(32), రాజమండ్రి(46), ఢిల్లీ(196), ముంబై(109), బెంగళూరు(34) స్థానాల్లో ఉన్నాయి.



## నా ఆరోగ్యం బాగోలేదు

- **బెయిల్ కోసం చిదంబరం పిటిషన్**



న్యూఢిల్లీ, అక్టోబరు 23: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీలో ఉన్న కేంద్ర మాజీ హోం మంత్రి చిదంబరం బెయిల్ కోసం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. 'నా ఆరోగ్యం బాగుండటం లేదు. చలికాలం వచ్చేసింది. డెంగీలాంటి ప్రమాదకర రోగాలు సోకే అవకాశం ఉంది. బెయిల్ ఇప్పించండి" అని ఆయన పిటిషన్‌లో కోరారు.

## ఉత్తరాఖండ్ మాజీ సీఎం రావత్‌పై సీబీఐ కేసు



న్యూఢిల్లీ, అక్టోబరు 23: ఉత్తరాఖండ్ మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత హరీశ్ రావత్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. 2016లో బీజేపీలో చేరిన 9 మంది ఎమ్మెల్యేలను సొంత గూటికి తిరిగి తెచ్చేందుకు రావత్ బేరసారాలు జరిపిన వీడియో బయటకు రావడంతో.. హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ రంగంలోకి దిగింది.

## కర్ణాటక మాజీ మంత్రి డీకేకు బెయిల్



బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మనీ లాండరింగ్ కేసులో 48 రోజులుగా తీహార్ జైలులో ఉన్న కర్ణాటక సీనియర్ కాంగ్రెస్ నేత డీకే శివకుమార్‌కు బెయిల్ మంజూరైంది. ఆయనకు ఢిల్లీ హైకోర్టు షరతులతో బెయిల్ ఇచ్చింది. శివకుమార్‌కు ఆరో ప్రయత్నంలో బెయిల్ దక్కింది. తీహార్ జైలులో ఆయనతో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ భేటీ అయ్యారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

## 17 మందితో కాంగ్రెస్ ఉన్నతస్థాయి కమిటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 23: కాంగ్రెస్‌ను గాడిలో పెట్టేందుకు పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ తన నేతృత్వంలో 17 మంది సీనియర్ నాయకులతో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీలో రాహుల్‌తో పాటు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, అహ్మద్ పటేల్, ఏకే ఆంటోనీ, గులాంనబీ ఆజాద్, జ్యోతిరాదిత్య సింధియా, రాజీవ్ సతవ్, రణదీప్ సూర్జేవాలా, సుష్మితాదేవ్ ఉన్నారు. ప్రధాన కార్యదర్శి, ఉత్తర ప్రదేశ్ ఇన్‌చార్జి ప్రియాంక వాద్రా, ముఖ్యమంత్రులు ఇందులో లేరు. కమిటీ తొలి సమావేశం 25న జరుగనుంది.

## హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాలు నేడే

న్యూఢిల్లీ, అక్టోబరు 23: మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఫలితాల వెల్లడికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. 10 గంటలకల్లా సరళి తెలిసిపోతుంది. మధ్యాహ్నానికి పూర్తి వివరాలు ప్రకటిస్తారు. 288 సీట్లున్న మహారాష్ట్రలో బీజేపీ- శివసేన 200పై చిలుకు స్థానాలతో అధికారాన్ని నిలబెట్టుకుంటుందని పది ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. 90 సీట్లున్న హరియాణాలో హంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చని ఇండియా-టుడే- ఏక్సిస్ పోల్‌తో పాటు మరో చానెల్ అంచనా వేసింది. మిగిలిన అన్ని చానెళ్లూ 70పై చిలుకు సీట్లు ఖాయమనడంతో ఆసక్తికరంగా మారింది. మరో 16 రాష్ట్రాల్లోని 51 అసెంబ్లీ, రెండు లోక్‌సభ ఉప ఎన్నికల ఫలితాలూ వెలువడనున్నాయి.

## రైల్వేల ప్రైవేటీకరణపై టాస్క్‌ఫోర్స్

న్యూఢిల్లీ, అక్టోబరు 23: దేశవ్యాప్తంగా 50 రైల్వే స్టేషన్లు, 150 రైళ్ల నిర్వహణను ప్రైవేటుకు అప్పగించడాన్ని పరిశీలించేందుకు కేంద్రం ఓ సాధికారిక బృందాన్ని ఏర్పాటు చేసింది. నీతి ఆయోగ్ చైర్మన్ అమితాబ్ కాంత్ సూచన మేరకు రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్, ఆర్థిక, పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, రైల్వేల ఫైనాన్షియల్ కమిషనర్ ఈ బృందంలో సభ్యులు.

## వచ్చే ఏడాది భారత్‌కు మంచి రోజులు: ఐఎంఎఫ్

సింగపూర్ : భారత జీడీపీ వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) మళ్లీ పుంజుకుంటుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ తెలిపింది. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఆర్థిక ఉద్దీపన, పన్ను రేట్ల కోత ఇందుకు దోహదం చేస్తాయని అంచనా వేసింది. ఫలితంగా 2020-21లో భారత జీడీపీ వృద్ధి రేటు ఏడు శాతం వరకు ఉండొచ్చని ఐఎంఎఫ్ ఆసియా-పసిఫిక్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ జొనాథన్ ఒస్ట్రీ చెప్పారు. ఈ సంస్థ ఇటీవలే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాను ఏడు శాతం నుంచి 6.1 శాతానికి తగ్గించిన సంగతి విదితమే. 'ప్రస్తుత మందగమనానికి అనేక కారణాలు ఉన్నాయి. కంపెనీల సమస్యలకు తోడు, రెగ్యులేటరీ నిబంధనలు, ఎన్‌బీఎఫ్‌సీల రంగంలో నెలకొన్న సంక్షోభం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పడకేయడం ఇందుకు ప్రధాన కారణం' అన్నారు.

# బీఎస్ఎన్ఎల్‌లో ఎంటీఎన్ఎల్ విలీనం

## రూ.69,000 కోట్లతో పునరుద్ధరణ ప్యాకేజీ

## సగం మంది ఉద్యోగులకు వీఆర్ఎస్

### నెల రోజుల్లో 4జీ స్పెక్ట్రమ్ కేటాయింపు.. కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ టెలికాం సంస్థలైన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్)కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రెండు కంపెనీలను విలీనం చేయడంతో పాటు వాటి ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు రూ.69,000 కోట్లతో భారీ పునరుద్ధరణ ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుందని కేంద్ర టెలికాం శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ వెల్లడించారు.

విలీన ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎంటీఎన్ఎల్.. బీఎస్ఎన్ఎల్ అనుబంధ కంపెనీగా కొనసాగుతుంది. రెండు కంపెనీల మూలధన అవసరాల కోసం సావరిన్ బాండ్ల ను జారీ చేయటం ద్వారా వెంటనే రూ.15,000 కోట్లు సమీకరించేందుకూ కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసిందని రవిశంకర్ తెలిపారు.

#### అదనపు నిధుల సమీకరణ

బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ నెత్తిన ఇప్పటికే రూ.40,000 కోట్ల అప్పుల భారం ఉంది. ఇందులో సగం అప్పులు కేవలం ముంబై, ఢిల్లీ సర్కిళ్లలో టెలికాం సేవలు అందిస్తున్న ఎంటీఎన్ఎల్‌వి. ప్రైవేట్ కంపెనీలతో పోలిస్తే ఈ రెండు కంపెనీల అప్పుల భారం తక్కువ. అప్పులు తక్కువగా ఉండడంతో పాటు ఈ రెండు కంపెనీలకు స్థిరాస్తులూ ఎక్కువే. దీంతో ఈ ఆస్తులను హామీగా చూపి విస్తరణకు అవసరమైన పెట్టుబడులను బ్యాంకుల నుంచి రుణాలుగా సేకరించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

#### త్వరలో 60 వేల 4జీ టవర్లు : బీఎస్ఎన్ఎల్

4జీ స్పెక్ట్రమ్ కేటాయింపునకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో బీఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున 4జీ టవర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. వచ్చే 12-15 నెలల్లో 60వేల 4జీ మొబైల్ టవర్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు బీఎస్ఎన్ఎల్ సీఎండీ పీకే పుర్వార్ ప్రకటించారు.

కేరళ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని నగరాల్లో ఇప్పటికే 10,000 టవర్లు పని చేస్తున్నాయని ఆయన చెప్పారు. బీఎస్ఎన్ఎల్‌కు చెప్పుకోదగ్గ స్థాయిలో ఖాతాదారులు ఉండి, 4జీ మొబైల్ ఫోన్లు ఎక్కువగా ఉన్న నగరాల్లో ఈ మొబైల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నట్టు పుర్వార్ తెలిపారు.

#### ప్యాకేజీలో ఇతర ముఖ్యాంశాలు

- రెండు కంపెనీలకు నెల రోజుల్లో స్పెక్ట్రమ్ కేటాయింపు
- స్పెక్ట్రమ్ కోసం రూ.20,140 కోట్లు
- స్పెక్ట్రమ్ కేటాయింపునకు బదులుగా ప్రభుత్వానికి ఈక్విటీ షేర్లు
- జీఎస్‌టీ చెల్లింపు కోసం రూ.3,674 కోట్లు
- మూడేళ్లలో రెండు కంపెనీలకు చెందిన రూ.37,500 కోట్ల విలువైన ఆస్తుల నగదీకరణ

### వీఆర్ఎస్‌కు రూ.29,937 కోట్లు

పునరుద్ధరణ ప్యాకేజీలో భాగంగా రూ.29,937 కోట్ల మొత్తాన్ని రెండు కంపెనీల ఉద్యోగుల్లో సగం మంది స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) కోసం వెచ్చించనున్నట్లు మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. యాభై సంవత్సరాల వయో పరిమితి నిండిన ఉద్యోగులు ఈ వీఆర్ఎస్ పథకానికి అర్హులు. వీఆర్ఎస్‌లో భాగంగా 60 ఏళ్ల వయో పరిమితి వచ్చే వరకు వీరికి జీతం ద్వారా వచ్చే మొత్తం ఆదాయంలో 80 నుంచి 125 శాతం చెల్లించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ రెండు కంపెనీల ఆదాయంలో సింహభాగం సిబ్బంది వేతనాలకే పోతోంది. ప్రైవేట్ టెలికాం కంపెనీలు తమ ఆదాయంలో మూడు నుంచి ఐదు శాతం జీతాల కోసం ఖర్చు చేస్తుంటే.. బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ మాత్రం ఇందుకోసం 70 నుంచి 90 శాతం వెచ్చిస్తుండటం గమనార్హం.

దీంతో ప్రస్తుతం రెండు కంపెనీల్లో పని చేస్తున్న 1.9 లక్షల మంది ఉద్యోగుల్లో దాదాపు సగం మందిని వీఆర్ఎస్ ద్వారా వదిలించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ వీఆర్ఎస్ పథకానికి ఎంతమంది ఉద్యోగులు ఒప్పుకుంటారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

> వీఆర్ఎస్ ద్వారా అర్హులైన ఉద్యోగులకు 60 ఏళ్ల వయసు వచ్చే వరకు ఉండే సర్వీసులో జీతం ద్వారా వచ్చే ఆదాయంలో 125 శాతం అందుతుంది. ఈ నిర్ణయం ద్వారా ఈ రెండు పీఎస్‌యూల్లో పని చేస్తున్న లక్షలాది ఉద్యోగుల ప్రయోజనాన్నీ మేము పరిగణనలోకి తీసుకున్నాం.
> **- రవిశంకర్ ప్రసాద్, టెలికాం మంత్రి**

> 4జీ నెట్‌వర్క్ ఏర్పాటుకు అవసరమైన టెండర్లను రెండు నెలల్లో జారీ చేస్తాం.
> **- పీకే పుర్వర్, సీఎండీ, బీఎస్ఎన్ఎల్**

# ఇక విదేశీ కంపెనీల పెట్రోల్ పంపులు

### ప్రైవేటు సంస్థలూ ఏర్పాటు చేయవచ్చు.. రూ.250 కోట్ల నెట్‌వర్త్ ఉంటే చాలు

### రెండు దశాబ్దాల తర్వాత ఇంధన రిటైల్ రంగంలో సంస్కరణలు



న్యూఢిల్లీ: దాదాపు రెండు దశాబ్దాల తర్వాత దేశీయ ఇంధన విక్రయ రంగంలో మోదీ సర్కారు భారీ సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా పెట్రోల్ పంపులు ఏర్పాటు చేయడానికి సంబంధించిన నిబంధనలను సరళతరం చేసింది. ఈ మేరకు చమురేతర కంపెనీలు కూడా ఇంధనాల విక్రయ రంగంలోకి ప్రవేశించడానికి అనుమతిచ్చింది. దీనిమూలంగా దేశంలోని ప్రైవేటు కంపెనీలే కాకుండా విదేశీ కంపెనీలు కూడా మన దేశంలో పెట్రోల్ పంపులను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. మన దేశంలో ఇంధన విక్రయాలు శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేంద్ర కేబినెట్ కమిటీ (సీసీఈఏ) తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి ప్రకాశ్ జవదేకర్ విలేకరులకు వెల్లడించారు.. ఈ నిర్ణయంతో పెట్రోల్, డీజిల్ రిటైల్ వ్యాపారంలో ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలకు పోటీ పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఉత్పత్తుల రిటైల్ వ్యాపారంలో పీఎస్‌యూలు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాయి. రిలయన్స్, ఎస్సార్ వంటి కంపెనీలకు కొద్ది స్థాయిలో పంపులున్నా.. అవి నామమాత్రమే. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సౌదీ అరామ్కో, ఫ్రాన్స్‌కు చెందిన టోటల్, బ్రిటిష్ పెట్రోలియం వంటి అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు భారత పెట్రో ఉత్పత్తుల రిటైల్ మార్కెట్‌లో పెద్ద ఎత్తున ప్రవేశిస్తాయని భావిస్తున్నారు.

#### ప్రస్తుత నిబంధనలు

ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధన ప్రకారం.. ఏ కంపెనీ అయినా పెట్రో ఉత్పత్తుల రిటైల్ మార్కెట్‌లో ప్రవేశించాలంటే కనీసం రూ.2,000 కోట్లు దేశంలో చమురు, సహజ వాయువుల అన్వేషణ, ఉత్పత్తి, రిఫైనింగ్, పైప్‌లైన్లు లేదా ఎల్ఎన్‌జీ టెర్మినల్స్ రంగంలో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇప్పుడీ నిబంధన వర్తించదు. తాజా నిర్ణయాల ప్రకారం..

- కనీసం కంపెనీకి రూ.250 కోట్ల నికర ఆస్తులు కలిగి ఉంటే చాలు.
- ఐదేళ్లలో 5 శాతం పంపులు గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయాలి. లేకపోతే రూ.3 కోట్ల చొప్పున జరిమానా విధిస్తారు.
- లైసెన్సు తీసుకునేటప్పుడే బంకుకు రూ.2 కోట్ల చొప్పున డిపాజిట్ చేసి ఈ గడువు మరింత పొడిగించుకోవచ్చు.
- పెట్రోల్, డీజిల్‌తో పాటు మూడేళ్లలో ప్రత్యామ్నాయ ఇంధనాలైన సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, జీవ ఇంధనాల్లో ఏదో ఒకటి లేదా ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి.



కేబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న కేంద్ర మంత్రులు రవిశంకర్ ప్రసాద్, ప్రకాశ్ జవదేకర్

#### పెద్ద కంపెనీలకే మేలు

కేబినెట్ నిర్ణయంపై పెట్రోలియం డీలర్లు ఆచితూచి స్పందించారు. ఈ నిర్ణయం రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి దేశీయ పెద్ద కంపెనీలు, సౌదీ అరామ్కో వంటి విదేశీ కంపెనీలకే మేలు చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ పెట్రో ట్రేడర్స్ (ఏపీఎఫ్‌పీటీ) అధ్యక్షుడు ఆర్ గోపాల కృష్ణ 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో చెప్పారు. కొత్తగా వచ్చే కంపెనీలు అమ్మకాలు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో బంకులు ఏర్పాటు చేసేందుకు ఇష్టపడతాయే తప్ప, అమ్మకాలు తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాలపై పెద్దగా ఆసక్తి చూపక పోవచ్చన్నారు. ఇప్పటికే బంకుల సంఖ్య భారీగా ఉండడంతో కొన్ని ప్రాంతాల్లో అమ్మకాలు సరిగా లేక బంకులు మూసేయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు చెప్పాయి. ఈ నేపథ్యంలో మరిన్ని కొత్త బంకులు ఏర్పాటైతే, అమ్మకాలు పడిపోయి 70 శాతం బంకులు మూతపడే ప్రమాదం ఉందని గోపాల కృష్ణ చెప్పారు.

## నిస్సాన్ దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: దీపావళి సందర్భంగా నిస్సాన్ మోటార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పలు ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటించింది. నిస్సాన్ కార్ల కొనుగోలుపై రూ.94,000, డాట్సన్ మోడళ్లపై రూ.62,000 వరకు ప్రయోజనాలను అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ ఆఫర్ అక్టోబరు 31 వరకు అందుబాటులో ఉంటుంది.

## సీసీఐ ఉత్తర్వులపై హైకోర్టు స్టే

- జీఎంఆర్ వెల్లడి

న్యూఢిల్లీ: జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్)పై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జారీ చేసిన ఉత్తర్వులపై తెలంగాణ హైకోర్టు ఈ నెల 16న స్టే విధించిందని జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. ప్రస్తుతం ఈ అంశం విచారణలో ఉందని పేర్కొంది. కాగా ఎయిర్ వర్క్స్ ఇండియా (ఇంజనీరింగ్) ప్రైవేట్ లిమిటెడ్.. ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఐ ఈ నెల 3న దర్యాప్తునకు ఆదేశించిందని పేర్కొంది. లైన్ మెయింటెనెన్స్ కార్యకలాపాలు నిర్వహించేందుకు హైదరాబాద్ విమానాశ్రయంలో ఎయిర్‌సైడ్ స్థలాన్ని ఎయిర్‌వర్క్స్‌కు జీహెచ్ఐఏఎల్ ఇచ్చిందని తెలిపింది. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుందని వెల్లడించింది. అయితే ఈ ఒప్పందం గడువు ఈ ఏడాది మార్చి 22న ముగిసిపోయిందని తెలిపింది. ఈ అంశంపై ఎయిర్‌వర్క్స్ కోర్టును ఆశ్రయించగా ఇది విచారణలో ఉందని పేర్కొంది.

# 9 నెలల్లో రూ.1.54 లక్షల కోట్ల విక్రయాలు

### ఇళ్ల అమ్మకాల్లో 16 శాతం వృద్ధి

### హైదరాబాద్‌లో తగ్గుదల: అనరాక్

బెంగళూరు: నగరాల్లో గృహాలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. వీటి అమ్మకాలు భారీ స్థాయిలో జరుగుతున్నాయి. దేశంలో ఏడు అగ్రస్థాయి నగరాల్లో ఈ ఏడాది మొదటి మూడు త్రైమాసికాల్లో (జనవరి నుంచి సెప్టెంబరు వరకు) దాదాపు రూ.1.54 లక్షల కోట్ల విలువైన ఇళ్ల అమ్మకాలు జరిగినట్టు అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్ వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలంలో విక్రయించిన ఇళ్ల విలువ (రూ.1.33 లక్షల కోట్లు)తో పోల్చితే వృద్ధి 16 శాతంగా ఉందని తెలిపింది. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు ఏడు నగరాల్లో (ఎంఎంఆర్, బెంగళూరు, ఎన్‌సీఆర్, హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, పుణే) 2.02 లక్షల ఇళ్ల అమ్మకాలు జరిగాయని, గత ఏడాది ఇదే కాలంలో అమ్ముడయిన ఇళ్ల సంఖ్య 1.78 లక్షలుగా ఉందని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి తెలిపారు.

- విలువ పరంగా చూస్తే ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్) అగ్రస్థానంలో ఉంది. ఈ ఏడాదిలో ఈ రీజియన్‌లో రూ.62,970 కోట్ల విలువైన ఇళ్ల అమ్మకాలు జరిగాయి. తర్వాత బెంగళూరు (రూ.28,160 కోట్లు) ఉంది.
- ఏడాది కాలంలో ఎంఎంఆర్‌లో ఇళ్ల అమ్మకాల విలువ 33 శాతం పెరగ్గా.. బెంగళూరులో మాత్రం 7 శాతం తగ్గింది. గత ఏడాది మొదటి తొమ్మిది నెలల కాలంలో ఈ రెండు నగరాల్లో ఇళ్ల అమ్మకాల విలువ వరుసగా రూ.47,240 కోట్లు, రూ.30,310 కోట్లుగా ఉంది.



- హైదరాబాద్, చెన్నై నగరాల్లో ఈ ఏడాది వరుసగా రూ.9,400 కోట్లు, రూ.5,580 కోట్ల విలువన ఇళ్ల అమ్మకాలు జరిగాయి. హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు 2 శాతం తగ్గగా.. చెన్నైలో 13 శాతం పెరిగాయి.

#### మూడో త్రైమాసికంలో క్షీణత

మూడో త్రైమాసికం (జూలై-సెప్టెంబరు)లో ఇళ్ల అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. మంచి రోజులు లేకపోవడం, వడ్డీ రాయితీ పథకాలను నిషేధించడం, వర్షాలు వంటి అంశాలు మూడో త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలను ప్రభావితం చేశాయి. ఈ త్రైమాసికంలో ఏడు నగరాల్లో అమ్ముడైన ఇళ్ల విలువ 17 శాతం తగ్గి రూ.50,535 కోట్ల నుంచి రూ.42,040 కోట్లకు చేరుకుంది. హైదరాబాద్‌లో మూడో త్రైమాసికంలో అమ్ముడైన ఇళ్ల విలువ గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 31 శాతం తగ్గి రూ.2,350 కోట్లకు చేరుకుంది.

# వైద్య సేవల్లోకి క్షత్రియా గ్రూప్

- రూ.350 కోట్లతో ఆసుపత్రి
- 2022 నాటికి మూడో దశ పూర్తి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆతిథ్య రంగంలోని క్షత్రియా గ్రూప్ ఆరోగ్య సంరక్షణ రంగంలోకి అడుగు పెట్టింది. హైదరాబాద్‌లోని బాచుపల్లిలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించింది. ఎస్ఎల్‌జీ హాస్పిటల్ మొదటి దశ అభివృద్ధికి రూ.250 కోట్ల పెట్టుబడులు పెట్టామని, ప్రస్తుతం 550 పడకల సామర్థ్యంతో ఆసుపత్రి పని చేస్తుందని క్షత్రియా గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) దండు శివ రామరాజు తెలిపారు. శ్రీ లక్ష్మీ గాయతీ హాస్పిటల్స్ కంపెనీని ఏర్పాటు చేసి క్షత్రియా గ్రూప్ హాస్పిటల్ రంగంలోకి అడుగు పెట్టింది. రెండు, మూడు దశల్లో మరో రూ.100 కోట్ల వరకూ పెట్టుబడులు పెట్టి 1,000 పడకల ఆసుపత్రిగా దీన్ని అభివృద్ధి చేయనున్నారు. 2022 నాటికి మూడో దశ పూర్తవుతుంది. ఎయిర్ అంబులెన్స్ సేవలకు అనుగుణంగా ఈ ఆసుపత్రిపై హెలీ ప్యాడ్‌ను కూడా నిర్మించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం వసతి సౌకర్యం కోసం హాస్పిటల్ పక్కనే హోటల్‌ను కూడా నిర్మించారు. నాలుగు ఎకరాల్లో 9 లక్షల చదరపు అడుగుల్లో ఆసుపత్రిని, లక్ష చదరపు అడుగుల్లో హోటల్‌ను నిర్మించినట్లు ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు, సీఈఓ రామ్‌పాపారావు తెలిపారు. ప్రస్తుతం 42 స్పెషాలిటీ విభాగాల్లో వైద్య సేవలు అందించనున్నామని.. మూడో దశలో ఆసుపత్రిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే 80-90 ప్రత్యేక విభాగాల్లో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. 140 మంది డాక్టర్లు సహా ప్రస్తుతం 420 మంది ఉద్యోగులు ఉన్నారని.. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిన తర్వాత ఉద్యోగుల సంఖ్య 1,500 మందికి చేరుతుందన్నారు. నర్సింగ్, హోటల్ మేనేజిమెంట్ కాలేజీలను, హెల్త్ క్లబ్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. అర మెగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ప్రాజెక్టు ద్వారా ఆసుపత్రికి విద్యుత్ లభిస్తుంది. 1:2 నిష్పత్తిలో ఈక్విటీ, రుణాల ద్వారా పెట్టుబడులు సమకూర్చుకున్నట్లు చెప్పారు.

#### 23న ఫారం గేటు అమ్మకం ధరలు

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.40 నెక్ (100 గుడ్లు)



| | |
|---|---|
| హైదరాబాద్ | 380 |
| బెంగళూరు | 395 |
| విజయవాడ | 375 |
| గోదావరి | 375 |
| నమక్కల్ | 410 |

24వ తేదీకి..

| | |
|---|---|
| విశాఖపట్నం | 385 |
| వరంగల్ | 383 |
| చెన్నై | 430 |
| చిత్తూరు | 423 |
| ముంబై | 435 |

#### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 79 | విజయవాడ | 80 |
| వరంగల్ | 79 | గుంటూరు | 81 |
| మహబూబ్‌నగర్ | 79 | ఒంగోలు | 82 |
| కరీంనగర్ | 79 | చిత్తూరు | 87 |
| కర్నూలు | 79 | నెల్లూరు | 87 |
| విశాఖపట్నం | 68 | అనంతపురం | 88 |
| గోదావరి | 74 | | |

#### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,310 | 38,450 | 39,650 | 38,400 | 38,320 |
| క్రితం ముగింపు | 38,370 | 38,400 | 39,510 | 38,350 | 38,170 |
| 22 క్యారెట్లు | 36,500 | 35,650 | 36,470 | 35,580 | 36,670 |
| క్రితం ముగింపు | 36,520 | 35,600 | 36,340 | 35,570 | 36,520 |
| వెండి (కిలో) | 45,400 | 47,000 | 46,800 | 46,700 | 49,100 |
| క్రితం ముగింపు | 45,500 | 46,800 | 46,800 | 46,800 | 49,300 |

# హెచ్‌సీఎల్ డబుల్ ధమాకా

- 1:1 బోనస్ షేర్లు.. రూ.2 డివిడెండ్
- రెండో త్రైమాసిక లాభం రూ.2,711 కోట్లు

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి రూ.2,711 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన నికర లాభం (రూ.2,534 కోట్లు)తో పోల్చితే వృద్ధి 6.9 శాతంగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ రాబడి 18 శాతం వృద్ధి చెంది రూ.14,860 కోట్ల నుంచి రూ.17,527 కోట్లకు చేరింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి రాబడిలో వృద్ధికి సంబంధించిన ఔట్‌లుక్‌ను 15-17 శాతానికి కంపెనీ పెంచింది. ఇంతకు ముందు అంచనా 14-16 శాతంగా ఉంది. లాభాలు వృద్ధి చెందిన నేపథ్యంలో కంపెనీ బోర్డు ఒక్కో షేరుకు రూ.2 డివిడెండ్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. బోనస్ షేరు ఆఫర్‌ను కూడా ప్రకటించడం విశేషం. ఈ మేరకు ఒక షేరు కలిగిన వారికి మరో షేరు బోనస్‌గా ఇస్తారు. ఈ ప్రతిపాదనకు వాటాదారులు, రెగ్యులేటరీ పరమైన అనుమతులు రావాల్సి ఉంటుంది.

- హెచ్‌సీఎల్ మరోసారి అద్భుతమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించిందని, గత ఆరు నెలల కాలంలో ధరలు, వ్యయాలకు సంబంధించి తాము చేపట్టిన చర్యలు మంచి ఫలితాలను ఇచ్చాయని కంపెనీ ప్రెసిడెంట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీ విజయకుమార్ తెలిపారు. హెచ్‌సీఎల్ సాఫ్ట్‌వేర్ వ్యాపారంలో పురోగతి ఆకర్షణీయంగా ఉందన్నారు.




- సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ స్థూలంగా 13,430 మంది, నికరంగా 3,223 మందిని నియమించుకుంది. మొత్తంగా సెప్టెంబరు చివరినాటికి కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 1,47,123కి చేరుకుంది.
- బుధవారం బీఎస్ఈలో హెచ్‌సీఎల్ టెక్ షేరు 2.93 శాతం వృద్ధితో రూ.1,095.65 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ముగిసిన తర్వాత కంపెనీ ఆర్థిక ఫలితాలు వెలువడ్డాయి.

## హీరోకు ఎదురుగాలి

### 10 శాతం తగ్గిన లాభం

దేశంలో అతిపెద్ద టూవీలర్ల తయారీ కంపెనీ అయిన హీరో మోటోకార్ప్ సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి రూ.883.78 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన నికర లాభం (రూ.981.99 కోట్లు)తో పోల్చితే 10 శాతం క్షీణత నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ రాబడి 16.44 శాతం క్షీణించి రూ.9,168.24 కోట్ల నుంచి రూ.7,660.60 కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ 16,91,420 వాహనాలను విక్రయించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే అమ్మకాలు 20.7 శాతం తగ్గాయి.

## ఎల్ అండ్ టీకి ఆర్డర్ల దన్ను

- లాభంలో 13 శాతం వృద్ధి

మెరుగైన ఆర్డర్ల నేపథ్యంలో లార్సన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీ) సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికానికి రూ.35,924.89 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.2,527.26 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.31,086.59 కోట్ల ఆదాయంపై రూ.2,230.49 కోట్ల లాభాన్ని కంపెనీ ఆర్జించింది. లాభంలో 13 శాతం వృద్ధి నమోదైంది. గ్రూప్ స్థాయిలో కంపెనీ రూ.48,292 కోట్ల విలువైన ఆర్డర్లను ఈ త్రైమాసికంలో పొందింది.

## ఇండియన్ బ్యాంక్ లాభం రెండింతలు

చెన్నై: ఇండియన్ బ్యాంక్ నికర లాభం సెప్టెంబరుతో పూర్తయిన రెండో త్రైమాసికంలో 258.56 శాతం వృద్ధి చెంది రూ.358.56 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంకు రూ.150.14 కోట్ల లాభా న్ని ఆర్జించింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.5,129.16 కోట్ల నుంచి రూ.6,045 కోట్లకు చేరుకుంది. సెప్టెంబరుతో ముగిసిన ఆరు నెలల కాలానికి లాభం రూ.359.45 కోట్ల నుంచి రూ.723.83 కోట్ల కు పెరిగినట్టు బ్యాంకు ఎండీ,, సీఈఓ పద్మజా చుండూరు తెలిపారు.

## ఇండ్‌ఇన్‌ఫ్రావిట్ చేతికి హైదరాబాద్-యాదాద్రి టోల్‌వే

- సద్భావ్ ఇన్‌ఫ్రా నుంచి కొనుగోలు

న్యూఢిల్లీ : ఇండ్‌ఇన్‌ఫ్రావిట్‌కు ఏడు రహదారి ప్రాజెక్టుల్లో వాటాలను బదలాయించేందుకు అనుమతులు లభించినట్లు సద్భావ్ ఇంజనీరింగ్ వెల్లడించింది. ఈ మేరకు అనుబంధ సంస్థ సద్భావ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ లిమిటెడ్ (ఎస్ఐపీఎల్) నిర్వహణలోని ఆరు ప్రాజెక్టులకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నుంచి అనుమతి లభించగా ఒక ప్రాజెక్ట్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిందని తెలిపింది. ఈ ఏడు ప్రాజెక్టుల్లో వంద శాతం వాటాలను ఇండ్‌ఇన్‌ఫ్రావిట్‌కు విక్రయించేందుకు ఈ ఏడాది జూలైలో సద్భావ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టుల ఎంటర్‌ప్రైజ్ విలువ రూ.660 కోట్లుగా ఉంది. సద్భావ్ విక్రయించిన స్పెషల్ పర్పస్ (ఎస్‌పీవీ) రహదారి ప్రాజెక్టుల్లో హైదరాబాద్ యాదగిరి టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్, నాగ్‌పూర్ సియోనీ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్, ధూలే పలేస్నర్ టోల్‌వే లిమిటెడ్, శ్రీనత్జి-ఉదయ్‌పూర్ టోల్‌వే, భిల్వారా-రాజాసమంద్ టోల్‌వే, బీజాపూర్-హుంగుద్ టోల్‌వే, ఔరంగాబాద్ జల్నా టోల్‌వే ఉన్నాయి. కాగా మరో రెండు ప్రాజెక్టులకు ఎన్‌హెచ్ఏఐ నుంచి అనుమతులు లభించాల్సి ఉందని సద్భావ్ ఇంజనీరింగ్ తెలిపింది.

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 94.99 ↑ | 15.75 ↑ | 116 ↑ | 55 ↓ | 3 పైసలు ↑ | ↓ |
| 39,058.83 | 11,604.10 | 38,341 ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) | 45,535 | 70.91 | 59.66 |

# ఇన్ఫీపై సెబీ దర్యాప్తు షురూ

## ప్రజావేగు ఆరోపణలపై ఆరా

### నిబంధనల ఉల్లంఘన, ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందా అనే కోణంలోనూ విచారణ



న్యూఢిల్లీ: షేర్ల ధరలను ప్రభావితం చేసే కీలక సమాచారాన్ని ఇన్ఫోసిస్ యాజమాన్యం ముందే వెల్లడించలేదన్న ఆరోపణలపై 'సెబీ' దర్యాప్తు మొదలుపెట్టింది. ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్, సీఎఫ్ఓ నీలాంజన్ రాయ్‌పై కొందరు ఉద్యోగుల బృందం తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో కంపెనీలో కార్పొరేట్ పాలనా ప్రమాణాల ఉల్లంఘనేమైనా జరిగిందా అన్న కోణంలోనూ దర్యాప్తు ప్రారంభించింది. అంతేకాదు, కంపెనీ షేర్ల లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందా అని కూడా ఆరా తీస్తోంది. ఇన్ఫీ షేర్ల ట్రేడింగ్ డేటాతో పాటు డెరివేటివ్ పొజిషన్స్‌ను పరీక్షించాలని ఇప్పటికే స్టాక్ ఎక్స్ఛేంజీలను ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అలాగే, కంపెనీ పెద్దలపై వచ్చిన ఆరోపణలను బయటికి వెల్లడించకపోవడంపై వివరణ కోరింది. కంపెనీ టాప్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఇతరులకు నియంత్రణ మండలి త్వరలో సమన్లు కూడా జారీ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దర్యాప్తులో భాగంగా ముున్ముందు ఇన్ఫీలో ఆడిట్, ఫైనాన్స్‌తో పలు వ్యవహారాలను పర్యవేక్షించే బోర్డు కమిటీల నుంచి సమాచారం కోరే అవకాశం ఉంది. విజిల్ బ్లోయర్ ఫిర్యాదు అందిన వెంటనే మార్కెట్లకు సమాచారం అందివ్వకపోవడంతో పాటు తగిన చర్యలు కూడా చేపట్టలేదని కూడా దర్యాప్తులో తేలితే, కంపెనీ స్వతంత్ర డైరెక్టర్ల పాత్రను కూడా సెబీ ప్రశ్నించవచ్చు.

#### స్వల్పంగా కోలుకున్న షేరు

కంపెనీ సారథిపై ఆరోపణల నేపథ్యంలో భారీగా పతనమైన ఇన్ఫీ షేరు తిరిగి స్వల్పంగా కోలుకుంది. బుధవారం బీఎస్ఈలో ట్రేడింగ్ ముగిసేసరికి 1.16 శాతం పెరిగి రూ.650.75 వద్దకు చేరుకుంది. ఎన్ఎస్ఈలో 1 శాతం లాభంతో రూ.650.35 వద్ద స్థిరపడింది. మంగళవారం నాడు కంపెనీ షేరు ఏకంగా 17 శాతం క్షీణించింది. దాంతో ఒక్క రోజులోనే రూ.53,451 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయింది.

#### భారీగా పెరిగిన డెరివేటివ్ పొజిషన్లు

ఇన్ఫీ పెద్దలపై ఆరోపణలు బయటికి పొక్కక ముందు ఇన్ఫోసిస్ షేర్లలో డెరివేటివ్ పొజిషన్లు భారీగా పెరగడమే కాకుండా నవంబరు సిరీస్ 'పుట్' ఆప్షన్ పొజిషన్లు భారీగా పోగైనట్లు తెలుస్తోంది.



#### ఎందుకు వెల్లడించలేదు: బీఎస్ఈ

కంపెనీ సీఈఓ, సీఎఫ్ఓపై వచ్చిన తీవ్ర ఆరోపణల గురించి మార్కెట్లకు ముందే ఎందుకు వెల్లడించలేదని ఇన్ఫోసిస్‌ను బీఎస్ఈ వివరణ కోరింది. కంపెనీకి ప్రజావేగు ఫిర్యాదు అందినట్లు ఈనెల 22న ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నీలేకని స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించారు. "ప్రజావేగు ఫిర్యాదు అందిందని మాత్రమే ఇన్ఫోసిస్ సమాచారం ఇచ్చింది. కానీ, సెబీ చట్టం-2015లో లిస్టింగ్ నిబంధన 30 ప్రకారంగా ఏ విషయాన్నీ వెల్లడించలేద"ని బీఎస్ఈ పేర్కొంది. ఈ విషయమై కంపెనీని వివరణ కోరడం జరిగిందని, స్పందన కోసం వేచిచూస్తున్నట్లు తెలిపింది.

#### సెప్టెంబరులోనే బోర్డు దృష్టికి

ఇన్ఫోసిస్ సీఈఓ, సీఎఫ్ఓపై వచ్చిన ఆరోపణల గురించి కంపెనీ బోర్డుకు ముందే తెలుసు. ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నీలేకని ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. కంపెనీకి చెందిన బోర్డు సభ్యుడొకరికి గత నెల 30న రెండు ఫిర్యాదులు అందాయని ఆయన చెప్పారు. కలత చెందిస్తున్న అనైతిక చర్యలు పేరుతో గత నెల 20వ తేదీన రాసినట్లుగా ఉన్న ఒక లేఖతోపాటు ప్రజావేగు ఫిర్యాదు అనే పేరుతో రాసిన తేదీ లేకుండా మరో ఫిర్యాదు అందిందన్నారు. ఈ నెల 10వ తేదీన ఆ రెండింటినీ ఆడిట్ కమిటీకి అందజేయడం జరిగిందని మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించారు. స్వల్పకాలికంగా కంపెనీ ఆదాయ, లాభాలు పెంచేందుకు సీఈఓ, సీఎఫ్ఓ అనైతిక అకౌంటింగ్ చర్యలకు పాల్పడ్డారంటూ ఇన్ఫోసిస్‌కు చెందిన కొందరు ఉద్యోగులు బోర్డుకు లేఖ రాశారు. గత రెండు త్రైమాసికాల్లో మేనేజ్‌మెంట్ ఉద్దేశపూర్వకంగా అకౌంటింగ్ అవకతవకలకు పాల్పడిందని లేఖలో పేర్కొంది.

#### ఇన్ఫీపై గతంలో వచ్చిన ఫిర్యాదులివి..

**2011** భారత్ నుంచి అమెరికాకు చౌకగా నిపుణులను రప్పించుకునేందుకు కంపెనీ స్వల్పకాలిక విజిటర్ వీసాలను దుర్వినియోగపర్చిందని జాక్ పామర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

**2014** వీసాల దుర్వినియోగంపై ఫిర్యాదు చేసినందుకు కంపెనీ తనపై వివక్ష ప్రదర్శిస్తోందని ఆరోపించిన పామర్.. ఇందుకు పరిహారం కోరుతూ కోర్టులో దావా కూడా వేశారు.

**2017** ఇజ్రాయెల్‌కు చెందిన టెక్ స్టార్టప్ 'పనయా' కొనుగోలు డీల్‌తో పాటు మాజీ సీఎఫ్ఓ రాజీవ్ బన్సల్‌కు సెవెరెన్స్ పే చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని గుర్తు తెలియని వ్యక్తి సెబీకి లేఖ రాశారు.

**2018** క్లెయిమ్‌ల విడుదల కోసం ఇన్ఫోసిస్‌కు, మాజీ బోర్డు సభ్యులు ఆర్ శేషసాయి, జెఫ్రీ లెహ్మన్, జాన్ ఎట్చెమెండి మధ్య కుదిరిన అంగీకారంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఓ వ్యక్తి సెబీకి లేఖ పంపారు.

## 11550 దిగువన బలహీనం

**టెక్ వ్యూ**

నిఫ్టీ ప్రారంభంలో బలహీనతను కొనసాగిస్తూ 11550 దిగువకు వెళ్లి రికవరీ కనబరిచింది. అనంతరం 11650 స్థాయిలను తాకి రియాక్షన్‌ను చవిచూసింది. చివరకు డే కనిష్ఠ స్థాయిలో క్లోజయి అనిశ్చిత ట్రెండ్‌ను సూచించింది. తదుపరి స్వల్పకాలిక కన్సాలిడేషన్ లేదా రియాక్షన్ దిశగా సాగే అవకాశం ఉంది. కొద్ది రోజులుగా 11700 స్థాయిల వద్ద కరెక్షన్‌ను ఎదుర్కొంటోంది. మొత్తంగా ట్రెండ్ మాత్రం సానుకూలంగా ఉంది.

**గురువారం స్థాయిలివే...**

**నిరోధం : 11640 మద్దతు : 11550**

- అప్‌ట్రెండ్ కోసం 11640 వద్ద నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇది బుధవారం ఏర్పడిన మైనర్ గరిష్ఠ స్థాయి
- తదుపరి ప్రధాన నిరోధం 11700. ఇక్కడ బ్రేకౌట్ సాధిస్తే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది
- ఒకవేళ బలహీనతను కనబరిస్తే 11550 దిగువన మద్దతు స్థాయిలు ఉంటాయి
- ఈ స్థాయిల వద్ద కూడా నిలదొక్కుకోలేకపోతే స్వల్పకాలిక కరెక్షన్‌ను సూచిస్తుంది.

■ వి.సుందర్ రాజా

## ముగింపు సెషన్ బెటర్

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** ఆశ్వయుజ కృష్ణ ఏకాదశి
**నక్షత్రం-అప్రమత్తం :** మఖ/పుబ్బ; రోహిణి, హస్త, శ్రవణ/మృగశిర, చిత్ర, ధనిష్ఠ నక్షత్ర జాతకులు, కన్య,మకర రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**నిఫ్టీ : 11604.10 (+15.75)**

**ట్రెండ్ మార్పు వేళలు : మధ్యాహ్నం 1.16**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 1.15 వరకు అదే ధోరణిలో సాగుతూ 3.15 తర్వాత మళ్లీ బెటర్‌గా మారే అవకాశం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.15 సమయానికి క్లోజ్ చేసుకోవచ్చు. 1.30 తర్వాత ఎటిపి కన్నా ఎగువకు వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 11645, 11680**

**మద్దతు స్థాయిలు : 11565, 11530**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

## ఇక హెచ్‌పీసీఎల్, పవర్ గ్రిడ్ 'మహా నవరత్న' కంపెనీలు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని హెచ్‌పీసీఎల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌ల స్థాయి మరింత పెరిగింది. ఈ రెండు కంపెనీలకు 'మహా నవరత్న' కంపెనీలుగా గుర్తిస్తూ ప్రభు త్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆర్థిక, నిర్వహణపరమైన అంశాల్లో ఈ రెండు కంపెనీల డైరెక్టర్ల బోర్డులకు మరింత స్వేచ్ఛ లభించనుంది. ఈ హోదాతో ఈ రెండు పీఎస్‌యూలు రూ.5,000 కోట్ల పరిమితికి లోబడి వాటి నికర ఆస్తుల విలువలో 15 శాతం మించకుండా దేశ, విదేశాల్లో కంపెనీల్లో ఈక్విటీ పెట్టుబడులు పెట్టవచ్చు. లేదా జాయింట్ వెంచర్ కంపెనీలు ఏర్పాటు చేయవచ్చు.

## అమెరికాలో రానిటిడైన్ టాబ్లెట్లు వెనక్కి: డాక్టర్ రెడ్డీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాలో విక్రయించిన రానిటిడైన్ టాబ్లెట్లను డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వెనక్కి రప్పించింది. రిటైల్ స్థాయిలో ఓవర్-ది -కౌంటర్ (ఓటీసీ), మందుల చీటీ ద్వారా విక్రయించిన రానిటిడైన్ ఉత్పత్తులను స్వచ్ఛందంగా వెనక్కి తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. యూఎస్ఎఫ్‌డీఏ నిర్దేశించిన స్థాయి కంటే రానిటిడైన్ టాబ్లెట్లలో నైట్రోసోడిమిథైలామిన్ (ఎన్‌డీఎంఏ) మలినాలు ఎక్కువగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకుంది. కొన్ని రానిటిడైన్ శాంపిళ్లలో ఎన్‌డీఎంఏను కనుగొన్నట్లు రోగులకు, ఆరోగ్య సంరక్షణ నిపుణులకు ఎఫ్‌డీఏ హెచ్చరిక నోట్‌ను జారీ చేయడంతో డాక్టర్ రెడ్డీస్ ఆ ఔషధాన్ని దేశవ్యాప్తంగా వెనక్కి రప్పించింది.. కేన్సర్‌కు కారకం కావడానికి అవకాశమున్న హ్యూమన్ కార్సినోజెన్‌గా ఎన్‌డీఎంఏను వర్గీకరించారు. కడుపులో ఆహారం అరగక వచ్చే గుండె వద్ద నొప్పి, డ్యుయోడెనల్ అల్సర్ చికిత్సకు రానిటిడైన్ ఔషధాన్ని వాడతారు.

## బతుకుదెరువు కోసం..

(మొదటి పేజీ తరువాయి)

నమ్మశక్యం కాదు. ఎల్లారెడ్డి ప్రాంతంలో చోటు చేసు కున్న రాజకీయ పరిస్థితుల కారణంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ ప్రాంతం తెలంగాణ స్వరాష్ట్రంలో రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పడింది. రానున్న రోజుల్లో నగర పంచాయితీగా ఏర్పడింది. కానీ ఈ ప్రాంత అభివృద్ధి మాత్రం మారలేదు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఇక్కడ యువతకోసం పరిశ్రమలు స్థాపిం చాలని, నియోజకవర్గంలో వైద్యం, విద్య, రవాణా అంశాలకు అధిక ప్రాధాన్యం కల్పించాలి. స్థానికులకు వివిధ రంగాలలో ఉపాధి అవకాశాలను కల్పించాలని స్థానికు లు కోరుతున్నారు.

### ఉపాధి అవకాశాలు లేక వలస బాట పడుతున్నారు

ఎల్లారెడ్డి ప్రాంతంలోని రైతులు గతంలో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవించేవారు. ఈ ప్రాంతంలో గతంలో చక్కె ర ఫ్యాక్టరీలు అధికంగా ఉండడంతో ఎక్కువ శాతం మంది చెరుకుతో పాటు వరి పంటలను సాగుచేస్తూ సుఖ వంతమైన జీవితాన్ని గడిపారు. కాలం మారుతున్న కొద్ది వీరి జీవితాలలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. క్రమేన చక్కెర ఫ్యాక్టరీలు మూతపడడం, వర్షాభావ పరి స్థితులు ఏర్పడడం, ఎలాంటి ఉపాధి కల్పన లేకపోవడంతో ప్రజలు వలస బాట పట్టారు. గ్రామాల్లో పంటలు పండించే వారు. ఈపంటలపై వచ్చే ఆధాయంపైనే జీవిం చేవారు. వర్షాలు కురిసిన పంటలు పండించలేని దుస్థితి లో తమ ఉపాధితో పాటు పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బతుకు దెరువుకోసం పట్టణాలకు వలస లు వెళ్లడం ప్రారంభించారు. యువత సైతం ఇదే పని చేస్తున్నారు. ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ చేయగానే కుటుంబాలతో పాటు వీరు కూడా హైదరాబాద్‌కు వెళ్లి కంపెనీలలో రోజుకి 12 గంటల డ్యూటీ చేసుకుంటూ కుటుంబాలకు ఆసరవుతున్నారు. ఊళ్లో ఉండకుండా వలసలు వెళుతున్నారేమని ప్రశ్నిస్తే.. ఊళ్లో ఏముంది బతకాలంటే డబ్బు కావాలి కదా.. డబ్బు సంపాదించాలంటే ఏ కూలీ పనోచేసుకోవాలి. ఊళ్లో ఉంటే ఏమొస్తది. పట్నం పోతే పది రాళ్లు వెనకేసుకొని, పూట గడుపుకో వాలంటూ ఊళ్లకు ఊళ్లే చాలా వరకు బతుకుదెరువు కోసం వె ళుతున్నామని చెబుతున్నారు. ఇళ్లల్లో వృద్ధులు ఉంటున్నారు కదా.. మరి వారిపరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తే ప్రభుత్వం ఇచ్చే పింఛన్ తీసుకొని ఇళ్లకు కాపలాగా ఉంటారు అని బదులిస్తున్నారు.

## ఆర్టిజన్లకు వేతన స్థిరీకరణ

### 22వేల మందికి లబ్ధి..జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లోని ఆర్టిజన్లకు ఇచ్చిన హామీ మేరకు వేతనాన్ని స్థిరీకరిస్తూ ఇప్పటికే ట్రాన్స్‌కో ఉత్తర్వులివ్వగా...బుధవారం జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లు కూడా ఆదేశాలిచ్చాయి. ఇప్పటిదాకా గౌరవవేతనం చెల్లిస్తున్న యాజమాన్యాలు...ఇకనుంచి స్థిరీకరించిన వేతనాలు ఇవ్వనున్నాయి. తాజా నిర్ణయంతో వేతనాల పెరుగుదలలో మార్పులేనప్పటికీ రానున్న వేతన సవరణ(పీఆర్సీ)లోనే వీరికి మేలు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇక రెగ్యులర్ ఉద్యోగులకు ఎంత మేర వేతనం పెంచనున్నారో... అంతే మొత్తాన్ని ఆర్టిజన్లకు కూడా పెంచనున్నారు. నాలుగు విద్యుత్ సంస్థల్లో 22 వేల మంది దాకా ఉన్న ఆర్టిజన్లకు పే ఫిక్సేషన్‌లో డీఏ, హెచ్‌ఆర్‌ఏ, సీసీఏ, మెడికల్ అలవెన్సు, కార్పొరేట్ అలవెన్సు, కన్వేయన్స్ అలవెన్సులను పొందుపరిచారు.

### కోర్టు సిబ్బంది పోస్టులకు 4 నుంచి ఆన్‌లైన్ పరీక్షలు

హైదరాబాదు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో సిబ్బంది నియామకానికి నవంబర్ 4 నుంచి 7 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ డి.నాగార్జున ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను హైకోర్టు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అభ్యర్థులకు ఆయన సూచించారు.

## అమ్మభాషకు కష్టకాలం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శిస్తూ.. తెలుగు భాషకు దూరమవుతున్నారు. ప్రాథమిక స్థాయిలో మాతృ భాషలో చదువుతోనే విద్యార్థులు మానసిక వికాసం పొందే అవకాశం ఉందని తెలిసీ.. దానిని విస్మరిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే తెలుగు మీడియంను కాదని.. ఇంగ్లిషు మీడియంలో చదివేందుకే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో తెలుగు మీడియం తిరోగమన దిశలో పయనిస్తోంది. తెలుగు మీడియం విద్యాసంస్థలు ఏటేటా తగ్గిపోతూ.. ఇంగ్లిషు మీడియం విద్యాసంస్థలు పెరిగిపోతున్నాయి. పాఠశాల స్థాయి మొదలుకొని.. డిగ్రీ వరకు 65 శాతానికి పైగా విద్యార్థులు ఇంగ్లిషు మీడియంలోనే చేరుతున్నారు. తెలుగు మీడియంలో చదువుతున్న విద్యార్థులు 25 శాతంలోపే ఉంటున్నారు. మున్ముందు ఈ సంఖ్య కూడా పూర్తిగా తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే తెలుగు మీడియం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**అంతా ఇంగ్లిషు మయం..**

రాష్ట్రంలోని పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 58.36 లక్షల మంది విద్యార్థులు ఉండగా.. వీరిలో 38.87 లక్షల మంది ఇంగ్లిషు మీడియంలోనే ఉన్నారు. తెలుగు మీడియంలో కేవలం 17.93 లక్షల మంది మాత్రమే ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో కన్నా ప్రైవేటు పాఠశాలల్లోనే ఇంగ్లిషు ఎక్కువగా ఉంది. ఇక ఇంటర్మీడియట్‌లో గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 9.42 లక్షల మంది అడ్మిషన్ పొందగా.. వీరిలో 6.47 లక్షల మంది ఇంగ్లిషు మీడియంలోనే చేరారు. కేవలం 1.98 లక్షల మంది మాత్రమే తెలుగు మీడియం ఎంచుకున్నారు. డిగ్రీలో రాష్ట్ర వ్యాప్తంగా అడ్మిషన్ పొందిన 2.22 లక్షల మంది విద్యార్థుల్లో తెలుగు మీడియంలో చేరినవారు 30,763 మంది మాత్రమే. ప్రపంచీకరణతోపాటు సమాజంలో వస్తున్న నూతన పోకడలకు ఇంగ్లిషు చదువులు అనివార్యం కావడంతో ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని ఇంగ్లిషు మీడియంలో చేర్పించేందుకే ఆసక్తి చూపిస్తున్నారు. నిరుడు రాష్ట్ర వ్యాప్తంగా ఒకటో తరగతిలో మొత్తం 6.55లక్షల మంది విద్యార్థులు ప్రవేశం పొందగా.. వీరిలో 4.69లక్షల మంది ఇంగ్లిషు మీడియంలోనే చేరారు. కేవలం 1.64 లక్షల మంది మాత్రమే తెలుగు మీడియంలో చేరారు. అంటే మొత్తం విద్యార్థుల్లో 71.70% మంది ఇంగ్లిషు మీడియంలో, కేవలం 25.13% మంది మాత్రమే తెలుగు మీడియంలో ప్రవేశం పొందడం గమనార్హం. అయితే ఈ పరిణామంతో మాతృభాష కనుమరుగయ్యే ప్రమాదం ఉందని భాషావేత్తలు, విద్యావేత్తలు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తెలుగు కనుమరుగు కావడానికి మరెంతో సమయం పట్టదని వారు అభిప్రాయపడుతున్నారు. ఇంగ్లిషు మీడియం చదువులను ప్రోత్సహిస్తూనే తెలుగు భాషను బతికించుకు నే ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందంటున్నారు.




**ఇవీ లెక్కలు..**

| తరగతి | మొత్తం విద్యార్థులు | ఇంగ్లిషు మీడియం(శాతం) | తెలుగు మీడియం(శాతం) |
|---|---|---|---|
| స్కూల్ | 5836310 | 3867619 (66.26) | 1793959 (30.73) |
| ఇంటర్ | 942719 | 647222 (68.65) | 198411 (21.04) |
| డిగ్రీ | 222708 | 190325 (85.00) | 30763 (13.81) |
| ఒకటో తరగతి | 655436 | 469978 (71.70) | 164736 (25.13) |

## తెలంగాణ మంత్రుల ఆత్మద్రోహం!




వేదికపై అభివాదం చేస్తున్న వామపక్ష, విప్లవ పార్టీల, ప్రజాసంఘాల నేతలు

- కేసీఆర్, జగన్‌లది నియంతృత్వం
- 'లెఫ్ట్', ప్రజాసంఘాల సభలో నారాయణ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాలను స్ఫూర్తిగా తీసుకొన్న తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ నియంతృత్వ పోకడలకు పోతున్నారని సీపీఐ సీనియర్ నేత నారాయణ విమర్శించారు. కేటీఆర్ సహా మంత్రులెవరికీ మాట్లాడే స్వేచ్ఛ లేదనీ, వారంతా ప్రగతిభవన్‌కు గబ్బిలాల్లా వేలాడుతూ ఆత్మద్రోహం చేసుకొని పదవులు అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. బుధవారం ఇక్కడ వామపక్ష, విప్లవ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' నినాదంతో సభ జరిగింది. ఆర్టీసీని లాకౌట్ చేయాలని చూస్తే, ప్రజలు కేసీఆర్‌ను లాకౌట్ చేస్తారని నారాయణ హెచ్చరించారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, 'అరుణోదయ' విమలక్క, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, సామాజికవేత్త హరగోపాల్, పలు సంఘాల నేతలు ప్రసంగించారు. తమతో విభేదించేవారిపై సర్కారు అక్రమ కేసులు పెట్టడాన్ని తప్పుబట్టారు.

### జైలు నుంచి వరవరరావు సందేశం...

మహారాష్ట్రలో జైల్లో ఖైదీగా ఉన్న విప్లవ కవి వరవరరావు ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఆయన పంపిన లేఖను సభలో నిర్వాహకుడు కాశీం చదివారు. "న్యాయమైన ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల సాధన కోసం కార్మిక సంఘాలు, పార్టీలు, వివిధ ప్రజాసంఘాలు మద్దతు పలికి పోరాటంలో పాల్గొంటున్నాయి. కార్మికుల పోరాటం విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని వరవరరావు పేర్కొన్నారు.

## కేసీఆర్‌పై నజర్!

(మొదటి పేజీ తరువాయి)

వస్తున్న అవినీతి ఆరోపణలను సైతం శోధించి నిజాలను ప్రజల ముందుంచేందుకు బీజేపీ సమాయత్తమవుతోంది. తొలి ఐదేళ్లలో అవినీతికి తావులేకుండా పాలించామని చెప్పుకుంటున్నప్పటికీ వివిధ పథకాలు, ప్రాజెక్టుల్లో భారీగానే అవినీతి జరిగిందనీ, ఇందుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని బీజేపీ సిద్ధం చేసుకుందనీ విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బయటకు కనిపించేవే కాకుండా లోపాయికారీగా చాలానే జరిగాయనీ, వాటన్నింటి వివరాలూ ఉన్నాయని ఆ వర్గాలు వివరించాయి. వీటి ఆధారంగా ఏం చేయాలన్న విషయంపై ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు ఆ వర్గాలు వివరించాయి. లక్ష్యం కేసీఆరే అయినా.. టీఆర్ఎస్ ప్రభుత్వం మొత్తాన్ని టార్గెట్ చేయాలన్నది బీజేపీ నిర్ణయం. సర్కారు తీసుకున్న, తీసుకుంటున్న 'ప్రజా-వ్యతిరేక' చర్యలు, వివిధాంశాలపై అనుసరిస్తున్న వైఖరి మీద కేంద్ర హోంమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో పార్టీ రాష్ట్ర నేతలు పలు దఫాలు చర్చలు జరిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై న్యాయస్థానాలు, దర్యాప్తు సంస్థలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంటుందని వీరు అభిప్రాయపడ్డారు. వచ్చే ఆరునెలలూ కీలకంగా మారబోతున్నాయని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ నిర్వాకాలను అన్ని రీతుల్లో హైలైట్ చేయాలని- అంటే అటు కోర్టులు, దర్యాప్తు సంస్థలను కూడా రంగంలోకి దించాలని వీరు భావిస్తున్నట్లు సమాచారం. అధికారంలో ఉన్న ఈ ఆరు సంవత్సరాల్లో కేసీఆర్ పరిపాలన ఇంతగా ఎన్నడూ అప్రతిష్టపాలు కాలేదని, బలహీనంగానే ఉన్న సమయంలోనే ఆయనను రాజకీయంగా దెబ్బతీయాలని అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ మధ్య ఢిల్లీ వెళ్లి ప్రధానితో సమావేశమైన సమయంలో రాజీయత్నాలు జరిగాయని, కానీ అవేవీ నెరవేరలేదని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

తెలంగాణాలో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీని పటుతరంగా మార్చేందుకు ఈ కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని బీజేపీ నిశ్చయించినట్లు తెలిసింది. ఇప్పటికే కాంగ్రెస్ బలహీనపడిందని, టీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తా తమకు మాత్రమే ఉందని ప్రజల్లోకి తీసికెళ్లాలని కమలనాథులు భావిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి-రహిత, నిర్ణయాత్మక పాలనను ప్రజల్లో ప్రచారం చేస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరకుండా కేసీఆర్ ప్రభుత్వం ఎలా అడ్డుపడుతోందో వివరిస్తూ ధాటిగా ముందుకెళ్లాలని బీజేపీ నిర్ణయించింది. కేసీఆర్ సర్కార్ పనితీరు, వివిధ వర్గాల నుంచి వస్తున్న ఫిర్యాదుల గురించి గవర్నర్ తమిళిసై ఇప్పటికే కేంద్రానికి నివేదిక సమర్పించగా, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి, పార్టీ ఎంపీలు ధర్మపురి అరవింద్, బండి సంజయ్ జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు అమిత్ షాకు నివేదిస్తున్నారు. త్వరలో కేసీఆర్ సర్కార్ అంతర్గత సంక్షోభంలో పడే అవకాశాలు కూడా ఉన్నాయని బీజేపీ సీనియర్ నాయకుడొకరు చెప్పారు.

కాగా హుజూర్ నగర్ ఎన్నికల ఫలితాలకూ, బీజేపీ కార్యాచరణకూ ఏ సంబంధమూ లేదని, ఈ ఎన్నికల్లో ధన ప్రవాహం, అక్రమ మార్గాలు, ప్రభుత్వ యంత్రాంగ దుర్వినియోగం... మొదలైన వాటి ద్వారా పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు కేసీఆర్ చేసిన ప్రయత్నాల గురించి తమకు సమాచారం ఉన్నదని పార్టీ వర్గాలు తెలిపాయి.

# కొల్లూరు టౌన్‌షిప్ దేశానికే నమూనా

- పది రాష్ట్రాల ప్రతినిధులు మెచ్చారు
- మార్చి నాటికి పేదలకు డబుల్ ఇల్లు
- మునిసిపల్ మంత్రి కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్ సిటీ/రామచంద్రాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరులో పేదల కోసం నిర్మిస్తున్న రెండు పడకల ఇళ్లు దేశానికే నమూనా అవుతాయని, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పురపాలక మంత్రి కె.తారకరామారావు అన్నారు. 15 వేలకుపైగా ఇళ్లు నిర్మిస్తున్న ఈ టౌన్‌షిప్‌ను పూర్తిస్థాయి మౌలిక వసతులతో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ఇంత భారీ ఎత్తున దేశంలో ఎక్కడా పేదల కోసం రెండు పడకల ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని అన్నారు. ఇప్పటికే పది రాష్ట్రాల నుంచి ప్రతినిధులు ఈ ఇళ్లను సందర్శించి అభినందించారని తెలిపారు. నిర్మాణం పూర్తయ్యాక దేశం మొత్తం కచ్చితంగా కొల్లూరు టౌన్‌షిప్ నమూనాను అధ్యయనం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్, ఉన్నతాధికారులతో కలిసి ఆయన బుధవారం కొల్లూరులో ఇళ్ల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అనంతరం అక్కడే సమీక్షా సమావేశం నిర్వహించారు. 117 బ్లాకుల్లో 9 అంతస్తులతో 15,560 ఇళ్లను నిర్మిస్తున్నామని, ఇప్పటికే 12,000 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలిపారు. ఇళ్లలోకి వచ్చిన కుటుంబాలకు ఒక ఆదర్శ పట్టణంలో ఉన్నామన్న భావన కలిగేలా వసతులు ఉండాలని కేటీఆర్ ఆదేశించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్మార్ట్ సిటీల్లో ఉండే వసతులు ఇక్కడ ఉండాలని సూచించారు.



కొల్లూరులో రెండు పడకల ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్, హైదరాబాద్ మేయర్ రామ్మోహన్, ఉన్నతాధికారులు

## షీ టీమ్స్ పనితీరు భేష్

- హోంమంత్రి, డీజీపీ, కమిషనర్లకు కేటీఆర్ అభినందనలు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన షీ టీమ్స్ పనితీరు అద్భుతంగా ఉందని మంత్రి కేటీఆర్ కొనియాడారు. షీ టీమ్స్ ఏర్పడి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ట్విటర్‌లో హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్ రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లకు అభినందనలు తెలిపారు. 2014, అక్టోబరు 24న హైదరాబాద్‌లో ఏర్పాటైన షీ టీమ్స్ ద్వారా ఐదేళ్లలో 33,700 కేసులను పరిష్కరించారన్నారు. దశల వారిగా రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు షీ టీమ్స్ విస్తరించాయని చెప్పారు. మహిళల హక్కులపై కూడా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

## వ్యాధులపై మ్యాపింగ్ చేయండి

- దాని ఆధారంగానే చికిత్సలు: ఈటల

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఎలాంటి వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయో మ్యాపింగ్ చేయాలని అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆదేశించారు. దాని ఆధారంగా ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు అందించేందుకు రూట్‌మ్యాప్ తయారు చేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కార్యాలయంలో జాతీయ ఆరోగ్య మిషన్‌పై మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా పంచాయతీ, మునిసిపల్ శాఖలతో సమన్వయం చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు వృథా చేయకుండా ఖర్చు చేయాలన్నారు. 108, 104, 102 వాహనాలు కండీషన్‌లో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా, పాలియేటివ్ కేర్ సెంటర్లలో కేన్సర్ రోగులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని ఇండియన్ అంకాలజీ సొసైటీ అధ్యక్షుడు దినేష్ పండల్కర్ అన్నారు. జనగామలోని పాలియేటివ్ కేర్ సెంటర్‌ను సందర్శించిన తర్వాత మంత్రి ఈటలతో ఆయన భేటీ అయ్యారు.



మంత్రి ఈటలను కలిసిన ఇండియన్ అంకాలజీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ దినేష్ పండల్కర్



గవర్నర్ తమిళిసైని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి నిరంజన్‌రెడ్డి

## జిన్నింగ్ మిల్లులకు బకాయిలు చెల్లిస్తాం

- సీజన్‌లో పత్తి రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- మిల్లర్లతో భేటీలో మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్‌తో మాట్లాడి జిన్నింగ్ మిల్లులకు పాత బకాయిలు ఇప్పించేందుకు కృషి చేస్తానని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం నవంబరు 1 నుంచి బంద్ పాటిస్తామని మిల్లర్లు ఇటీవల ప్రకటించారు. 2019-20 సంవత్సరానికి సీసీఐతో అగ్రిమెంట్ కూడా చేసుకోకుండా మొండికేశారు. ఈ అంశంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో మంత్రి స్పందించారు. జిన్నింగ్ మిల్లుల రాష్ట్ర అసోసియేషన్‌తో బుధవారం భేటీ అయ్యారు. జిన్నింగ్ మిల్లులు బంద్ పాటిస్తే, ఆ ప్రభావం పత్తి రైతులపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీసీఐతోనూ తక్షణమే అగ్రిమెంట్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తేమ విషయంలో కూడా ఉదాసీనంగా వ్యవహరించి రైతులకు న్యాయం చేయాలని మిల్లర్లను కోరారు. కాగా, పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, ధాన్యం కొనుగోళ్లు జరిగినన్ని రోజులు సిబ్బందికి సెలవులు ఇవ్వొద్దని సూచించారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను మంత్రి నిరంజన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

### రైతు ఆత్మహత్యాయత్నం.. సర్ది చెప్పిన మంత్రి నిరంజన్

బోయినపల్లి: కమీషన్ ఏజెంట్లు, హమాలీల వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామంటూ బోయినపల్లి మార్కెట్ యార్డులో బుధవారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఓ రైతు కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించాడు. అక్కడే సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి.. వారంలోగా నివేదిక తెప్పించుకుని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది.

## వంటేరుకు కార్పొరేషన్ గిరీ

- తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించిన సీఎం
- హుజూర్‌నగర్ ఫలితానికి ముందే పదవుల భర్తీకి శ్రీకారం
- దీపావళికి ముందే ఉద్యోగులకూ శుభవార్త?

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో గెలుపుపై ధీమాగా ఉన్న సీఎం కేసీఆర్.. ఫలితం వెల్లడవకముందే పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడం ప్రారంభించారు. నామినేటెడ్ పదవుల భర్తీకి శ్రీకారం చుట్టారు. గజ్వేల్‌కు చెందిన సీనియర్ నాయకుడు వంటేరు ప్రతాప్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతాప్‌రెడ్డి ప్రగతి భవన్‌లో సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు. వంటేరు నియామకంతో టీఆర్ఎస్ నేతల్లో మళ్లీ 'నామినేటెడ్' ఆశలు చిగురిస్తున్నాయి. మధుసూదనాచారి, జూపల్లి, నాయిని, కడియం, పద్మాదేవేందర్‌రెడ్డి, మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఉన్నత పదవులు ఇస్తామని, మరో 12 మంది ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ పదవులిస్తామని సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. వీరితో పాటు ఆర్.సత్యనారాయణ, చింతా ప్రభాకర్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పిడమర్తి రవి, చిరుమల్ల రాకేశ్, ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, దేవీప్రసాదరావు, సామేలు, ఈద శంకర్‌రెడ్డి, ఎల్.కిషన్‌రావు, కన్నెబోయిన రాజయ్యయాదవ్, రంగారెడ్డి, గుండు సుధారాణి వంటి నేతలూ 'నామినేటెడ్' రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు హుజూర్‌నగర్ ఫలితం వెల్లడయ్యాక ఉద్యోగుల జేఏసీ నేతలతో భేటీ అవుతానని కేసీఆర్ హామీ ఇచ్చారు. దీంతో సీఎం తమకు తీపి కబురు చెబుతారని ఉద్యోగులు ఆశిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏల విడుదల లేదా ఫిట్‌మెంట్, పదవీ విరమణ వయసును 61 ఏళ్లకు పెంచడంపై దీపావళి కంటే ముందే నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.

# మునిసిపోల్స్ వచ్చే నెల్లో!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘానికి సమాచారం అందించనున్నారు. హైకోర్టు నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడం, ముఖ్యమంత్రి కూడా అధికారులను ఆదేశించడంతో ఇక మునిసిపల్ ఎన్నికల వేడి రాజుకోనుంది. అధికారులు రిజర్వేషన్ల ఖరారుపై దృష్టి సారించారు. వారం రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని చెబుతున్నారు.

### నవంబరు మొదటి వారంలో

మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్‌లను త్వరలోనే ఖరారు చేయనున్నారు. మేయర్/చైర్మన్ పదవులను రాష్ట్రం యూనిట్‌గా, కౌన్సిలర్/కార్పొరేటర్ పదవులను మునిసిపాలిటీ యూనిట్‌గా ఖరారు చేస్తారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి మొత్తం రిజర్వేషన్లను యాభై శాతానికి పరిమితం చేస్తారు. మునిసిపల్ ఆర్డినెన్స్‌లోనూ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఎస్టీ, ఎస్సీలకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. 50 శాతంలో ఎస్టీ, ఎస్సీలకు పోను మిగిలిన స్థానాలను బీసీలకు కేటాయిస్తారు. అన్ని కేటగిరిలలోనూ మహిళలకు సగం స్థానాలను కేటాయిస్తారు. ఎన్నికలు ఒకేసారి జరిపినా, రెండు విడతలుగా జరిపినా, రిజర్వేషన్లు మాత్రం ఒకేసారి ఖరారు కానున్నాయి. రాష్ట్రం యూనిట్‌గా పరిగణించనున్నందున అన్నింటికీ ఒకేసారి రిజర్వేషన్లు ఖరారు చేయడం అనివార్యమవుతోంది. రాష్ట్రం లో 13 కార్పొరేషన్‌లు, 128 మునిసిపాలిటీలకు వేరువేరుగా రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. రిజర్వేషన్ల ప్రక్రియ వారంలోపే పూర్తి చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి.

### నేడే ఎన్నికల సంఘం సమావేశం?

తాము ఎన్నికలకు సిద్ధంగా ఉన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లనుంది. ఈ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఎప్పటి నుంచో సిద్ధమై ఉంది. లాంఛనంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమాచారం అందగానే గురువారమే ఈసీ సమావేశం కానున్నట్లు తెలిసింది. వాస్తవానికి మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల సంఘం గతంలోనే ప్రారంభించింది. వార్డుల విభజన, ఎస్టీ, ఎస్సీ, బీసీ ఓటర్ల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు దాదాపు పూర్తయింది. ఎన్నికల సిబ్బందిని కూడా గుర్తించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ చాలా వరకు పూర్తయింది. అంతా సిద్ధంగా ఉండటంతో ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించేందుకు ఈసీకి ఎలాంటి ఇబ్బందులూ లేవు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైతే నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన రోజు నుంచి 15 రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. ఉదాహరణకు నామినేషన్ల స్వీకరణ 1న ప్రారంభమైతే ఎన్నికలు 15న జరుగుతాయి. రాష్ట్రంలో మొత్తం 13 కార్పొరేషన్లు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల పదవీకాలం ముగియనందున మిగిలిన పదింటికి ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 128 మునిసిపాలిటీలకు గాను 120 చోట్ల ఎన్నికలు జరుగుతాయి.

## మళ్లీ మునిసి'పోల్స్' వేడి!

- మునిసిపోల్స్‌కు పార్టీలు సన్నద్ధం
- స్వీప్ చేయాలని టీఆర్ఎస్ ఉత్సాహం
- సగం సీట్లపై కాంగ్రెస్ కన్ను
- సత్తా చాటేందుకు బీజేపీ వ్యూహం

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పురపాలక ఎన్నికల వాతవరణం మళ్లీ వచ్చేసింది. ప్రధాన పార్టీలు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నాయి. జిల్లా పరిషత్ ఎన్నికల ఫలితాలను పునరావృతం చేయాలని టీఆర్ఎస్ భావిస్తోంది. అన్ని జడ్పీలను కైవసం చేసుకున్న అధికార పార్టీ.. ఆ ఫలితాలనే మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలని యోచిస్తోంది. ఇప్పటికే మునిసిపాలిటీల వారీగా అభ్యర్థుల ఎంపికపై టీఆర్ఎస్ దాదాపు కసరత్తు పూర్తి చేసింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా మునిసిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. టీఆర్ఎస్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకోవాలని పార్టీ నేతలు నిర్ణయించారు. మునిపాలిటీలు, కార్పొరేషన్లలో సగాని కి పైగా కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ పని చేస్తోంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణ కార్యాచరణలో వేగం పెంచిన బీజేపీ నేతలు.. తమ సత్తా చాటుకునేందుకు మునిసిపల్ ఎన్నికలు మంచి అవకాశంగా భావిస్తున్నారు. జిల్లాలవారీగా సమావేశాలూ నిర్వహించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, గత ఐదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎన్నికల్లో సత్తా చాటాలన్న లక్ష్యంతో పని చేస్తున్నారు. ఇదిలా ఉంటే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇతర పార్టీలతో అవగాహన కుదుర్చుకుంటూ ఉనికి చాటుకునే ప్రయత్నాల్లో వామపక్షాలు ఉన్నాయి. మరోవైపు అన్ని మునిసిపాలిటీల్లో పోటీ చేయాలంటూ టీడీపీ నేతలకు ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఇప్పటికే సూచించారు.



మంత్రి గంగుల కమలాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న కృష్ణయ్య, నాయకులు

## బీసీల బడ్జెట్‌ను 10వేల కోట్లకు పెంచండి

- మంత్రి గంగుల కమలాకర్‌కు కృష్ణయ్య వినతి

ఖైరతాబాద్/హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల బడ్జెట్‌ను రూ.2,920 కోట్ల నుంచి రూ.10వేల కోట్లకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య కోరారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీల అభ్యున్నతికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కృష్ణయ్య విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం 210 తీర్మానాలతో బీసీ పాలసీని రూపొందించారని, దానిని అమలు చేసేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. సీఎంతో చర్చించి బీసీల డిమాండ్లు నెరవేరుస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు జ్ఞాపికను బహూకరిస్తున్న శాసనసభ స్పీకర్ పోచారం, మండలి చైర్మన్ గుత్తా

## మైనింగ్ లేకుంటే అభివృద్ధి లేదు

**రాష్ట్ర ఆదాయం పెరిగింది: పోచారం.. ఖనిజాలకు డిమాండ్: హోంమంత్రి**

ఖైరతాబాద్/హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, దేశాభివృద్ధిలో మైనింగ్ రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని, మైనింగ్ లేకుంటే అభివృద్ధే లేదని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ 1999లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచాక మైనింగ్ శాఖ మంత్రిగా తాను ఏడాది పాటు పని చేశానని గుర్తు చేశారు. తెలంగాణ ఆవిర్భవించాక ప్రభుత్వం ప్రత్యేక ఇసుక విధానం తీసుకొచ్చి, మాఫియా గ్యాంగ్‌కు అడ్డుకట్ట వేయడంతో ఐదేళ్లలో రూ.2,383 కోట్లకు ఆదాయం పెరిగిందన్నారు. దేశంలో మైన్స్, మినరల్స్‌కు మంచి డిమాండ్ ఉందని హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. కాగా.. హైదరాబాద్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి విచ్చేసిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## సింగరేణి కార్మికులకు రేపే పీఎల్ఆర్ బోనస్

మంచిర్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు దీపావళి సందర్భంగా మరో బోనస్ అందనుంది. ఢిల్లీలో జాతీయ సంఘాలతో జరిగిన ఒప్పందం మేరకు పీఎల్ఆర్ (పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్) బోనస్‌ను ఈ నెల 25న సింగరేణి యాజమాన్యం చెల్లించనుంది. ఒక్కో కార్మికుడికి రూ.64,700 చొప్పున మొత్తం రూ.282 కోట్లను కార్మికుల ఖాతాల్లో జమ చేయనున్నారు. కోల్ ఇండియాలో దసరా ముందు బోనస్ చెల్లించగా.. సింగరేణి కార్మికులకు దీపావళి ముందు చెల్లిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా బోనస్ చెల్లింపు వాయిదా పడే అవకాశం ఉందనే వార్తలు రావడంతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పైసల్లేవు.. బోనస్ ఇవ్వలేం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో దీపావళికి ముందే బోనస్‌ను చెల్లించాలని పలు సంఘాల నేతలు కోరగా.. 25న చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది.

## ఉత్తమ జిల్లా పరిషత్‌గా ఆదిలాబాద్

- పలు గ్రామాలకూ జాతీయ పురస్కారాలు



కేంద్ర మంత్రి తోమర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్

న్యూఢిల్లీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సామాజిక అభివృద్ధి, పారిశుధ్యం తదితర అంశాల్లో ఉత్తమ పనితీరు కనబర్చినందుకు 2017-18కి గాను ఆదిలాబాద్ జిల్లా పరిషత్‌కు 'దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సశక్తీకరణ్' జాతీయ పురస్కారం దక్కింది. దీంతోపాటు పలు గ్రామాలకు జాతీయ అవార్డులు దక్కాయి. మధ్య తరహా పంచాయతీ విభాగంలో పెద్దపల్లి జిల్లా మంథని, వెలగటూరు, పంచాయతీ విభాగంలో మంథని మండలం మల్లారం, సిద్దిపేట జిల్లా ఇర్కోడ్, మెదక్ జిల్లా మల్కాపూర్, నిజామాబాద్ జిల్లా నాగపూర్‌లను అవార్డు వరించింది. గ్రామ సభల ద్వారా ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసినందుకు పెద్దపల్లి జిల్లా రాఘవపూర్‌కు పురస్కారం లభించింది. జగిత్యాల జిల్లా పైడిమడుగు చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీగా ఎంపికైంది.

## ముగ్గురు కలెక్టర్లకు రెడ్‌క్రాస్ అవార్డులు

- వెంకటేశ్వర్లు, శ్వేతా మహంతి, శివలింగయ్యకు నేడు ప్రదానం





హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రక్తదాన శిబిరాలను నిర్వహించడంతో పాటు జిల్లాల్లో పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టిన జిల్లా కలెక్టర్లు, అధికారులకు గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) తెలంగాణ శాఖ అవార్డులను ప్రదానం చేయనుంది. మధ్యాహ్నం 3:30 గంటలకు రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఈ అవార్డులను అందజేయనున్నారు. భూపాలపల్లి, వనపర్తి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు వాసం వెంకటేశ్వర్లు, శ్వేతా మహంతి, సీహెచ్ శివలింగయ్య తదితరులు ఈ పురస్కారాలను అందుకోనున్నారు.

## హోం ముఖ్య కార్యదర్శిగా రవిగుప్తా



- జైళ్ల శాఖ డీజీగా రాజీవ్ త్రివేది
- రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్‌గా విశ్రాంత ఐఏఎస్ సత్యనారాయణరెడ్డి
- కేంద్ర సర్వీసుల్లోకి అకున్ సభర్వాల్
- త్వరలో సంతోష్ మెహ్రా కూడా..!
- రాష్ట్ర పోలీసు శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్లుగా ముగ్గురు ఏఎస్పీలు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు సీనియర్ ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా రవిగుప్తా, జైళ్ల శాఖ డీజీగా రాజీవ్ త్రివేది నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు డీజీపీ(టెక్నికల్ సర్వీసెస్)గా ఉన్న రవిగుప్తా హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న రాజీవ్ త్రివేది జైళ్ల శాఖ డీజీగా బదిలీ అయ్యారు. రవిగుప్తా, రాజీవ్ త్రివేది ఇద్దరూ బుధవారం కొత్త బాధ్యతలు స్వీకరించారు. హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ, సీఎస్ జోషిని రవి గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. గతంలో ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్య కార్యదర్శిగా పనిచేశారు. ఇప్పటివరకు కమిషనర్‌గా పనిచేసిన ఐపీఎస్ అధికారి అకున్ సభర్వాల్ కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. దీపావళి తర్వాత సెంట్రల్ ఇంటెలిజెన్స్‌లో బాధ్యతలు నిర్వహించనున్నట్లు సమాచారం. మొన్నటి వరకు పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా కొనసాగిన సంతోష్ మెహ్రాను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసి పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఆయన కూడా కేంద్ర సర్వీసులోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర పోలీసు శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్లుగా ఏఎస్పీలు ఆర్.గిరిధర్, బి.రాజేష్, జె.రాఘవేందర్ రెడ్డి బదిలీ అయ్యారు.



రాజీవ్ త్రివేది



సత్యనారాయణరెడ్డి



అకున్ సభర్వాల్

### ఇద్దరు ఐపీఎస్‌ల తర్వాత ఐఏఎస్!

2018 మే 3న పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సభర్వాల్ పలు సంస్కరణలు చేపట్టారు. రేషన్ కార్డులతో ఆధార్ సీడింగ్‌ను 100 శాతం పూర్తిచేయించారు. పీడీఎస్ వ్యవస్థను గాడిలో పెట్టారు. ఈ-పాస్, రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందే విధానాలను తీసుకొచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, నిబంధనల అమలులో నిక్కచ్చిగా వ్యవహరించారు. 'టీ- రేషన్ యాప్' రూపొందించారు. సభర్వాల్‌కు ముందు రెండేళ్ల పాటు ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా పనిచేశారు. వరుసగా ఇద్దరు సీనియర్ ఐపీఎస్‌ల తర్వాత విశ్రాంత ఐఏఎస్ అధికారికి ఈ శాఖ బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది.

| అధికారి | ఎక్కడ నుంచి | ఎక్కడికి |
|---|---|---|
| రవిగుప్తా | అదనపు డీజీపీ (టెక్నికల్ సర్వీసులు) | హోం ముఖ్య కార్యదర్శి |
| రాజీవ్ త్రివేది | హోం ముఖ్య కార్యదర్శి | జైళ్ల శాఖ డీజీ |
| పి.సత్యనారాయణరెడ్డి | విశ్రాంత ఐఏఎస్ | పౌరసరఫరాల కమిషనర్ |
| అకున్ సభర్వాల్ | పౌర సరఫరాల కమిషనర్ | కేంద్ర సర్వీసులకు |

## డెంగీ నివారణలో సర్కారు ఫెయిల్



హైదరాబాదు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డెంగీ నివారణా చర్యలపట్ల అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వంలోని అన్ని విభాగాలూ ఉమ్మడిగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చినా.. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదని ఆక్షేపించింది. డెంగీ నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదంటూ న్యాయవాది ఆర్.భాస్కర్ రాసిన లేఖ, డాక్టర్ ఎం.కరుణ వేసిన వ్యాజ్యంపై బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీజే రాఘవేంద్రసింగ్ చౌహాన్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. డెంగీ వంటి విషజ్వరాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, అదే మహమ్మారికి ఖమ్మం జిల్లా రెండవ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జయమ్మ మరణించిన అంశాన్ని ఎత్తిచూపింది. డెంగీ వ్యాప్తిచేసే దోమలకు ధనిక-పేద అనే భేదం ఉండదని స్పష్టం చేసింది. ఉన్నతాధికారుల కుటుంబ సభ్యులకు ఇలాంటి వ్యాధిసోకితేగానీ ఆ బాధ వారికి తెలియదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అత్యాధునిక యంత్రాలు కొనుగోలు చేసి, గుర్తించిన ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేయడంద్వారా అక్కడ దోమల సంఖ్యనుకూడా లెక్కించగలవని ఏజీ చెప్పిన వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. "డెంగీ నివారణకు దోమలను లెక్కించే యంత్రాలు ముఖ్యం కాదు. దోమలు, వాటి లార్వాను నాశనం చేసే యంత్రాలు కావాలి" అని వ్యాఖ్యానించింది. డెంగీ నివారణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గురువారం ఉదయం పదిన్నరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య, ఆరోగ్యశాఖ, పురపాలకశాఖల ముఖ్యకార్యదర్శులు, వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్, ప్రజారోగ్య శాఖ డైరెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, రాష్ట్ర అంటువ్యాధుల నిరోధక విభాగ జేడీ తదితరులు కోర్టు విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.

### పటిష్ఠ చర్యలు తీసుకున్నాం: ఏజీ

ప్రభుత్వం తరఫున ఏజీ బీఎస్ ప్రసాద్ వాదించారు. వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన అదనపు అఫిడవిట్‌ను ఆయన ధర్మాసనానికి అందించి, వాటిలోని ముఖ్యాంశాలను ఉటంకించారు. డెంగీ కేసుల సంఖ్య 1808 నుంచి 1302కు తగ్గిందన్నారు. అధునాతన పరికరాలు కొనుగోలు చేశామని, డ్రోన్లు ద్వారా దోమలు వృద్ధి చెందే కేంద్రాలను గుర్తించి అక్కడ వాటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత ఆదేశాల ప్రకారం డెంగీ నివారణకు తగిన చర్యలు చేపట్టలేదని ధర్మాసనం ఆక్షేపించింది. వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌లో పూర్తి వివరాలు లేవంది. "అన్య మనస్కంగా అఫిడవిట్ వేసినట్లు ఉంది. ఇలాంటి అఫిడవిట్ వస్తుందని మేం అనుకోలేదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. డెంగీ నివారణపై పనిచేస్తున్న అధికారులపై ధర్మాసనం మండిపడింది. 13వ శతాబ్దిలో యూరప్‌లో ప్రబలిన ప్లేగు వ్యాధి వల్ల లక్షలాది మంది ప్రజలు చనిపోయారని, అందులో ఇద్దరు పోప్‌లు కూడా ఉన్నారని కోర్టు గుర్తు చేసింది.

### పరిస్థితి చేయి దాటిపోతోంది

డెంగీ నివారణపై కోర్టు ఆదేశాలను ఉన్నతాధికారులు విస్మరించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏం చేసినా కళ్లు మూసుకుని మిన్నకుంటామని భావించవద్దని హెచ్చరించింది. కళ్ల ముందే డెంగీబారిన పడి ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే అధికారులు నివారణ చర్యలు చేపట్టకుండా 'పిల్లి మొగ్గలు' వేస్తున్నారని ఆక్షేపించింది. సెప్టెంబరులో డెంగీ కేసులు 205 ఉంటే, అక్టోబరు నాటికి అవి 409కి పెరిగాయని ఎత్తి చూపింది. 'ఫ్రైడే- డ్రై డే' అనే నినాదంతో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఏజీ కోర్టుకు తెలిపారు. ఈ నినాదంపై స్పందించిన ధర్మాసనం... గాంధీ జయంతి నాడు మద్యం అమ్మకాలు నిషేధిస్తూ 'డ్రై డే' పాటించడం తెలుసని, దోమల నివారణకు 'డ్రై డే' ఏంటో వింతగా ఉందని అభిప్రాయపడింది. ప్రాసకోసం కాకుండా ప్రజల్లోకి చొచ్చుకుపోయే విధంగా ప్రచారం ఉండాలని తెలిపింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.



చిత్రంలో కనిపిస్తున్న విద్యార్థులు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని బట్టపెల్లిపోతారం గ్రామానికి చెందినవారు. సమ్మె కారణంగా 4 కిలోమీటర్ల దూరంలో సారంగపూర్‌లోని పాఠశాలకు ప్రతీరోజు నడుచుకుంటూనే వెళ్తున్నారు. బస్సులు నడవకపోవడంతో రోజూ 8 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రగతిభవన్ ముట్టడికి యత్నించిన ఏబీవీపీ నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## ప్రగతి భవన్ ముట్టడికి ఏబీవీపీ యత్నం

- గేటు లోపలికి చొచ్చుకుని వెళ్లిన నేతలు.. అరెస్టు
- ఆందోళనలతో.. ప్రగతి భవన్ వద్ద భద్రత పెంపు

హైదరాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ/బేగంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఏబీవీపీ నేతలు బుధవారం ప్రగతి భవన్‌ను ముట్టడించేందుకు యత్నించారు. ఒక్కసారిగా ప్రగతి భవన్‌వైపు దూసుకురాగా పోలీసులు చుట్టుముట్టారు. అయినా.. ఏబీవీపీ సెంట్రల్ కమిటీ మెంబర్ ప్రవీణ్‌రెడ్డి బారికేడ్లు దాటుకుని లోపలికి దూకారు. పోలీసులు ఆయనను అడ్డుకుని అరెస్టు చేశారు. అంతకు ముందు ఉదయం నుంచే నగరంలోని పలు ప్రాంతాల్లో ఏబీవీపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కూడా ప్రగతి భవన్ ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాగా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా ప్రతి రోజూ ఎవరో ఒకరు ప్రగతి భవన్ ముట్టడికి పిలుపునిస్తుండటంతో అక్కడ భద్రతను పెంచారు. కాంగ్రెస్ పార్టీ ముట్టడికి యత్నించిన సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న ఏసీపీ నిర్లక్ష్యం వహించారనే కారణంతో ఆయనను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. సాధారణంగానే ప్రగతిభవన్ వద్ద అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. 15 అడుగుల ఎత్తు ప్రహరీ గోడ, బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు, పరిసరాల్లో ఎక్కడికక్కడ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వందలాది మంది పోలీసులను భద్రతకు వినియోగిస్తున్నారు.

## హైకోర్టును తప్పుదోవ పట్టిస్తున్న సర్కార్

- సీఎం కేసీఆర్‌ది బాధ్యతా రాహిత్యం: బీజేపీ

హైదరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమ్మెపై హైకోర్టును తప్పుదోవ పట్టించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా సీఎం కేసీఆర్ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ సమ్మెపై హైకోర్టులో ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలో పస లేదని స్పష్టమవుతోందన్నారు. ఆర్టీసీ సమ్మెపై బీజేపీ రాద్ధాంతం చేస్తోందంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. 48 వేల మంది రోడ్డు మీద పడితే వారికి మద్దతు తెలపడం తప్పా? అని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులకు నైతికంగా మద్దతుగా నిలిచిన బీజేపీని కేసీఆర్ విమర్శించడం.. ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు అన్నారు. రాష్ట్రంలో చెవిటి, గుడ్డి ప్రభుత్వం నడుస్తోందని బీజేపీ రాష్ట్ర మీడియా కన్వీనర్ సుధాకర్‌శర్మ విమర్శించారు. గ్రేటర్‌లో రెండు వారాలుగా చెత్త పేరుకుపోగా.. తరలించే వాహనాలకు డ్రైవర్లు కరువయ్యారని పేర్కొన్నారు. అధికారులపై మంత్రులు నియంత్రణ కోల్పోయారని దుయ్యబట్టారు.

## కార్మికులతో బేషరతుగా చర్చించాలి: తమ్మినేని

హైదరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మిక సంఘాలతో ప్రభుత్వం భేషరతుగా చర్చలు జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు జేఏసీతో చర్చలకు ప్రభుత్వం సిద్ధం కావడం, డిమాండ్లపై అధ్యయనానికి ఈడీలతో కమిటీ వేయడం మంచి పరిణామమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, చర్చలకు ముందస్తు షరతులు విధించడం సమస్య పరిష్కారానికి తోడ్పడదని అభిప్రాయపడ్డారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరిస్తే.. కేసీఆర్‌కు క్షీరాభిషేకం: జగ్గారెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు సూచన మేరకు ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కమిటీ వేసినందుకు సీఎం కేసీఆర్‌కు సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తే ఆయనకు పాలాభిషేకం చేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్‌లో పులిలా బతికిన కె.కేశవరావు.. టీఆర్ఎస్‌లోకి వెళ్లి పిల్లిలా బతుకుతున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో ఎవరైనా పులిలా బతకొచ్చన్నారు. సీఎల్పీలో బుధవారం జగ్గారెడ్డి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.

# మనసు రగిలి.. గుండె పగిలి

పిట్టల్లా రాలుతున్న ఆర్టీసీ సిబ్బంది

**ఆత్మహత్యలు**

శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం డిపో డ్రైవర్
సురేందర్‌గౌడ్, రాణిగంజ్-2 డిపో డ్రైవర్

**గుండెపోటు మరణాలు**

1 ఖలీల్ మియా, హెచ్‌సీయూ డిపో డ్రైవర్
2 కొమురయ్య, చెంగిచర్ల డిపో డ్రైవర్
3 లక్ష్మణ్‌గౌడ్, మియాపూర్-1 డిపో డ్రైవర్
4 గఫ్రొద్దీన్, నిజామాబాద్-2 డిపో డ్రైవర్
5 మల్లయ్య, ఏడీసీ, నల్గొండ డిపో
6 రమేష్‌గౌడ్, ముషీరాబాద్-1 డిపో డ్రైవర్
7 షేక్ ఖజామియా సత్తుపల్లి డిపో డ్రైవర్
8 హకీంపేట డిపో కండక్టర్ పద్మ భర్త రఘు
9 నర్సంపేట డిపో కండక్టర్ రణధీర్ భార్య
10 సంగారెడ్డి డిపో కండక్టర్ నాగమణి భర్త

**ప్రభుత్వమే భరోసా ఇవ్వాలి: నిపుణులు**

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం నుంచే భరోసా లభించాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. సమస్యల పరిష్కారాన్ని పక్కన పెడితే... కార్మికులను రెచ్చగొట్టేలా, ఒత్తిడికి గురయ్యేలా ప్రకటనలు, వ్యాఖ్యలు ఉండకుండా ప్రభుత్వం జాగ్రత్త పడాలని చెబుతున్నారు. మంత్రులు కూడా ఏది పడితే అది మాట్లాడకుండా అదుపు చేయాలని అభిప్రాయపడుతున్నారు. 48 వేల మంది సమ్మెను సులభంగా తీసుకోకూడదని, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచిస్తున్నారు.

### ఇప్పటికే ఇద్దరు డ్రైవర్ల ఆత్మహత్య.. ఏడుగురు గుండెపోటుతో మృతి

- కుటుంబ సభ్యులూ మృత్యువాత
- పెరుగుతున్న మానసిక ఆందోళన, ఒత్తిడి
- సెప్టెంబరు వేతనాలు రాక ఆర్థిక సమస్యలు
- పిల్లల ఫీజులు, ఇంటి అద్దెలు కట్టలేక సతమతం





హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామానికి చెందిన సిద్దగోని రమేశ్ గౌడ్ ముషీరాబాద్-1 డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 18 రోజులుగా జరుగుతున్న సమ్మెలో చురుగ్గా పాల్గొంటున్నాడు. సెప్టెంబరు నెల వేతనం అందకపోవడంతో ఆయన కుటుంబం ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటోంది. దీంతో రెండు మూడు రోజులుగా రమేశ్ తీవ్ర ఆందోళన, ఒత్తిడికి గురవుతున్నాడు. సమ్మెపై ప్రభుత్వం పెద్దగా స్పందించకపోవడం.. వేతనం అందకపోవడంతో బుధవారం మానసికంగా మరింత కుంగిపోవడంతో గుండెపోటుతో మృతి చెందాడు. ఇది ఒక్క రమేశ్ పరిస్థితి మాత్రమే కాదు. ఆర్టీసీ సమ్మెలో పాల్గొంటున్న 48 వేల మంది కార్మికుల గోస! ఇన్నాళ్లుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మా గోసను పట్టించుకోదా? అంటూ ఆవేదన, ఆగ్రహంతో వారి మనసు రగిలిపోతోంది! సమ్మెలో భాగంగా పైకి బిగ్గరగా నినాదలు చేస్తున్నప్పటికీ వారి మనసులో ఎన్నో ప్రశ్నలు! ఈ సమ్మెకు ఎప్పుడు ఫుల్‌స్టాప్ పడుతుంది? సమస్యకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుంది? పరిస్థితి ఇట్లాగే ఉంటే మా బతుకులు ఎట్లా? అని మథనపడుతున్నారు. బీపీ, హైపర్‌టెన్షన్, షుగర్ వంటి సమస్యలు ఉన్నవారైతే ఆరోగ్య సమస్యలతో సొమ్మసిల్లి పడిపోతున్నారు. అక్కడి నుంచి ఏ రాత్రికో ఇంటికి వెళ్లిన తర్వాత కూడా వారికి అదే మానసిక ఆందోళన, ఒత్తిడి తప్పడం లేదు. సెప్టెంబరు నెల వేతనం అందక కార్మికుల కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు పెరిగిపోయాయి. పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి అద్దెలు, పాలు, టీవీ, పేపర్ బిల్లులు చెల్లించలేక సతమతమవుతున్నారు. దీంతో మానసికంగా కుంగిపోతూ గుండెపోటుతో మరణిస్తున్నారు. సమ్మె మొదలైన 18 రోజుల్లో రాష్ట్రంలో ఇద్దరు డ్రైవర్లు ఆత్మహత్య చేసుకోగా, ఏడుగురు సిబ్బంది గుండెపోటుకు గురై మృత్యువాత పడ్డారు. కుటుంబ సభ్యులూ మానసిక ఒత్తిడికి లోనై చనిపోతున్నారు.



రమేశ్(ఫైల్)

## గుండెపోటుతో మరో డ్రైవర్ మృతి

- ముషీరాబాద్ డిపో 1లో ఉద్రిక్తత

రాంనగర్/హైదరాబాద్/యాచారం/భద్రాచలం, అక్టోబరు 23: సమ్మెపై ప్రభుత్వ వైఖరితో మనస్తాపం చెందిన డ్రైవర్ గుండెపోటుతో చనిపోయారు. రంగారెడ్డి జిల్లా మాల్ గ్రామానికి చెందిన సిద్ధగోని రమేశ్(40) ముషీరాబాద్ డిపో 1లో పనిచేస్తున్నారు. రమేశ్‌కు సోమవారం సాయంత్రం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మంగళవారం రాత్రి చనిపోయారు. దీంతో డిపో వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. పని ఒత్తిడితో భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ బుధవారం తెల్లవారుజామున స్పృహ కోల్పోయారు.

## డిపోలో మెకానిక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- తాత్కాలిక డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం

బోధన్, అక్టోబరు 23: ఆర్టీసీలో తాత్కాలిక డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ప్రతిరోజు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా బోధన్ ఆర్టీసీ డిపోలో మెకానిక్ వసీంను బుధవారం ఓ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తాత్కాలిక డ్రైవర్ లక్ష్మణ్.. బస్సును డిపోలోకి తీసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.



జనగామ బస్టాండ్‌లో చదువుకుంటూ నిరసన తెలుపుతున్న మోడల్‌స్కూల్ విద్యార్థులు

## మా గోడు వినండి

- ప్రజాప్రతినిధులకు కార్మికుల వినతులు
- 19వ రోజూ ఉధృతంగా సాగిన సమ్మె

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్టు సడలకుండా సాగుతోంది. 19వ రోజైన బుధవారం కార్మికులు ఉదయాన్నే డిపోల వద్దకు చేరుకొని బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులను కలిసి సమ్మెకు సహకరించాలని వినతి పత్రాలు అందజేశారు. బస్సుల్లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. కొన్ని చోట్ల కళ్లకు గంతలు కట్టుకొని, మరికొన్ని చోట్ల అర్ధనగ్న ప్రదర్శనలు చేశారు. మహబూబాబాద్‌లో ఆర్టీసీ కార్మికులు ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో ములాఖత్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ జేఏసీ నాయకులు కొందరు కాంగ్రెస్, బీజేపీ నేతలకు అమ్ముడుపోయారని ఎమ్మెల్యే అనడంతో కార్మికులు ఆయనకు, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జగిత్యాలలో కార్మికులు వినూత్న వేషధారణతో నిరసన తెలిపారు. కార్మికులను సీఎం ఇబ్బందులకు గురి చేస్తున్నట్లుగా ప్రదర్శన ఇచ్చారు. మంచిర్యాలలో డిపో ఎదుట నిర్మాణంలో ఉన్న భవనంలో ఆర్టీసీ కార్మికులు దీక్ష శిబిరాన్ని నడుపుతుండగా.. పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆత్మబలిదానం చేసిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరెడ్డి దశదిన కర్మ సందర్భంగా ఖమ్మంలో కార్మికులు, నాయకులు నివాళులర్పించారు. జహీరాబాద్‌లో ఆందోళనలో మహిళా కండక్టర్ సొమ్మసిల్లి పడిపోయింది.

## ఒక్క డిమాండూ వదులుకోం

- విలీన డిమాండ్‌ను వెనక్కి తీసుకున్నామని నిరూపిస్తే ఉరిశిక్షకైనా సిద్ధం
- కోర్టుకు అబద్ధాలు నివేదిస్తున్న కేసీఆర్
- జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి
- రాష్ట్రంలో ఇద్దరు సీఎంలు : వీహెచ్



ధూంధాంలో మాట్లాడుతున్న అశ్వత్థామరెడ్డి

చాదర్‌ఘాట్/హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల 26 డిమాండ్లలో ఒక్కటీ వదులుకునే ప్రసక్తే లేదని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి స్పష్టం చేశారు. ఆర్టీసీ సమ్మెలో భాగంగా బుధవారం దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్‌లో జరిగిన బహిరంగ సభ, ధూంధాంలో ఆయన మాట్లాడారు. ఓవైపు ఆర్టీసీ కార్మికుల 21 డిమాండ్లపై కమిటీ అంటూనే.. మరోవైపు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం డిమాండ్‌ను కార్మికులే పక్కన పెట్టారని కోర్టుకు కేసీఆర్ అబద్ధాలు చెప్పించడం సరికాదన్నారు. కోర్టులో తాము ఏమి తెలిపామో ఇప్పటికీ రికార్డులో ఉందన్నారు. విలీనం డిమాండ్‌ను వెనక్కి తీసుకున్నట్లు నిరూపిస్తే ఉరిశిక్షకైనా సిద్ధమని అన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీ కాకుండా సర్కారే కార్మికులతో చర్చలు జరపాలని కోరారు. హుజూర్‌నగర్‌లో పద్మావతి గెలిచినా, సైదిరెడ్డి గెలిచినా తమ బతుకులు తమవేనని స్పష్టం చేశారు. సచివాలయానికి రాని సీఎం కేసీఆర్‌ను అందరి కంటే ముందు డిస్మిస్ చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంత్‌రావు అన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఇద్దరు సీఎంలు ఉన్నారని, తెలంగాణ సీఎం కేసీఆర్ అయితే ఓల్డ్ సిటీ సీఎం ఎంపీ అసదుద్దీన్ అని విమర్శించారు. రిటైరైతే పెన్షన్ వస్తుందనే ఆశతో ఆర్టీసీ కార్మికులు సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బ్రిటీషు పాలన, నిజాం పాలనను తలపించేలా కేసీఆర్ పాలన సాగుతోందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. యూనియన్లు లేని ఆర్టీసీ కావాలన్న కేసీఆర్ వ్యాఖ్యలను తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ ఖండించారు. హరితా హోటల్‌లో పనిచేసే వాళ్లలో కొందరు సీఎం ఇంట్లో పనిచేస్తున్నారని, వాళ్లకు కూడా యూనియన్ ఉందని సీఎం తెలుసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి హితవుపలికారు.

### సమ్మెపై మంత్రులు నోరు విప్పాలి: టీఎంయూ నేత థామస్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 23: సమ్మెపై మంత్రులు నోరు విప్పాలని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ థామస్‌రెడ్డి అన్నారు. మంత్రులు ఈటల రాజేందర్, కేటీఆర్, హరీశ్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ సమ్మెపై సీఎంతో మాట్లాడి, పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బుధవారం కరీంనగర్ బస్టాండ్‌లో కార్మికులు చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. సకల జనుల సమ్మె సందర్భంగా కరీంనగర్‌లో తమతో మాట్లాడిన ఈటల ఇప్పుడెక్కడ ఉన్నారని, రాజీనామా చేసి బయటకొస్తే ప్రజలే 'బీ' ఫారం ఇచ్చి గెలిపించుకుంటారని చెప్పారు.

# ఒక్క ఫలితం.. ఎందరికో జవాబు!

### టీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు గెలుపు అనివార్యం.. గౌరవప్రదమైన ఓట్లపై బీజేపీ, టీడీపీ నమ్మకం

**హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు నేడే**

**మధ్యాహ్నం 2గంటల కల్లా తుది ఫలితం**

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 'ఒక్క ఫలితం! ఎన్నింటికో సమాధానం!!' హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికపై రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయమిది. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణం నేపథ్యంలో హుజూర్‌నగర్ ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇక్కడ కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ తదితర పార్టీలు పోటీకి దిగినా.. కాంగ్రెస్, టీఆర్ఎస్ మధ్యనే పోరు నువ్వా నేనా అన్నట్లు సాగింది. కాంగ్రెస్ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి పద్మావతి పోటీ చేయగా, టీఆర్ఎస్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన శానంపూడి సైదిరెడ్డి మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బీజేపీ నుంచి డాక్టర్ కె.రామారావు, టీడీపీ నుంచి చావా కిరణ్మయి పోటీ చేశారు. ఇక్కడ ఈ నెల 21న పోలింగ్ జరగగా.. గురువారం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కాగా ఉప ఎన్నిక నోటిఫికేషన్ వెలువడిన సెప్టెంబరు 23 నాటికి రాజకీయ వేడి సాధారణంగానే ఉన్నా.. ఈ నెల 5 అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెతో ఒక్కసారిగా వేడెక్కింది. టీఆర్ఎస్ మినహా మిగిలిన రాజకీయ పక్షాలు, సబ్బండ సంఘాలన్నీ కార్మికులవైపు నిలవడంతో ఆ ప్రభావం సహజంగానే హుజూర్‌నగర్ ఉప ఎన్నికపై పడింది. అయినా, గెలుస్తామనే ధీమాతో టీఆర్ఎస్ ఉంది. తమ ప్రభుత్వం గడిచిన ఆరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ అభ్యర్థిని గెలిపిస్తాయనే భరోసాతో ఆ పార్టీ నేతలున్నారు.



కౌంటింగ్ కోసం గోదాములో ఏర్పాటు చేసిన టేబుళ్లు

**గెలుపు అందుకే ముఖ్యం..**

"హుజూర్‌నగర్‌లో మేం గెలుపొందడం వల్ల కాంగ్రెస్‌ను పూర్తిగా దెబ్బతీసినట్లవుతుంది. ఇటీవల ఎగిరెగిరిపడుతున్న బీజేపీకి ఇక్కడ డిపాజిట్ కూడా దక్కకపోతే.. ఆ పార్టీ విస్తరణ ప్రయత్నాలకు గండి పడుతుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలది బలుపు కాదు.. వాపు అని నిరూపించినట్లవుతుంది. ఆర్టీసీ కార్మికుల సమ్మె సహా ఇతర అంశాలపై సీఎం కేసీఆర్ వైఖరికి ప్రజల ఆమోదం లభించినట్లవుతుంది. విపక్షాలు, మమ్మల్ని వ్యతిరేకించే శక్తుల నోటికి తాళం పడుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లోపు జరిగే ఏ ఎన్నికల్లోనైనా మాకు తిరుగుండదు" అని టీఆర్ఎస్ ముఖ్యుడొకరు విశ్లేషించారు. ఈ కారణాలతోనే హుజూర్‌నగర్‌లో గెలుపును చాలా బలంగా కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. మరోవైపు.. హుజూర్‌నగర్‌లో గెలవకపోతే రాజకీయ కష్టాలు తమను మరింతగా చుట్టుముడతాయనే భావనతో కాంగ్రెస్ పార్టీ ముఖ్యులు ఉన్నారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ఖాళీ చేసిన సీట్లో ఆయన సతీమణి ఓటమి పాలైతే, వ్యక్తిగతంగా ఆయనకే కాకుండా పార్టీకీ తలవంపు అవుతుందని చెబుతున్నారు. ఇక్కడ గెలిస్తేనే టీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రత్యామ్నాయమనే తమ వాదనకు బలం చేకూరుతుందని, లేకపోతే, ఆ స్థానాన్ని తామే చేజేతులా బీజేపీకి ఇచ్చినట్లవుతుందని అంటున్నారు. ఇక, తెలంగాణలో అధికార పీఠాన్ని దక్కించుకోవాలనే సంకల్పంతో ఇటీవల దూకుడు పెంచిన బీజేపీకి హుజూర్‌నగర్ ఉప ఎన్నిక అగ్ని పరీక్షగా మారింది. ఇక్కడ ఆ పార్టీకి గెలిచే సత్తా లేకపోయినా.. గౌరవప్రదమైన ఓట్లయినా సాధిస్తుందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. ఇక తెలంగాణలో తుడిచిపెట్టుకు పోయిందనుకుంటున్న టీడీపీ ఈ ఉప ఎన్నిక ద్వారా ఉనికి చాటుకోవాలని తపిస్తోంది.

### ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభం

సూర్యాపేట (కలెక్టరేట్): హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఫలితం మరికొద్ది గంటల్లో తేలనుంది. ఓట్ల లెక్కింపు గురువారం చేపట్టనున్నారు. సూర్యాపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాములో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ ఓట్లను లెక్కించిన అనంతరం ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కిస్తారు. మధ్యాహ్నం 2గంటల వరకు పూర్తి ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్ డి.అమయ్‌కుమార్, ఎస్పీ ఆర్.భాస్కరన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

## దొంగ సర్వేలను నమ్మొద్దు

- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌దే గెలుపు: ఉత్తమ్

హుజూర్‌నగర్, అక్టోబరు 23: హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో గెలుపు కాంగ్రెస్‌దేనని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రజలు దొంగ సర్వేలను నమ్మవద్దన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో అభ్యర్థి పద్మావతిరెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తలు, కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణ శిబిరం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా అధికార పార్టీ అవకతవకలకు పాల్పడే అవకాశం ఉంటుందని, ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 17-సీ ఫామ్‌లో ఓట్లకు, ఈవీఎంలలో పోలైన ఓట్లకు తేడా ఉంటే వీవీ ప్యాట్లలోని ఓటర్ స్లిప్‌లను లెక్కించడానికి సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. కౌంటింగ్ పూర్తయ్యేత వరకు కార్యకర్తలు తప్పనిసరిగా ఉండాలన్నారు.

## నేటి నుంచి ఎస్సై అభ్యర్థులకు శిక్షణ

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సివిల్, ఏఆర్ తదితర విభాగాల్లో ఎస్సై పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు గురువారం నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతున్నాయి. రాజాబహదూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శిక్షణా కేంద్రం(టీఎస్‌పీఏ)లో ఈ తరగతులు నిర్వహించనున్నారు. సుమారు 710 మంది ఎస్సైలకు ఇన్‌డోర్, అవుట్‌డోర్ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఫ్యాకల్టీ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నట్లు అకాడమీ డైరెక్టర్ వీకే సింగ్ తెలిపారు.

## కార్మిక డిమాండ్ల విభజన

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారమయ్యేవి, ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో పరిష్కారమయ్యేవిగా విభజించి చర్చించారు. కండక్టర్, డ్రైవర్ల ఉద్యోగ భద్రతకు మార్గదర్శకాల రూపకల్పన, పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ట్రస్టుల విభజన, అంతర్రాష్ట్ర ఒప్పందాల ప్రకారం బస్సులను నడపడం, ప్రైవేటు వాహనాల అక్రమ రవాణాను అరికట్టడం, ఆర్టీసీ ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డులివ్వడం, ఆసరా పెన్షన్ల అందజేత, ఆరోగ్యశ్రీ సౌకర్యాన్ని కల్పించడం వంటి సమస్యలను ప్రభుత్వ పరిధిలో పరిష్కారమయ్యేవిగా గుర్తించారు. వీటిపై ప్రభుత్వమే విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని కమిటీ సూచించనుంది. ఆసరా పెన్షన్లు, ఆరోగ్యశ్రీ వంటి ఆర్థికపరమైనవి అయినందున.. వీటికి ఎంత మంది అర్హులవుతారు, ఎంత డబ్బు అవసరం తదితర వివరాలను ఆర్టీసీ అందిస్తుందని తెలిపారు. మిగతా సమస్యలను యాజమాన్యం పరిష్కరించవచ్చన్న నిర్ణయానికి కమిటీ వచ్చింది. వీటికి కొంత ఆర్థికపరమైన చిక్కులున్నప్పటికీ.. అవి అంత సీరియస్ సమస్యలు కావన్న అభిప్రాయం వ్యక్తమైంది. వీటిని యాజమాన్యానికి నివేదించాలని కమిటీ నిర్ణయించింది.

### కమిటీలో చర్చకు వచ్చిన అంశాలు

- కార్మికులకు రావాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ బకాయిలు చెల్లించాలి. యూనిఫాం బదులు సొమ్ము చెల్లించాలి.
- డబుల్ డ్యూటీలకు రెట్టింపు వేతనాలు ఇవ్వాలి.
- పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఆసరా పెన్షన్లు ఇవ్వాలి
- కండక్టర్, డ్రైవర్ల ఉద్యోగ భద్రతపై మార్గదర్శకాల రూపకల్పనకు గతంలో ఏర్పాటు చేసిన కమిటీని సమావేశపరచి, ఉద్యోగ భద్రత కల్పించాలి.
- వైద్య ఖర్చులకోసం పీఎఫ్‌సొమ్ము నుంచి రుణాలు తీసుకునే వెసులుబాటు కల్పించాలి.
- తార్నాక ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలి. తల్లిదండ్రులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందేలా చూడాలి.
- తార్నాక ఆస్పత్రితో పాటు ఇతర డిస్పెన్సరీలకు మందులను సరఫరా చేయాలి. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వైద్య బిల్లులను చెల్లించాలి.
- రిఫరల్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించాలి. తద్వారా కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందేలా చూడాలి.
- పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ట్రస్టులను విభజించాలి.
- విడిభాగాలను, పరికరాలను డిపోలకు సరఫరా చేయాలి.
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్టోర్లను ఏర్పాటు చేయాలి.
- కరీంనగర్, హైదరాబాద్ జోన్‌లకు ప్రత్యేకంగా ఈడీలను నియమించాలి.
- జాయింట్ రూట్ సర్వే ద్వారా బస్సుల వేళలను ఖరారు చేయాలి. ముఖ్యంగా సిటీ జోన్, సిటీ సబర్బన్ రూట్లలో దీన్ని చేపట్టాలి.
- గ్యారేజీ కార్మికులపై మోపుతున్న పని భారాన్ని తగ్గించి, గ్యారేజీతో సహా అన్ని విభాగాల్లో అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి.
- డిపోల్లో, డ్రైవర్లు డ్యూటీలు మారే చోట విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలి. మహిళలకు ఆరు నెలల ప్రసూతి సెలవులు కల్పించాలి.



బీసీసీఐ నూతన కార్యవర్గ సభ్యులు మాహిమ్ వర్మ, జయేష్ జార్జ్, జై షా, అరుణ్‌సింగ్‌లతో గంగూలీ

# భారత క్రికెట్ ఇక దాదా చేతుల్లో..

సంక్షోభ సమయంలో టీమిండియా సారథ్య బాధ్యతలు చేపట్టి.. విజయవంతమైన కెప్టెన్‌గా మనన్నలు అందుకొన్న సౌరవ్ గంగూలీ.. ఇంచుమించు అలాంటి పరిస్థితుల్లోనే బీసీసీఐ బాస్‌గా పగ్గాలు చేపట్టాడు. ఐపీఎల్ ఫిక్సింగ్, తదితర స్కామ్‌లతో మసకబారిన బోర్డుకు పునర్‌వైభవం తీసుకురావడమే తన లక్ష్యమంటున్నాడు. సవాళ్లకు వెరవని నైజం గల సౌరవ్.. ఇప్పుడు బోర్డు బాస్‌గా తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేస్తానంటున్నాడు. అవినీతి రహిత పాలనను అందిస్తూ.. బోర్డు విశ్వసనీయతను పెంచుతాననే హామీ ఇస్తున్నాడు.

## బీసీసీఐ ఆఫీస్ బేరర్లు

**అధ్యక్షుడు:** సౌరవ్ గంగూలీ

**కార్యదర్శి:** జై షా

31 ఏళ్ల జే షా బోర్డులోని ఆఫీస్ బేరర్లలో అతి పిన్నవయసు వ్యక్తి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడైన షాకు 2009 నుంచి గుజరాత్ క్రికెట్ సంఘంతో అనుబంధముంది. 2013లో గుజరాత్ క్రికెట్ సంఘం సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.

**కోశాధికారి:** అరుణ్‌సింగ్ ధూమాల్

బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుతం కేంద్ర సహాయమంత్రి అరుణ్ ఠాకూర్‌కు తమ్ముడైన 44 ఏళ్ల అరుణ్‌సింగ్‌కు.. 2012 నుంచి 2015 మధ్య అరుణాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘం (హెచ్‌పీసీఏ) ఉపాధ్యక్షునిగా పనిచేసిన అనుభవముంది. భారత క్రికెట్‌లో లోధా సంస్కరణల అమలుకై ఏర్పాటుచేసిన త్రిసభ్య అడ్‌హక్ కమిటీకి ఆయన నేతృత్వం కూడా వహించాడు.

**సంయుక్త కార్యదర్శి:** జయేష్ జార్జ్

కేరళ క్రికెట్ సంఘం (కేసీఏ)తో సుదీర్ఘ అనుబంధమున్న వ్యక్తి జయేష్ జార్జ్. 2005 నుంచి కేసీఏలో కీలకంగా వ్యవహరిస్తున్న 50 ఏళ్ల జయేష్.. కేసీఏకు కార్యదర్శిగా, కోశాధికారిగా, అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు.

**ఉపాధ్యక్షుడు:** మాహిమ్ వర్మ

ఉత్తరాఖండ్ క్రికెట్ సంఘం (సీఏయూ) కార్యదర్శిగా చాలా ఏళ్లు పనిచేసిన పీసీ వర్మ కుమారుడే మహిమ్ వర్మ. 45 ఏళ్ల ఇతనికి సీఏయూ సంయుక్త కార్యదర్శిగా పదేళ్లు పనిచేసిన అనుభవముంది.

### నాటి బ్లేజర్‌తోనే..

టీమిండియా కెప్టెన్‌గా బ్లూ బ్లేజర్‌ను ఎంతో గర్వంగా ధరించిన గంగూలీ.. అధ్యక్షుడిగా బాధ్యతలు అందుకొంటున్న సమయంలోనూ అదే బ్లేజర్‌ను ధరించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. 'జట్టు కెప్టెన్‌గా ఎంపికైనప్పుడు ధరించిన బ్లేజర్ ఇది. అదిప్పుడు కాస్త వదులైంది. అయినా కూడా ఆ బ్లేజర్‌ను ఈరోజు వేసుకోవాలనే నిర్ణయించుకున్నా' అని బ్లేజర్ వెనకున్న సీక్రెట్‌ను దాదా చెప్పుకొచ్చాడు.



గంగూలీ

### బీసీసీఐ 39వ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన గంగూలీ
### కొలువుదీరిన కొత్త కార్యవర్గం
### 9 నెలలు పదవిలో కొనసాగనున్న సౌరవ్

**ముంబై:** అత్యంత సంపన్నమైన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త అధ్యక్షుడిగా టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ బాధ్యతలు చేపట్టాడు. 47 ఏళ్ల గంగూలీ తొమ్మిది నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్నాడు. బుధవారం జరిగిన బీసీసీఐ సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో సౌరవ్.. 39వ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. దీంతో సుప్రీం కోర్టు నియమించిన కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీవోఏ) 33 నెలల పాలన ముగిసింది. గంగూలీ అధికారికంగా బీసీసీఐ అధ్యక్షుడయ్యాడని బీసీసీఐ ట్వీట్ చేసింది. బోర్డు అధ్యక్షుడిగా దాదా పేరు గతవారమే ఖరారైంది. ఇప్పుడు ఆ లాంఛనం ముగిసింది. నామినేషన్లకు ముందు వైరి వర్గాలు అన్నీ సౌరవ్‌కు మద్దతు పలికాయి. దీంతో అతడు ఒక్కడే నామినేషన్ దాఖలు చేశాడు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కుమారుడు జై షా కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. బోర్డులో బలమైన వర్గాలైన మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్, మాజీ కార్యదర్శి నిరంజన్ షా తదితరులను సమన్వయం చేసుకుంటూ సాగడం దాదా ముందున్న పెద్ద సవాల్. ఉత్తరాఖండ్‌కు చెందిన మాహిమ్ వర్మ ఉపాధ్యక్షుడిగా, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, కేంద్ర సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ సోదరుడు అరుణ్‌సింగ్ ధూమల్ కోశాధికారిగా, కేరళకు చెందిన జయేష్ జార్జ్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. బోర్డు ప్రధాన కార్యాలయంలో అధికారిక లాంఛనాలు పూర్తయిన తర్వాత కొత్త చీఫ్ గంగూలీకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

## ముందున్న సవాళ్లు..!

*తన తొమ్మిది నెలల పదవీ కాలంలో బీసీసీఐ అధ్యక్షుడిగా సౌరవ్ గంగూలీకి అనేక సవాళ్లు ఎదురుకానున్నాయి. వాటిల్లో కొన్ని..*

### ఐసీసీలో భారత్ పరిస్థితి

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)లో భారత్ తన గళాన్ని కోల్పోయిందనేది బహిరంగ రహస్యం. తాజాగా వర్కింగ్ గ్రూప్‌లోనూ బీసీసీఐ ప్రతినిధులకు చోటు దక్కలేదు. 'బిగ్ త్రి' రెవెన్యూ షేరింగ్ మోడల్‌ను ఐసీసీ రద్దు చేయడంతో రూ. 2వేల కోట్లపైనే భారత్ ఆదాయం కోల్పోయింది. గంగూలీ పగ్గాలు చేపట్టిన తర్వాత ఐసీసీతో సంప్రదింపులు చేసి మరింత ఆదాయం వచ్చేలా చేయాల్సి ఉంది. 2021 టీ20, 2023 వన్డే వరల్డ్‌కప్‌లను బీసీసీఐ నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతానికి బీసీసీఐ తనకు భారీషేర్ కావాలని డిమాండ్ చేసే పరిస్థితులు లేకున్నా.. దాదా మిగతా బోర్డుల మద్దతుతో ఐసీసీ మెడలు వంచాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

### ఐసీసీ ఈవెంట్లకు ట్యాక్స్ రిబేటు

ఐసీసీ ఈవెంట్లకు బ్రాడ్‌కాస్టర్లు దిగుమతి చేసుకునే అన్ని రకాల పరికరాలకు ప్రభుత్వం ట్యాక్స్ రిబేటు ఇచ్చేలా చూడాలని ఐసీసీ కోరుతోంది. ఈ విషయంలో న్యాయ, ఆర్థిక పరమైన సలహాలు గంగూలీకి ఎంతో అవసరం. ఒకవేళ పన్నులు కట్టాల్సి వస్తే ఆ మొత్తాన్ని బీసీసీఐ ఆదాయం నుంచి కోత వేస్తామని ఐసీసీ చైర్మన్ మనోహర్ ఇప్పటికే హెచ్చరించారు. కానీ, పన్ను రద్దు అనేది కేంద్రం చేతిలోని అంశం కావడంతో బీసీసీఐ ఏమీ చేయలేని పరిస్థితి. దీంతో బ్రాడ్‌కాస్టర్ అయిన స్టార్ స్పోర్ట్స్‌నే ఆ భారం భరించేలా ఒప్పించాల్సి ఉంటుంది.

### ఆటగాళ్ల జీతాలు

దేశవాళీ ఆటగాళ్ల జీతాల సమస్య ఎన్నో ఏళ్లుగా నలుగుతూనే ఉంది. ప్రస్తుతం ఫస్ట్‌క్లాస్ క్రికెటర్‌కు మ్యాచ్‌కు రూ. 1.4 లక్షలు చెల్లిస్తున్నారు. ఇలా చూస్తే ఓ మంచి ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ సీజన్‌కు రూ. 25 లక్షలు సంపాదిస్తున్నాడు. అయితే, అంతర్జాతీయ ఆటగాడితో పోల్చితే ఇది ఎంతో తక్కువ. ఈ విషయమై గంగూలీ ఎన్నో రోజులుగా ఆలోచన చేస్తున్నాడు. సాధ్యమైతే ఫస్ట్‌క్లాస్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజును రూ. 2.5 లక్షల వరకు పెంచే అవకాశం ఉంది. టీవీ హక్కుల ద్వారా వచ్చే మొత్తంలో వారి వాటాను కూడా దాదా పెంచే అవకాశం ఉంది.

### దేశవాళీ క్రికెట్ వ్యవస్థ

వన్డే టోర్నీలు తక్కువగా ఉన్నాయి. రంజీ ట్రోఫీలోనూ లోపాలున్నాయి. అంపైరింగ్ ప్రమాణాలూ దారుణంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అంపైర్లకు ప్రత్యేక శిక్షణతో ప్రమాణాలు పెంచాల్సిన అవసరం ఉంది. మంచి పిచ్‌లనే ఏర్పాటు చేసి ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌ను ప్రోత్సహించేలా దాదాపై బాధ్యత ఉంది.

### డే/నైట్ టెస్ట్ క్రికెట్

2016 దులీప్ ట్రోఫీలో పింక్ బంతితో బీసీసీఐ ప్రయోగాలు చేసింది. ఆ తర్వాత పింక్ బాల్‌పై అనేక ఫిర్యాదులు రావడంతో డే/నైట్ టోర్నీని విరమించుకుంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయస్థాయిలో డే/నైట్ టెస్టులను భారత్ ఆడలేకపోతోంది. పింక్‌బాల్ క్రికెట్‌కు మద్దతు పలికే గంగూలీ ఆ దిశగా ప్రయత్నాలు చేసే అవకాశముంది.

### విరుద్ధ ప్రయోజనాలు

పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశం బీసీసీఐకి తలనొప్పిగా మారింది. ఈ కారణంగా క్రికెట్‌కు మంచి చేయాలనుకునే వాళ్లకు విరుద్ధ అంశం అడ్డంకిగా మారిందనే అభిప్రాయం ఉంది. దాదాకి కూడా ఈ సెగ తగిలింది. ఈ విషయమై సౌరవ్ కొన్ని సడలింపులు చేసేందుకు ప్రయత్నించాల్సిన అవసరముంది.



గంగూలీని అభినందిస్తున్న అజరుద్దీన్

## ఎప్పటికీ నాయకుడే..



**టీ**మిండియా డ్రెస్సింగ్ రూమ్ నుంచి బోర్డు రూమ్‌కు గంగూలీ దర్జా ప్రయాణం గమనిస్తే.. బ్యాట్స్‌మన్‌గా ఆఫ్‌సైడ్ షాట్లతో అతడి కళాత్మక ఆటను గుర్తుకు తెస్తుంది. ఆఫ్‌సైడ్ ఏడుగురు ఫీల్డర్లు కాచుకొని ఉన్నా.. వాళ్లందరూ అవాక్కయ్యేలా సౌరవ్ ఆడే షాట్లకు ఫ్యాన్స్ ఫిదా అయ్యేవారు. బోర్డులో ఎన్నోఏళ్లుగా చక్రం తిప్పుతున్న బలమైన వర్గాల ఎత్తులను చిత్తు చేస్తూ బీసీసీఐ బాస్‌గా దాదా ఎంట్రీ కూడా అదే తరహాలో జరిగిపోయింది. రాత్రికి రాత్రే అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థిగా గంగూలీ మద్దతు సంపాదించగలిగాడు. 'ఒకప్పటి నాయకుడు.. ఎప్పటికీ నాయకుడే' అనే నానుడి దాదా విషయంలో నిజమైనట్టుంది. 2000లో ఫిక్సింగ్ స్కామ్‌తో భారత క్రికెట్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల్లో జట్టు పగ్గాలందుకున్న సౌరవ్.. టీమిండియాను బలమైన జట్టుగా తీర్చిదిద్దాడు. ప్రతిభగల యువ ఆటగాళ్లను వెతికిపట్టి వారిని సానబెట్టాడు. సవాళ్లకు వెరవని దాదా నైజం.. టీమిండియాకు దూకుడు నేర్పింది. మరోవైపు సమకాలీనులతోనూ గంగూలీ సఖ్యతగా మెలిగాడు. దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో కలసి వన్డే క్రికెట్‌లో విధ్వంసక జోడీని ఏర్పాటు చేసినా.. అంతగా అనుభవంలేని యువరాజ్ సింగ్, సెహ్వాగ్ లాంటి వారికి మద్దతుగా నిలిచినా తన లెక్క తప్పదని నిరూపించుకున్నాడు. కెప్టెన్‌గా టీమిండియాకు 21 టెస్ట్ విజయాలు అందించిన గంగూలీ.. 2003 వరల్డ్‌కప్‌లో భారత్‌ను ఫైనల్ చేర్చాడు. కెరీర్‌లో 18 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పాలనానుభవం గడించిన సౌరవ్.. బోర్డు బాస్‌గా తనదైన మార్క్‌ను చూపే అవకాశం ఉంది. టెక్నికల్ కమిటీ, క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ)ల్లో సభ్యుడిగా బోర్డు వ్యవహారాల్లో అతడికి అనుభవం ఉంది. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ స్కామ్‌తో బీసీసీఐ ప్రతిష్ఠ మసక బారింది. పిటిషన్లు, విచారణల అనంతరం బోర్డు పర్యవేక్షణకు సీఓఏను సుప్రీం కోర్టు నియమించింది. ఆ కమిటీ 33 నెలల పాలన నుంచి మళ్లీ బోర్డు పగ్గాలు అందుకున్న సౌరవ్.. 9 నెలలపాటు బీసీసీఐ అధ్యక్షుడిగా కొనసాగనున్నాడు. బోర్డు రాజ్యాంగం ప్రకారం తప్పనిసరైన 'కూలింగ్ ఆఫ్' పీరియడ్ గంగూలీకి మొదలుకానుంది. దీంతో క్రికెట్ పాలనాపరమైన కార్యకలాపాలకు అతడు దూరం కావాల్సి ఉంటుంది. ఈ మధ్య కాలంలోనే గంగూలీ చక్కబెట్టాల్సిన పనులెన్నో ఉన్నాయి. ఒకప్పుడు ఐసీసీని శాసించిన బీసీసీఐ.. నాయకత్వ లోపంతో భారీగా ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఐసీసీ కొత్త భవిష్యత్ టూర్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీపీ) కూడా బోర్డు రెవెన్యూను దెబ్బతీసే విధంగా ఉంది. ఈ సమయంలో ఐసీసీ, గంగూలీ అండ్ కో మధ్య వార్ నడిచే అవకాశం ఉంది.

*- ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం*

## జట్టును ఎలా నడిపానో.. బోర్డునూ!

**త**న కెప్టెన్సీలో జట్టును నడిపిన విధంగానే.. ఎటువంటికి అవినీతికి ఆస్కారం లేకుండా బోర్డును నడుపుతానని గంగూలీ స్పష్టం చేశాడు. ఎవరి ప్రలోభాలకు, ఒత్తిళ్లకూ లోనుకానని.. బోర్డు ప్రయోజనాల కోసం పాటుపడతానని బోర్డు నూతన చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గంగూలీ చెప్పాడు. అవేంటో అతని మాటల్లోనే..

'**బీ**సీసీఐ దృష్టిలో అందరూ సమానమే. ఎక్కడా అవినీతికి ఆస్కారమివ్వను. బోర్డు విశ్వసనీయత, గౌరవం కాపాడే విషయంలో రాజీ పడను. యాదృచ్ఛికమే కావచ్చు. కానీ నేను సారథ్య బాధ్యతలు స్వీకరించినప్పటి పరిస్థితులే ఇప్పుడూ కనిపిస్తున్నాయి. అప్పుడు కెప్టెన్ హోదాలో జట్టును ఎలా గాడిన పెట్టానో.. ఇప్పుడు బోర్డు చీఫ్‌గా పరిపాలనను దారిన పెడతా. బోర్డులో ఎన్నో సంస్కరణలు తీసుకురావాలి. రాష్ట్ర సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకు పోయాయి. దేశవాళీ క్రికెట్ అభివృద్ధికి పాటుపడతా.

**కోహ్లీకి పూర్తి సహకారం..**

భారత క్రికెట్‌లో అత్యంత కీలకమైన వ్యక్తి కోహ్లీ. అతడికి వీలైనంతగా సహకరిస్తూ అన్ని విధాలా అండగా నిలుస్తానే కానీ.. ఇబ్బందులు పెట్టను. గురువారం కోహ్లీతో మాట్లాడతా. నాలుగైదేళ్లుగా టీమిండియా ప్రదర్శన అద్భుతంగా ఉంది. కోచ్ రవిశాస్త్రి, టీమిండియా మేనేజ్‌మెంట్‌తో కలిసి అర్థవంతమైన చర్చ చేస్తా. అందరి ఆలోచనలకు, అభిప్రాయాలకు గౌరవం ఇస్తా. వేర్వేరు ఫార్మాట్లలో వేర్వేరు కెప్టెన్ల అంశం ఉత్పన్నం కాదు. కోహ్లీ అభిప్రాయపడినట్టుగా టెస్ట్‌లకు శాశ్వత వేదికల విషయమై అధ్యయనం చేయాలి.

**గొప్పవాళ్లు త్వరగా ముగించరు..**

ధోనీ భవితవ్యం విషయమై సందేహాలను నివృత్తి చేస్తా. రెండు వరల్డ్‌కప్‌లు అందించిన అతడికి సముచిత గౌరవం లభిస్తుంది. అయితే, ధోనీ మదిలో ఏముందో నాకు తెలీదు. ధోనీ ఇంతకాలం కొనసాగినందుకు దేశం గర్విస్తోంది. మహీ సాధించిన ఘనతలు చూస్తే ఎవరైనా వావ్ అనాల్సిందే. అతడు కెరీర్ వీడే సమయానికి సాధించిన వాటిని ఎవరైనా చూస్తే.. మావల్ల కాదనాల్సిందే. గొప్ప ఆటగాళ్లు ఎవరూ అంత త్వరగా ముగించరు.'

## ప్రవీణ్ స్వర్ణ చరిత్ర



### ఉషు ప్రపంచ చాంపియన్‌షిప్

**షాంఘై:** భారత ఉషు క్రీడాకారుడు ప్రవీణ్ కుమార్ అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రపంచ ఉషు చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. 48 కిలోల విభాగంలో పోటీపడ్డ ప్రవీణ్ స్వర్ణ పతకం కొల్లగొట్టి ఈ ఘనత సాధించిన తొలి భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. బుధవారం జరిగిన ఫైనల్లో ప్రవీణ్ 2-1తో పిలిప్పీన్స్‌కు చెందిన రస్సెల్ దియాజ్‌ను ఓడించి టైటిల్ అందుకున్నాడు. 2017లో భారత క్రీడాకారిణి పూజా కడియాన్ ప్రపంచ ఉషు చాంపియన్‌గా నిలిచింది. పురుషుల్లో మాత్రం భారత్ నుంచి ప్రపంచ విజేత అవతరించడం ఇదే తొలిసారి. కాగా.. తాజా టోర్నీలో మిగతా భారత క్రీడాకారుల్లో మహిళల 75 కిలోల విభాగంలో పూనమ్, 52 కిలోల్లో సనతోయ్ దేవి రజత పతకాలు సాధించగా.. పురుషుల 60 కిలోల కేటగిరీలో విక్రాంత్ కాంస్యంతో మెరిశాడు.

## ఫైనల్లో కర్ణాటక X తమిళనాడు

**బెంగళూరు:** విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక, తమిళనాడు జట్లు ఫైనల్లోకి ప్రవేశించాయి. శుక్రవారం ఫైనల్ జరగనుంది. తొలి సెమీస్‌లో కర్ణాటక 9 వికెట్ల తేడాతో చత్తీస్‌గఢ్‌పై గెలిచింది. తొలుత చత్తీస్‌గఢ్ 49.4 ఓవర్లలో 223 రన్స్‌కు ఆలౌటైంది. అమన్‌దీప్ (78) రాణించాడు. ఛేదనలో ఓపెనర్లు దేవ్‌దత్ (92), కేఎల్ రాహుల్ (88) రాణించడంతో.. కర్ణాటక 40 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 229 రన్స్ చేసి అలవోకగా నెగ్గింది. రెండో సెమీస్‌లో తమిళనాడు 5 వికెట్ల తేడాతో గుజరాత్‌పై గెలుపొందింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించగా.. తొలుత గుజరాత్ 9 వికెట్లకు 177 పరుగులే చేసింది. ఛేదనలో తమిళనాడు 39 ఓవర్లలో 5 వికెట్లకు 181 రన్స్ చేసి నెగ్గింది.

## క్రికెట్‌కు నాయర్ గుడ్‌బై



**ముంబై:** వెటరన్ ముంబై ఆల్‌రౌండర్ అభిషేక్ నాయర్ క్రికెట్లోని అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత్ తరపున మూడు వన్డేలే ఆడిన 36 ఏళ్ల అభిషేక్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో 103 మ్యాచ్‌ల్లో ఆడాడు. ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో 13 సెంచరీలతో 5,749 రన్స్ చేయడంతో పాటు 173 వికెట్లు తీశాడు. కేరళకు చెందిన అభిషేక్ కుటుంబం కొంతకాలం హైదరాబాద్‌లో నివాసముంది.



## 3 ఫార్మాట్లలోనూ టాప్-10లో రోహిత్

**దుబాయ్:** భారత డాషింగ్ ఓపెనర్ రోహిత్ శర్మ క్రికెట్లోని మూడు ఫార్మాట్లలో టాప్-10లో చోటు సాధించిన మూడో భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో రోహిత్ ఈ ఘనత సాధించాడు. సౌతాఫ్రికాతో సిరీస్‌కు ముందు 44వ ర్యాంక్‌లో ఉన్న రోహిత్ ఇప్పుడు 34 స్థానాలు ఎగబాకి 10వ ర్యాంక్‌లో నిలిచాడు. ప్రస్తుతం రోహిత్ వన్డేలో రెండో స్థానంలో, టీ20ల్లో ఏడో స్థానంలో ఉన్నాడు. గంభీర్, విరాట్ కోహ్లీ తర్వాత మూడు ఫార్మాట్లలోనూ టాప్-10లో చోటు దక్కించుకున్న ఆటగాడు రోహితే. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో రాణించిన భారత టెస్టు వైస్ కెప్టెన్ రహానె కెరీర్ బెస్ట్ 5వ ర్యాంక్ సొంతం చేసుకున్నాడు. బ్యాట్స్‌మెన్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా) టాప్‌లో కొనసాగుతుండగా.. విరాట్ 2వ, పుజారా 4వ స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో ప్యాట్ కమిన్స్ (ఆస్ట్రేలియా) అగ్రస్థానంలో ఉండగా.. బుమ్రా 4వ, అశ్విన్ 10వ ర్యాంకుల్లో నిలిచారు.

## ఆ రూ. 40 లక్షలు నాకొద్దు



గుహ

**న్యూఢిల్లీ:** బీసీసీఐ కొత్త చీఫ్‌గా గంగూలీ బాధ్యతలు స్వీకరించడంతో సుప్రీం కోర్టు నియమిత క్రికెట్ పరిపాలక కమిటీ (సీఓఏ) కార్య నిర్వహణకు తెరపడింది. అయితే, ఇన్నాళ్లూ భారత క్రికెట్ వ్యవహారాలు పర్యవేక్షించినందుకుగాను సీఓఏ చీఫ్ వినోద్ రాయ్, సభ్యురాలు డయానా ఎడుల్జీకి 33 నెలల కాలానికిగాను చెరో రూ. 3.5 కోట్లు చెల్లించాలని బీసీసీఐ నిర్ణయించింది. వీరితో పాటు ఆరంభంలో కొన్నినెలలు సీఓఏ సభ్యులుగా పనిచేసినందుకుగాను విక్రమ్ లిమాయేకు రూ. 50.5 లక్షలు, రామచంద్ర గుహకు రూ. 40 లక్షలు ఇవ్వాలని బోర్డు భావించింది. కానీ, తనకు మాత్రం బోర్డు నుంచి ఒక్క రూపాయి కూడా అవసరం లేదని రామచంద్ర గుహ స్పష్టం చేశాడు. 'సీఓఏ సభ్యునిగా పనిచేయడం గౌరవంగా భావిస్తా. ఆ పదవిని డబ్బు కోసం చేపట్టలేదని నా తొలి సమావేశంలోనే చెప్పా. అందుకే నాకెలాంటి వేతనం అవసరం లేదు' అని బీసీసీఐకి రాసిన లేఖలో గుహ తెలిపాడు.

## ఐఎస్‌ఎల్‌లో గోవా గెలుపు

**గోవా:** నిరుడు ఐఎస్‌ఎల్ రన్నరప్..ఈ సీజన్‌లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన గోవా జట్టు విజయంతో లీగ్‌ను ప్రారంభించింది. బుధవారం ఆడిన తమ తొలి మ్యాచ్‌లో 3-0తో చెన్నైయిన్ జట్టును ఓడించింది. ఐఎస్‌ఎల్ తొలి మ్యాచ్ ఆడుతున్న సిమిన్‌లెన్ డోంజల్ ఆట 30వ నిమిషంలో తొలి గోల్ చేసి గోవా స్కోరు బోర్డు ఖాతా తెరిచాడు. ఆ తర్వాత స్టార్ స్ట్రయికర్ ఫెర్రాన్ కొరోమినాస్ (62వ ని), సబ్‌స్టిట్యూట్ కార్లోస్ పినా (81వ) గోల్స్ సంధించడంతో గోవా తిరుగులేని విజయాన్ని అందుకుంది.

## సైనా, సాత్విక్ ముందంజ

### శ్రీకాంత్, కశ్యప్ అవుట్
### ఫ్రెంచ్ ఓపెన్

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్లకు చుక్కెదురైంది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, పారుపల్లి కశ్యప్ ఆరంభంలోనే ఇంటిబాట పట్టారు. మహిళల సింగిల్స్‌లో సైనా ముందంజ వేసింది. బుధవారం జరిగిన తొలిరౌండ్లో శ్రీకాంత్ 15-21, 21-7, 21-14తో రెండోసీడ్ చో తిన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడాడు. మరో మ్యాచ్‌లో కశ్యప్ 11-21, 9-21తో కాలాంగ్ ఆగ్నస్ (హాంకాంగ్) చేతిలో ఓడాడు. హోరాహోరీగా సాగిన పోరులో సైనా 23-21, 21-17తో చియోంగ్ గాన్ యిపై గెలిచి రెండోరౌండ్‌లో ప్రవేశించింది. కాగా.. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ మినహా మిగతా భారత షట్లర్ల పోరాటం తొలిరౌండ్‌కే పరిమితమైంది. సాత్విక్-చిరాగ్ జంట 21-16, 21-14తో డచ్ ద్వయం జెల్లె మాస్-రాబిన్ టెబ్లింగ్‌పై గెలిచి రెండోరౌండ్ చేరింది. మహిళల డబుల్స్‌లో అశ్విని-సిక్కి ద్వయం, మిక్స్‌డ్‌లో సిక్కి-ప్రణవ్ చోప్రా ద్వయం ప్రత్యర్థుల చేతిలో ఓడి ఇంటిబాట పట్టారు.



సైనా

# కొత్త వనం!



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో అర్బన్ పార్క్‌లో మియావాకీ విధానంలో అభివృద్ధి చేసిన దట్టమైన అటవీ ప్రాంతం

- తక్కువ వ్యయం.. ఎక్కువ పచ్చదనం
- అటవీ అభివృద్ధికి మియావాకి ప్రయోగం
- చౌటుప్పల్‌లో విజయవంతమైన తంగేడు వనం
- రాష్ట్రవ్యాప్తంగా అమలుకు సిద్ధమైన అటవీ శాఖ

యాదాద్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటో చూశారా!? చిట్టడవిలా కనిపిస్తోందా!? యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో పెంచిన తంగేడు వనమిది! మియావాకి విధానంలో ఎకరం స్థలంలో పెంచిన మొక్కలు ఏడాదిలోనే అడవిని తలపిస్తున్నాయి. ఇక్కడ నాటిన మారేడు, నేరేడు, రేల, ఇప్ప, మోదుగు, రోజ్‌వుడ్, మద్ది, వేప, శ్రీగంధం, తాని, జమ్మి, టేకు, ఉసిరి, సీతాఫలం, వెదురు, గోరింటాకు తదితర మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ ప్రాంతమంతా దట్టమైన అడవిగా పచ్చదనం అలముకుంది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని అమలు చేయాలని అటవీ శాఖ నిర్ణయించింది. ఈ ఏడాది జిల్లాలోని రాచకొండ, లక్కారం, బీబీనగర్, కొండమడుగు, వీరారెడ్డిపల్లి, సిద్దిపేట జిల్లా గజ్వేల్, మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్ పరిసరాలు, నిజామాబాద్, ఆదిలాబాద్ అటవీ ప్రాంతాల్లో మియావాకి విధానం అమలు చేస్తున్నారు.

### ఏమిటీ మియావాకి!?

పరిమిత వ్యయం.. తక్కువ విస్తీర్ణం.. ఎక్కువ పచ్చదనం..దట్టమైన పచ్చదనం వృద్ధికి తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ చేపట్టిన వినూత్న ప్రయోగమే మియావాకి! వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన మొక్కలను నాటి పెంచడమే మియావాకి విధానం ప్రత్యేకత. అటవీ పునరుజ్జీవన పథకంలో భాగంగా క్షీణించిన అటవీ ప్రాంతంలోని ఒక్కో ఎకరంలో మియావాకి విధానంలో మొక్కలను నాటి పెంచడమే దీని లక్ష్యం. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టులతో అటవీ భూమి క్షీణిస్తోంది. దానికి పునరుజ్జీవం కలిగించడానికి పూర్తి శాస్త్రీయ పద్ధతులను అమలు చేయనున్నారు. అడవులు క్షీణించిన ప్రాంతంలో మట్టిని శుద్ధి చేయడం, వర్మీ కంపోస్టును వినియోగించి ఆ మట్టి స్వభావానికి అనుగుణంగా త్వరగా వృద్ధి చెందడానికి అవకాశాలున్న మొక్కలను గుర్తిస్తారు. వీటిని అడుగుకు ఒక మొక్క చొప్పున ఎకరానికి దాదాపు 4 వేల మొక్కలను నాటుతారు. ఇవి పెరిగాక ఒక్కదానికి మరొకటి అడ్డురాకుండా వృక్ష జాతులు, వాటి ఎత్తు ఆధారంగా మొక్కలు నాటే ప్రక్రియను పూర్తి చేస్తారు. ఈ పథకంలో కేవలం 2.50 లక్షల వ్యయంతో 45 రోజుల్లో ఎకరా విస్తీర్ణాన్ని అటవీ భూమిగా అభివృద్ధి చేయవచ్చునని నిరూపించారు.

## నెల రోజుల్లో అన్ని గ్రామాలకు ట్రాక్టర్లు



- రోడ్లపై చెత్త వేయొద్దు: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, అక్టోబరు 23: గ్రామాలు, పట్టణాలను చెత్త రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక చేపడుతున్నట్లు రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. చెత్తను తీసుకెళ్లడానికి నెల రోజుల్లో ప్రతి గ్రామానికి ట్రాక్టర్ అందజేస్తామన్నారు. పాలమూరు మునిసిపాలిటీలో ప్రతివార్డుకు ఒక ఆటోను ఇస్తామని, రోడ్లపై ఎవరూ చెత్త వేయడానికి వీల్లేదని చెప్పారు. ఆ మునిసిపాలిటీలో చేపడుతున్న ప్రత్యేక ప్రణాళికపై బుధవారం ఆయన సమీక్షించారు. వార్డులను తీర్చిదిద్దిన అధికారులను మంత్రి కేటీఆర్ సత్కరిస్తారని చెప్పారు.

# అమరావతో... హైమావతో...

### కమిటీ చెప్పినచోటే ఏపీ రాజధాని!.. ఆరు వారాల్లో నివేదిక ఇస్తుంది.. దేశంలోనే మేటి రాజధాని నిర్మిస్తాం

- మంత్రి బొత్స వెల్లడి
- పవన్‌కు అవగాహన లేదని వ్యాఖ్య



విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): "అది అమరాతి కావచ్చు! హైమావతి కావొచ్చు... ఇంకేదైనా వతి కావచ్చు! రాష్ట్ర రాజధాని ఏపీ ప్రజలందరి రాజధానిగా, 13 జిల్లాల ప్రజల ఆశలు తీర్చేలా ఉండాలి. దేశంలోనే మేటి రాజధానిని నిర్మిస్తాం" అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ రాజధాని ఎక్కడ అనుకూలమని సిఫారసు చేస్తే అక్కడే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీ సభ్యులు రాష్ట్రమంతా పర్యటించి, ప్రజల అభిప్రాయాలను సేకరించి... పని ప్రారంభించిన ఆరు వారాల్లో నివేదికను అందిస్తారని ప్రకటించారు. బుధవారం ఆయన విశాఖలోని వైసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. "రాజధాని ఏర్పాటుపై శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను చంద్రబాబు పక్కనపెట్టారు. నారాయణ కమిటీ వేసి మరీ అమరావతిని ఎంపిక చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా భవనం కట్టాలంటే పునాదికి ఐదు నుంచి పది అడుగుల లోతు తవ్వితే సరిపోతుంది. అమరావతిలో మాత్రం వంద అడుగులు తవ్వాలి" అని బొత్స పేర్కొన్నారు. రాజధాని ఏర్పాటుకు 33 వేల ఎకరాలు సమీకరించామంటూ చంద్రబాబు గొప్పగా చెబుతున్నారని... లక్ష ఎకరాలు ఇచ్చేందుకు కూడా ప్రజలు ముందుకువస్తారని వ్యాఖ్యానించారు. భూములు ఇవ్వడానికి రాష్ట్ర ప్రయోజనాలు ఒక్కటే కారణం కాదని, తమ తర్వాతి తరాలకు లబ్ధి చేకూరుతుందనే వ్యక్తిగత ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు.

### బాబులో పరివర్తన లేదు..

తనకు పేరు వస్తుందనే అమరావతిని పక్కన పెట్టారన్న చంద్రబాబు వ్యాఖ్యలపై మంత్రి బొత్స మండిపడ్డారు. ఆయనలో ఇంకా పరివర్తన రాలేదనిపిస్తోందని విమర్శించారు. సీమాంధ్రకు రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే... చంద్రబాబు ఐదేళ్లపాలన వల్ల ఏపీకి జరిగిన నష్టమే పూడ్చ లేనిదన్నారు.

### ఎందుకు గగ్గోలు...

'మీరు కట్టిన రాజధాని నగరాన్ని లేదా గ్రాఫిక్ సీడీని ఎవరైనా ఎత్తుకెళ్లిపోయారా? రూ.రెండు లక్షల కోట్ల ఆదాయం సృష్టించానంటున్నావ్. ఏదీ...అదెక్కడుంది? ఎందుకు ఈ గగ్గోలు" అని చంద్రబాబుపై బొత్స మండిపడ్డారు. తండ్రీకొడుకుల ఆక్రోశం చూస్తుంటే వియ్యంకుడికి, తోడల్లుడికి, బంధువులకు ఇచ్చిన భూములన్నీ పోతాయనే బాధ కనిపిస్తోందన్నారు. రాజధాని ఏర్పాటుపై తమ ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు స్పష్టత ఉందని... తండ్రీ కొడుకులకే లేదని విమర్శించారు. . చంద్రబాబు ప్రతి మాటలో కడుపుమంట కనిపిస్తోందని దుయ్యబట్టారు. ఏపీ పోలీసులపై నమ్మకం లేదు కాబట్టి కోడికత్తి కేసు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు వివేకానందరెడ్డి హత్య కేసును ఎందుకు సీబీఐకి అప్పగించలేదని విలేకరులు ప్రశ్నించగా... రాష్ట్ర పోలీసులు సమర్థులే అని, చంద్రబాబు ఒత్తిడి చేస్తున్నారు కాబట్టే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశామని బొత్స బదులిచ్చారు. సీబీఐ కేసులున్న వ్యక్తి సీఎం కావడంతో వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టుపెడుతున్నారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను మంత్రి వద్ద ప్రస్తావించగా... "ఆయనకు అవగాహన లేదు. కేంద్రం వద్ద ఏ ప్రయోజనాలను తాకట్టుపెట్టారో చెప్పాలి" అని సవాల్ విసిరారు.

### జీఎన్ రావు కమిటీ తొలి భేటీ

రాజధాని ఎంపికతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులను సమీక్షించి, తగు ప్రణాళికల రూపకల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జీఎన్ రావు (రిటైర్డ్ ఐఏఎస్) కమిటీ మొట్టమొదటిసారి బుధవారం భేటీ అయ్యింది. ఈ కమిటీ పని ప్రారంభించిన ఆరు వారాల్లోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అమరావతితోపాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, అన్ని వర్గాల వారితో సంప్రదింపులు జరిపిన అనంతరం... సూచనలను కమిటీ అందజేయనుంది. బుధవారం సమావేశమైన కమిటీ సభ్యులు తమ కార్యాచరణపై చర్చించారు.









Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307,
RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.